అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 11-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 142 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు

భరణానికి అర్హులే
సుప్రీం తీర్పు

భరణం దాతృత్వం కాదు... దానికి మతంతో సంబంధం లేదు

మహిళలందరికీ సీఆర్‌పీసీ సెక్షన్ 125 వర్తింపు

వివరాలు 11లో..



పార్టీ విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

సహకార బలోపేతానికి కొత్త అవకాశాలు

ఆస్ట్రియా చాన్సలర్‌తో మోడీ భేటీ

ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలపై సుదీర్ఘంగా చర్చ

యుద్ధానికి సమయం కాదంటూ మోడీ పునరుద్ఘాటన



వియన్నా : భారత్, ఆస్ట్రియాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు గల కొత్త అవకాశాలను గుర్తించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. రాబోయే దశాబ్ద కాలంలో సహకారానికి బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సంబంధాలకు వ్యూహాత్మక దిశా నిర్దేశాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. మాస్కోలో రెండు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్న మోడీ, ఆస్ట్రియా ఛాన్సలర్ కర్ల్ నెహమర్‌తో చర్చలు జరిపారు. అనంతరం నెహమర్‌తో కలిసి మోడీ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తమ చర్చలు అర్థవంతంగా సాగాయని మోడీ చెప్పారు. ఉక్రెయిన్‌లో యుద్ధం, పశ్చిమాసియాలో పరిస్థితులతో సహా ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న వివాదాలన్నింటిపై సవివరంగా చర్చించినట్లు చెప్పారు. యుద్ధానికి ఇది సమయం ...11లో

రైతులతో నేరుగా మాట్లాడండి

భూసేకరణలో మానవీయత ఉండాలి

త్రిబుల్ ఆర్ అంతటికీ ఒకే నెంబర్

అటవీ భూములకు ప్రత్యామ్నాయం : కలెక్టర్లకు సీఎం ఆదేశాలు



జాతీయ రహదారుల నిర్మాణాలపై సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జాతీయ రహదారులకు భూసేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో ఆమేరకు రైతులకు దక్కేలా చూడాలని చెప్పారు. బుధవారం రాష్ట్రంలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా, భూసేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని సీఎం ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువగా ఉండడం, మార్కెట్‌లో ధరలు అధికం కావడంతోనే భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని సీఎం ప్రశ్నకు కలెక్టర్లు బదులిచ్చారు. ఇందుకు స్పందించిన సీఎం తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులను పిలిచి నేరుగా మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దనీ, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు సీఎం తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ఎన్‌హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూసేకరణలో ఉన్న ఆటంకాలపై సీఎం ఆరా తీశారు. అలైన్‌మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారనీ, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి-భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్‌కు, సీఎం సూచించారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని సీఎం అడిగారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందనీ, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ ...2లో

సంకీర్ణమైనా

సరళీకరణ విధానాలే

చంద్రబాబు, నితీశ్ వాటికి అనుకూలమే

- కార్పొరేట్ శక్తుల సేవకుడిగా మోడీ
- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి శృంగభంగం
- ప్రజల్లో భరోసా కల్పించిన ఇండియా బ్లాక్
- దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడమే మా లక్ష్యం
- ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తున్న కేంద్రం
- సెస్ వసూళ్లలో రాష్ట్రాలకూ వాటా ఇవ్వాలి
- రేవంత్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ఉద్యమిస్తాం
- అవకాశవాద రాజకీయాలను బీఆర్ఎస్ వీడాలి
- మతోన్మాదంపై విశాల ప్రాతిపదికన పోరాడాలి : విస్తృత సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పిలుపు వివరాలు 12లో

బీజేపీని నిలువరించటమే మా కర్తవ్యం



ఆ పోరాటంలో ఎవరు కలిసొస్తే వారిని కలుపుకునిపోతాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 3లో

హక్కుల కోసం కేంద్రంపై పోరాడాలి...



విభజన అంశాలపై మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలి : రేవంత్ సర్కారుకు ఎస్ వీరయ్య సూచన

వివరాలు 3లో

డీజీపీగా జితేందర్

హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా రవిగుప్తా


బాధ్యతలు స్వీకరించిన ఇరువురు అధికారులు

నేర రహిత రాష్ట్రమే లక్ష్యం : డీజీపీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డీజీపీ)గా జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ప్రస్తుత డీజీపీ డాక్టర్ రవిగుప్తాను రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేసింది. రాష్ట్ర డీజీపీగా ఆరు నెలల కిందట రవిగుప్తాను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అప్పటి డీజీపీ అంజనీకుమార్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయన్ను ఆ పదవి నుంచి ఈసీ తప్పించిన సంగతి విదితమే. ఆయన స్థానంలో రవిగుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు ఆయన స్థానంలో జితేందర్ డీజీపీగా నియమితు లయ్యారు. ఆయన బుధవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో డీజీపీ కార్యాలయానికి చేరుకుని డాక్టర్ రవిగుప్తా నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన డీజీపీ జితేందర్‌కు సీనియర్ ఐపీఎస్ అధికారులు సంజయ్‌కుమార్ జైన్, షికాగోయల్, శివధర్‌రెడ్డి, వి.వి.శ్రీనివాసరావు, అభిలాష బిస్త్, స్వాతిలక్రా, సుమతితో పాటు నగర పోలీసు కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి, తదితర అధికారులు అభినందనలు తెలిపారు. 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జితేందర్ పంజాబ్ రాష్ట్రం జలంధర్‌కు చెందిన వారు. ఐపీఎస్ శిక్షణ పూర్తయ్యాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. నిర్మల్ ...11లో



10లో..

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు

శాంతి భద్రతల అదనపు డీజీగా మహేశ్ భగవత్

సాగుదారులకే భరోసా

రైతుభరోసా అమలుపై మెజార్టీ అభిప్రాయం

ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా విస్తృత సమావేశం

క్యాబినెట్ సబ్‌కమిటీ నేతృత్వంలో అభిప్రాయ సేకరణ

హాజరైన కన్వీనర్, డిప్యూటీ సీఎం భట్టి, సభ్యులు తుమ్మల, పొంగులేటి

రైతులు, రైతు సంఘాల నాయకులు వందలాది మంది అభిప్రాయాలు వెల్లడి

పూర్తిస్థాయి బడ్జెట్ సమయంలో విధివిధానాలు : భట్టి



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, వేదికపై మంత్రులు తుమ్మల,పొంగులేటి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎవరైతే భూమి సాగు చేస్తున్నారో.. ఎన్ని ఎకరాలు సేద్యం చేస్తున్నారో.. అంత మొత్తానికి రైతుభరోసా' ఇవ్వాలని.. కౌలు రైతా? పట్టేదారా? అనేదానితో నిమిత్తం లేకుండా పంట పెట్టుబడి సహాయం చేయాలని మెజార్టీ అభిప్రాయం ...2లో



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్

డిమాండ్స్ డేలో పాల్గొన్న కార్మికులు.. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు

నవతెలంగాణ - ముషీరాబాద్/విలేకరులు

కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ, మున్సిపల్, భవన నిర్మాణ రంగం తదితర రంగాల కార్మికులు తమ హక్కులు, సమస్యలపై ధర్నాలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ...10లో

నాట్కో పరిశ్రమలో ప్రమాదం


ఒకరు మృతి, మరొకరికి గాయాలు



(ఫైల్)

నవతెలంగాణ కొత్తూరు

నాట్కో పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేక గూడా గ్రామ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంజర్ల గ్రామానికి చెందిన రవి (19) అదే గ్రామానికి చెందిన అర్బాజ్ అనే కాంట్రాక్టర్ వద్ద రెండు నెలలుగా నాట్కో పరిశ్రమలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం విధుల్లో ఉండగా బూమ్ లైట్ యంత్రంలో ఆయిల్ లీకేజీ ఉండటంతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా మరమ్మత్తులు చేయిస్తుండగా ఒక్కసారిగా యంత్రం పై నుంచి అతనిపై పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రవి మృతిచెందాడు. గాయాలైన మరో వ్యక్తి.. మహేష్ ప్రస్తుతం స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని తల్లి వీర్లపల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



లీకు వీరుడు బేడీ రామ్

నీట్ లీక్ ఆరోపణలు, యూజీసీ-నెట్ రద్దు నేపథ్యంలో వినిపిస్తున్న పేరు

- ఈయన యూపీలో బీజేపీ మిత్రపక్షం ఎస్‌బీఎస్‌పీ ఎమ్మెల్యే
- గతంలో రైల్వే నుంచి రాష్ట్ర రిక్రూట్‌మెంట్ల వరకు హస్తం
- బేడీ రామ్‌పై అనేక పరీక్షా పత్రాల లీక్ ఆరోపణలు
- పలు రాష్ట్రాల్లో కేసులు.. కొట్టి పారేసిన ఎస్‌బీఎస్‌పీ

దేశంలో నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు, నీట్-పీజీ, యూజీసీ-నెట్ వంటి పరీక్షల రద్దు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. 'నీట్-(అండర్ గ్రాడ్యుయేట్)యూజీ' లీక్‌కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో గతంలోనూ జరిగిన పలు పరీక్షలకు సంబంధించిన లీక్ ఆరోపణలు దేశంలో చర్చకు వస్తున్నాయి. ఇందులో భాగంగా యూపీలో బీజేపీ మిత్రపక్షం సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ)కి చెందిన ఎమ్మెల్యే బేడీ రామ్ పేరు మళ్లీ తెర పైకి వచ్చింది.



న్యూఢిల్లీ : "నేను వివిధ రాష్ట్రాలలో 40-50 మందిని రిక్రూట్ చేయిస్తాను. నేను ఇతర రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, బీహార్, తెలంగాణ, ఎంపీలో రిక్రూట్‌మెంట్‌లను పూర్తి చేస్తున్నాను. దాని(పేపర్) రద్దుతో సంబంధం లేకుండా ఫలితాలు వచ్చే వరకు మాత్రమే నా బాధ్యత" అని బేడీ రామ్ చెప్పిన మాటలకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బేడీ రామ్.. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో ఉన్న జఖానియన్ ఎమ్మెల్యే. ఆయన బీజేపీ మిత్రపక్షమైన ఎస్‌బీఎస్‌పీ సభ్యుడు. ఆ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. ఎస్‌బీఎస్‌పీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్.. యోగి తొలి క్యాబినెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. నీట్-యూజీ మెడికల్ ప్రవేశ పరీక్షలో ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణలు, యూజీసీ-నెట్ పరీక్ష రద్దుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలోనే బేడీ రామ్‌కు సంబంధించిన ఈ వీడియో బయటకు వచ్చింది. అయితే బేడీరామ్ 2009 నుంచి వ్యాపారంలో ఉన్నట్టు తెలుస్తున్నది. రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్షలతో పాటు మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీపీఎస్సీ) నియామకాల్లో ప్రశ్న పత్రాలను లీక్ చేయటం, అక్రమమైన పద్ధతులను అభ్యసించినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. కొన్ని వార్త కథనాల ప్రకారం.. మోసం చేయటం, ప్రశ్నపత్రాలను లీక్ చేయటం వంటి ఇతర ఆరోపణలతో ఆయనపై తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇంతకీ బేడీ రామ్ ఎవరు? ఆయనపై ఉన్న అభియోగాలు ఏమిటి? నిశితంగా పరిశీలిద్దాం.

మూడు రాష్ట్రాల్లో తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు

యూపీలోని జౌన్‌పూర్‌వాసి అయిన బేడీ రామ్(62) ఓం ప్రకాష్ రాజ్‌భర్ పార్టీ ఎస్‌బీఎస్‌పీలో ప్రముఖ దళిత నాయకుడు. ఆయన మాట్లాడుతున్నట్టుగా చెప్పబడుతున్న వీడియో వైరలైన తర్వాత.. యోగితో పాటు యూపీ ఉపముఖ్యమంత్రులు ...11లో

బిజినెస్

లక్షలాది మోసపూరిత ఖాతాలు

- ఎన్‌బీఎఫ్‌సీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ)ల్లో లోపాలు
- సీఎఫ్‌ఓ (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్)లు సీరియస్‌గా తీసుకోవాలి : ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ ఆందోళన



న్యూఢిల్లీ : బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థల్లో ఇటీవల లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరిగిపోతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె అన్నారు. మోసపూరిత లావాదేవీలు, ఎవర్‌గ్రీనింగ్ రుణాల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాలు ఇటీవల పెరిగాయన్నారు. కొన్ని బ్యాంకులు ఇలాంటి లక్షలాది ఖాతాలను కలిగి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. రుణగ్రహీత చెల్లించిన ప్రిన్సిపల్ మొత్తంను మళ్లీమళ్లీ రుణ రూపంలో ఖాతాదారులకు ఇవ్వడాన్ని ఎవర్‌గ్రీనింగ్ రుణాలుగా భావిస్తారు. మంగళవారం బ్యాంకుల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు, ఆడిటర్లతో జరిగిన సమావేశంలో స్వామినాథన్ మాట్లాడుతూ.. అంతర్గత ఖాతాల నియంత్రణ, నిర్వహణలో లోపాలు ఉన్నాయని విత్త సంస్థలను ఉద్దేశించి అన్నారు. కొన్ని బ్యాంకులకు సరైన కారణం లేకుండా లక్షలాది ఖాతాలు కలిగి ఉండటాన్ని తాము గుర్తించామన్నారు. గత వారం బ్యాంక్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలోనూ మోసపూరిత ఖాతాలపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు.

డిజిటల్ మోసాలను అరికట్టాలని సూచించారు. ఈ ఖాతాల్లో కొన్ని మోసపూరిత లావాదేవీలు, రుణాల ఎవర్ గ్రీన్ కోసం వినియోగిస్తున్నట్లు స్వామినాథన్ తెలిపారు.

ఈ ఖాతాలతో దుర్వినియోగానికి అవకాశం ఉన్నందున వాటిని హేతుబద్ధీకరించాలని సూచించారు. వీలైనంత వరకు తగ్గించాలన్నారు. సంస్థల ఆర్థిక సమగ్రతను, పారదర్శకతను కాపాడుకోవడంలో సీఎఫ్‌ఓలు కీలక పాత్రను పోషించాలన్నారు. పలు బ్యాంకుల్లో సరైన కారణం లేకుండా కొనసాగిస్తున్న లక్షలాది ఖాతాలు కొన్ని మోసపూరిత లావాదేవీలకు మద్దతును ఇస్తున్నాయన్నారు. విత్త సంస్థల్లో పారదర్శకత పెంచడానికి ఆడిటర్లు, సీఎఫ్‌ఓలు నిజాయితీతో వ్యవహరించాలని మరో డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు సూచించారు. ఎన్‌బీఎఫ్‌సీలలో మార్గదర్శకాల అమలు లోపించిందన్నారు.

హైదరాబాద్‌లో మెడ్‌ట్రానిక్ విస్తరణ

- గ్లోబల్ ఐటీ సెంటర్ ఏర్పాటు : ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ : మెడికల్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న అమెరికాకు చెందిన మెడ్‌ట్రానిక్ కంపెనీ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ ఐటి సెంటర్‌ను బుధవారం ఐటి శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, మెడ్‌ట్రానిక్ ఎస్‌విపి అండ్ సిఇఒ రష్మి కుమార్, ఎంఇఐసి సైట్ లీడర్ దివ్యా జోషి లాంచనంగా ప్రారంభించారు. మెడ్‌ట్రానిక్ ఇక్కడ కార్యకలాపాలను విస్తరించడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత అనుకూలమన్నారు. ఇక్కడి నైపుణ్యాలను ఉపయోగించుకోవడానికి వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో 60 మిలియన్ డాలర్లు (రూ.500 కోట్లు) పెట్టుబడుల వ్యయం చేయనున్నట్లు ఆ కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ సంస్థ నగరంలో మెడ్‌ట్రానిక్ ఇంజినీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కలిగి ఉంది. గ్లోబల్ ఐటి సెంటర్ అనేది యూఎస్ వెలుపల మెడ్‌ట్రానిక్‌కు అతిపెద్ద కేంద్రంగా కావడం విశేషం. వచ్చే ఐదేండ్లలో 300 కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించనున్నామని ఆ సంస్థ తెలిపింది.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి మద్దతు

- అసోచామ్ ప్రతినిధుల వెల్లడి

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధిని కొనసాగించడానికి ఇరు ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని అసోచామ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ చైర్మెన్ కటారు రవి కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాలో 2024-25కు గాను అసోచామ్ తొలి ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి రవి కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. దీనికి ఆ సంస్థ ప్రతినిధులు శ్రీధర్ పిన్నపురెడ్డి, బన్సిధర్ బండి తదితరులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని రవి కుమార్ అన్నారు. సమ్మిళిత, స్థిరమైన సామాజిక ఆర్థిక వృద్ధిని సాధించాలనేదే తమ లక్ష్యమన్నారు.

జీజీ ఇంజినీరింగ్ విలీనానికి ఇంటెగ్రా బోర్డు ఆమోదం

న్యూఢిల్లీ : జీజీ ఇంజినీరింగ్ విలీనానికి తమ బోర్డు ఆమోదం తెలిపిందని ఇంటెగ్రా ఎసెన్షియా లిమిటెడ్ తెలిపింది. తమ ప్రతిపాదన ప్రక్రియ స్టాక్ మార్కెట్లు, సెబీ, ఎన్‌సిఎల్‌టి, వాటాదారుల ఆమోదానికి లోబడి ఉంటుందని పేర్కొంది. నిర్మాణం, మౌలిక వసతులు, పరిశ్రమలు తదితర ప్రాజెక్టులకు జీజీ ఇంజనీరింగ్ సొల్యూషన్స్‌ను అందిస్తుందని తెలిపింది.

మార్చి కల్లా 35 స్టోర్లకు విస్తరణ

- నగరంలో రివర్ ఇవి తొలి స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న విద్యుత్ స్కూటర్ల తయారీ కంపెనీ రివర్ హైదరాబాద్‌లో తన తొలి స్టోర్‌ను ఏర్పాటు చేసింది. బుధవారం దీనిని ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు అరవింద్ మణి లాంచనంగా ప్రారంభించారు. కూకట్‌పల్లిలో శ్రీరాజరాజేశ్వర ఈవీ మొబిలిటీ సహకారంతో ఏర్పాటు చేసిన స్టోర్‌లో ఇండి స్కూటర్లు, యాక్సెసరీలు, మెర్చండైజ్ లాంటి సేవలన్ని లభిస్తాయన్నారు. ఇది తమకు మూడో స్టోర్ అని తెలిపారు. సెప్టెంబర్ కల్లా 10 స్టోర్లకు, 2025 మార్చి కల్లా దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో 35-40 అవుట్‌లెట్‌లు తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ నెలలోనే చెన్నయ్‌లో కొత్త స్టోర్‌ను ప్రారంభించనున్నామన్నారు ఇండీ స్కూటర్ ఎక్స్‌షోరూం ధరను రూ.1,38,000గా నిర్ణయించామన్నారు.

అట్టహాసంగా సూత్రా ఎగ్జిబిషన్ ప్రారంభం



హైదరాబాద్ : వచ్చే రాఖీ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని సూత్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ప్రదర్శన బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణలో దీనిని మిస్ గ్రాండ్ ఇండియా 2022 ప్రాచీ నాగ పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయతలు, ఆధునిక ఫ్యాషన్లు ప్రతిబింబించు వస్త్రాలు, వివిధ ఉపకారణాలు ప్రదర్శిస్తునలో ఉంచడం అభినందనీయమన్నారు. రాఖీ టీజ్ కొరకు ప్రత్యేకమైన ఫ్యాషన్ దుస్తులు, ప్రత్యేక కలెక్షన్లు, ఆభరణాలు, ఉపకరణాలు వంటివి ఎన్నెన్నో అందుబాటులో ఉన్నాయని సూత్ర ఎగ్జిబిషన్ చైర్మెన్ ఉమేష్ తెలిపారు.

షెల్ ఇండియాతో ఎంజీ మోటార్ జట్టు

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా విద్యుత్ వాహనాల కోసం పబ్లిక్ చార్జింగ్ మౌలికసదుపాయాలు పెంచడానికి షెల్ ఇండియా మార్కెట్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తెలిపింది. దీంతో తమ వినియోగదారులకు షెల్ ఇండియా స్టేషన్లలో సిసిఎస్ 50కెడబ్ల్యు, 60 కెడబ్ల్యు డిసి ఫాస్ట్ చార్జర్స్‌ను అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొంది.

అభివృద్ధి పేరిట బతుకులు చిన్నాభిన్నం

- ప్రజ్ఞాపూర్ రహదారిపై రైతుల రాస్తారోకో
- ప్రాజెక్టుల పేరిట గత ప్రభుత్వం ప్రాణాలు తీస్తే.. మళ్లీ ట్రిబుల్ ఆర్ పేరుతో మా బతుకులు ఆగం
- అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు..
- భూమికి నష్టపరిహారం డబ్బు వద్దు..
- భూమికి భూమి ఇప్పించండి



రీజినల్ రింగ్ రోడ్ బాధితులు

నవతెలంగాణ- గజ్వేల్ రూరల్

"పదేండ్లుగా ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం రైతుల బతుకులు రోడ్డుపాలు చేసింది.. ప్రస్తుతం ప్రజల ప్రభుత్వం అని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. రైతుల బతుకుల్లో చీకటి నింపొద్దు.. ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి మేం వ్యతిరేకం కాదు.. పదేండ్లలో దగాపడ్డ జీవితాలు ఇప్పుడిప్పుడే దారికి వస్తున్నాయి.. అభివృద్ధి పేరిట మా బతుకులు చిన్నాభిన్నం చేయొద్దు" అంటూ గజ్వేల్ నియోజకవర్గ రైతులు ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. అనంతరం రాజీవ్ రహదారిపై మోకాళ్లపై బైఠాయించి, సాష్టాంగ నమస్కారం చేస్తూ ధర్నా చేపట్టారు. ట్రిబుల్ ఆర్ నిర్మాణం వల్ల గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా 4750 ఎకరాల భూములను కోల్పోతున్నామని బాధితులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట ఇప్పటికే మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు, ఔటర్ రింగ్ రోడ్డు పేరిట రైతుల భూములు ప్రభుత్వం గుంజుకుందని, ఉన్న కొద్దిపాటి భూములను ఇప్పుడు ట్రిబుల్ ఆర్ పేరిట ప్రభుత్వం గుంజుకోవాలని చూస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. భూములు కోల్పోయిన రైతులు.. మనస్తాపం చెంది గుండెపోటుతో కొంతమంది, పురుగుల మందు తాగి కొంతమంది మృతిచెందారని గుర్తుచేశారు. భూమి ఉంటేనే గ్రామంలో అవసరాలకు షావుకారులు డబ్బులు ఇస్తారని, భూమి లేకుంటే ఆపద సమయంలో ఎవరూ ఆదుకోరని తెలిపారు. ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడానికి వీలు కాకపోతే ప్రభుత్వం ఇచ్చే ఏ ప్యాకేజీలు తమకు వద్దన్నారు. రైతుల దగ్గర ఎంత భూమి తీసుకుంటే అంతే భూమి మరెక్కడైనా రైతులకు అందజేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇస్తే.. తమ సమస్యను విన్నవించుకుంటామని తెలిపారు. దీనిలో ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదని, కేవలం రైతులమే ధర్నా చేస్తున్నామని స్పష్టంచేశారు. భూ నిర్వాసితుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని రైతుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ ధర్నాలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



సాగుదారులకే భరోసా

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడైంది. రైతుభరోసాపై ఉమ్మడి ఖమ్మం జిల్లా విస్తృత సమావేశం ఖమ్మం ఐడీవోసీలో బుధవారం నిర్వహించారు. రైతుభరోసా' క్యాబినెట్ సబ్ కమిటీ కన్వీనర్, ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం మూడు గంటలపాటు కొనసాగింది. వందలాది మంది రైతులు, రైతుసంఘాల నేతలు, రైతు ప్రతినిధులు, లాయర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, వివిధ వర్గాలకు చెందిన అనేక మంది ఈ సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సాగుదారులందరికీ 'భరోసా' ఇవ్వాలి

ఎవరైతే సేద్యం చేస్తున్నారో.. ఎంత మొత్తం సాగు చేస్తున్నారో.. అన్ని ఎకరాలకూ 'రైతుభరోసా' పంట పెట్టుబడి సహాయం అందించాలని మెజార్టీ రైతులు, రైతుసంఘాల నేతలు తదితరులు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు 2011లో కౌలుదారీ చట్టాన్ని అమలు చేశారని, దాన్ని యథాతథంగా అమలు చేయాలని తెలంగాణ రైతుసంఘం నాయకులు కోరారు. ఆ తర్వాత పది ఎకరాలకు కటాఫ్ విధిస్తే మంచిదని మెజార్టీ రైతులు అభిప్రాయపడ్డారు. ఇవేవీ లేకుండా పంట ఉత్పత్తులపై బోనస్, గతంలో లాగా మెరుగైన పంట దిగుబడి సాధించేందుకు ప్రోత్సాహకంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఇరిగేషన్, పైపులైన్లు, వ్యవసాయ యంత్ర పరికరాలకు సబ్సిడీ ఇవ్వాలని కోరారు. రైతుభరోసా, రైతుబీమాతో పాటు పంటనష్ట పరిహారం కూడా చెల్లించాలని కొందరు అడిగారు.

కౌలుదారులకు ఎలా చెల్లించాలి: ప్రశ్నించిన భట్టి

కౌలు రైతులకు ఎలా చెల్లించాలని మల్లు భట్టివిక్రమార్క రైతులను ప్రశ్నించారు. 2011 కౌలుదారీ చట్టాన్ని ఆచరణలో పెడితే ఇది సాధ్యమని తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు సూచించారు. కౌలుదారునికి పంటలపై బోనస్ ఇవ్వాలని కొందరు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు సహాయం చేయాలని మరికొందరు వివరించారు. ఏడాది కాలపరిమితితో కౌలు రాయించుకునే విధానాన్ని అమలు చేయాలని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.

ఆంధ్రా రైతులకు ఇక్కడ ఇవ్వొద్దు..

ఆంధ్రా రైతులకు తెలంగాణలో భూములుంటే రైతుభరోసా' ఇస్తున్నారని, తెలంగాణ రైతులకు ఆంధ్రాలో ఉంటే మాత్రం ఎలాంటి సహాయం అక్కడి ప్రభుత్వాలు ఇవ్వట్లేదని గుర్తుచేశారు. కాబట్టి ఆంధ్రా రైతులకు ఇచ్చే పెట్టుబడి సహాయాన్ని నిలిపివేయాలని కోరారు. అలాగే రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా కన్వర్షన్ కాకుండా ఉన్న రియల్ ఎస్టేట్ భూములు, ఆర్‌ఎస్‌ఆర్ పెరిగి డబుల్ ఎంట్రీలున్న భూములు, సాగు చేయని ఇతరత్ర భూములకూ రైతుభరోసా కట్ చేయాలని దాదాపు అందరూ అభిప్రాయపడ్డారు.

పూర్తిస్థాయి బడ్జెట్ సమయంలో రైతుభరోసా విధివిధానాలు: భట్టి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి వచ్చిందని భట్టి గుర్తుచేశారు. కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రానికి వచ్చే నిధులకు అనుగుణంగా త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. దీనికి ముందే విధివిధానాల రూపకల్పనపై ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని తాను (భట్టి) కన్వీనర్‌గా, మంత్రులు తుమ్మల, పొంగులేటి, శ్రీధర్‌బాబు సభ్యులుగా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ నాటికి రైతుభరోసా విధివిధానాల రూపకల్పనకు ఈ అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు వివరించారు.

ఐటీ పేయర్స్‌కు మాత్రమే 'భరోసా' ఉండదు: మంత్రి తుమ్మల

ఐటీ రిటర్న్స్, రేషన్‌కార్డు లేనివారికి రైతుభరోసా ఇవ్వరనే చర్చ నేపథ్యంలో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, విదేశాలకు వెళ్లాలన్నా.. ఇండ్ల నిర్మాణ రుణాల కోసం రైతులు ఐటీ రిటర్న్స్ కలిగి ఉంటారని వివరించారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందించారు. ఐటీ పేయర్స్‌కు మాత్రమే భరోసా వర్తించదని సమాధానం ఇచ్చారు. రేషన్‌కార్డుతో నిమిత్తం లేదన్నారు. పేద రైతులకు భరోసా ఇవ్వడానికి ప్రభుత్వం విశాల దృక్పథంతో వ్యవహరిస్తుందని స్పష్టంచేశారు. గతంలో లోపాలు, ఆర్థిక నష్టాలు తలెత్తకుండా చిన్న, సన్నకారు రైతులకు చేయూతనివ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు.

ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ ప్రజలదే: మంత్రి పొంగులేటి

రాష్ట్రప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ వివిధ రూపాల్లో ప్రజలు చెల్లించిందేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకున్నదని, ఎక్కడా ప్రజాభిప్రాయానికి చోటివ్వలేదని విమర్శించారు. ప్రతి పైసాపై లెక్కలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలోని మిగతా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లోనూ ఇదే రకంగా అభిప్రాయం తీసుకుంటామన్నారు. ఎవరికి సాయం చేస్తే రైతులు ఆనందంగా ఉంటారో వివరాలు సేకరించి అమలు చేస్తామన్నారు.

ఈ సమావేశంలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, మాలోత్ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యవసాయ అధికారులు విజయనిర్మల, బాబూరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సన్నచిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- భాగం హేమంతరావు, రైతుసంఘం నాయకులు

త్వరితగతిన ధరణి పెండింగ్ ఫైల్స్‌ను క్లియర్ చేసి వీలైనంత ఎక్కువ మంది సాగుదారులకు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే లబ్ధి చేకూర్చాలి. గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో అన్ని సబ్సిడీలు ఎత్తివేసింది. 0శాతం రుణాలను పూర్తిగా తీసి వేశారు. పంటల బీమా పథకాన్ని త్వరితగతిన అమలు చేయాలి. 25 లక్షలకు పైగా ఉన్న రియల్ ఎస్టేట్ భూములను రైతుభరోసా కింద తొలగించాలి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ రకంగానైతే కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారో అదే విధంగా ఇప్పుడు కూడా ఇచ్చి 'భరోసా' కల్పించాలి. ఆర్బీఐ విధానం ప్రకారం 25 ఎకరాలకు పైబడిన రైతులు పెద్ద రైతుల కిందకు వస్తారు. కాబట్టి సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పట్టాతో నిమిత్తం లేకుండా సాగు భూములకు ఇవ్వాలి..

మాదినేని రమేష్, బొంతు రాంబాబు, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పట్టాతో నిమిత్తం లేకుండా సాగు భూములన్నింటికీ, సాగుదారులందరికీ భరోసా, బోనస్ ఇవ్వాలి. 2018 డిసెంబర్ 12కు ముందున్న పంట రుణాలను మాఫీ చేయాలి. గత ప్రభుత్వం మాఫీని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఖమ్మం జిల్లాలో 9వేల మంది, కొత్తగూడెం జిల్లాలో 1600 మంది నష్టపోయారు. కాబట్టి రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి 2023 డిసెంబర్ 9కి ముందున్న రుణాలన్నింటినీ మాఫీ చేయాలని కోరుతున్నాం.

తాకట్టులో ప్రభుత్వ భూములా !

- పరిశ్రమలకేమిస్తారు? యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి?: కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ భూములను ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలకు తాకట్టు పెడితే పరిశ్రమలకు భూములెలా కేటాయిస్తారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ప్రశ్నించారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలకు భూములు కేటాయించకపోతే యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రేవంత్ సర్కారుకు రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేత కావడం లేదని విమర్శించారు. నిధుల సమీకరణకు ప్రమాదకరమైన మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖకు చెందిన రూ.20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల భూములను తనఖా పెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తున్నట్టు సమాచారం ఉందని చెప్పారు.. ఇందుకోసం మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను ఉపయోగించుకుని రూ.100 కోట్లు కమిషన్ ఇచ్చేందుకు సిద్ధపడిందని తెలిపారు. హస్తం నాయకుల మతిలేని చర్యల కారణంగా రాష్ట్ర ప్రగతి శాశ్వతంగా కుంటుపడుతుందని తెలిపారు. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా యువత ఉద్యోగావకాశాలు కోల్పేయే ప్రమాదముందని హెచ్చరించారు.

కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తుంటాయనీ కేటీఆర్ గుర్తుచేశారు. అలాంటి చోట 400 ఎకరాలు ప్రయివేటు సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని ఆక్షేపించారు. గత ఏడు నెలలుగా పారిశ్రామిక రంగం స్థబ్దుగా మారి, పెట్టుబడులు రాక, సరైన ప్రోత్సాహం లేక కంపెనీలు కూడా పక్కచూపులు చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నేపథ్యంలో ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెట్టడం తగదని కేటీఆర్ హితవు పలికారు.

డిజిటల్ పురోగతికి అండగా ఉంటాం

- ఫోన్‌పే ప్రతినిధి అంకిత్ గౌర్

హైదరాబాద్ : దేశంలో డిజిటల్ పురోగతికి అండగా నిలుస్తామని ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే అండ్ ఆన్‌లైన్ మర్చంట్స్ విభాగం హెడ్ అంకిత్ గౌర్ అన్నారు. హైదరాబాద్‌లో కాన్ఫ్లూయెన్స్, కనెక్ట్ 2024 పేర్లతో పేమెంట్ గేట్‌వే సదస్సును విజయవంతంగా నిర్వహించినట్లు ఫోన్‌పే తెలిపింది. తమ భాగస్వాములను శక్తివంతం చేసే దిశగా ఈ అవగాహన, నెట్‌వర్కింగ్ సదస్సును ఏర్పాటు చేసినట్లు అంకిత్ గౌర్ పేర్కొన్నారు. తమ భాగస్వాములు, మర్చంట్‌ల అవసరాలను పరిష్కరించేలా ఒక ప్రత్యేక వేదికను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమానికి హెరిటేజ్ ఫుడ్స్ సిఇఒ శ్రీదీప్ కేశన్ సహా సహా 50 మంది ఇ-కామర్స్, డి2సి బ్రాండ్ ప్రతినిధులు హాజరయ్యారని ఆ సంస్థ తెలిపింది

ఫుడ్ సేఫ్టీ వ్యవస్థ సమూల ప్రక్షాళన

- మంత్రి దామోదర రాజనర్సింహా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు బుధవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. 17 మంది ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించినట్టు చెప్పారు. కొత్తగా 10 మొబైల్ ఫుడ్ ల్యాబ్‌లను త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు పేర్కొన్నారు. మొబైల్ ల్యాబ్స్ ద్వారా ప్రతి రోజు 200 ఫుడ్ సేఫ్టీ టెస్టులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీధి వ్యాపారులకు సేఫ్టీ లైసెన్సులు తీసుకు నేలా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 387 హాస్టళ్లను తనిఖీ చేసి ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు విధిగా కలిగి ఉండాలని ఆదేశాలిచ్చినట్టు వెల్లడించారు.



న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన బోనాల వేడుకల్లో తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

నేటినుంచి ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 అభ్యర్థులకు రీలింక్విష్‌మెంట్

- టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మెడికల్ ఎడ్యుకేషన్‌లో ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు గురువారం నుంచి రీలింక్విష్‌మెంట్ (ఒక పోస్టును ఉంచుకుని మిగిలిన పోస్టులను వదులుకోవడం) సౌకర్యం ఇస్తున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ తెలిపారు. ఈనెల 14న సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు సంబంధించి ఌఌ.ంజూం౧.ఞఠీఙ.జుఅ వెబ్‌సైట్‌లో లింకు అందుబాటులో ఉందని వివరించారు. 200 ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి 2017, డిసెంబర్ 18న నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.

డీసెట్‌కు 85.96 శాతం హాజరు

- రెండువారాల్లో ఫలితాలు
- కన్వీనర్ శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డీసెట్‌కు 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 15,150 (85.96 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. తెలుగు మాధ్యమానికి 9,698 మంది దరఖాస్తు చేస్తే, 8,189 (84.44 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. ఇంగ్లీష్, ఉర్దూ మీడియంకు 7,957 మంది దరఖాస్తు చేయగా, 6,961 (87.48 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఈనెల 15న ప్రాథమిక కీని ఌఌఌ.ఎవవఎ్.ఎంఎవ.'వశ్రీఖఅస్త్రుఖ.ఞఠీఙ.జుఅ వెబ్‌సైట్ ద్వారా విడుదల చేస్తామని తెలిపారు. రెండు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రైతులతో నేరుగా మాట్లాడండి

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్న కారణంగా, ప్రస్తుత ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కోరుతున్నారని చెప్పారు. దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదన్నారు. జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని సూచించారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్‌పాస్‌లు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్‌చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట రైతుల వాహనాలు, రైతులు వినియోగించుకునేలా మట్టి(గ్రావెల్) రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్‌చౌదరి తెలిపారు. మట్టి రోడ్లు నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని సీఎం అభిప్రాయపడ్డారు.

'సమన్వయంతో ముందుకు సాగండి'

ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, విజయవాడ-నాగ్‌పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీశాఖ భూముల బదలాయింపు సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దష్టికి అధికారులు తెచ్చారు. దీనికి సీఎం స్పందిస్తూ అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని సీఎం సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలనీ, ఏవైనా సమస్యలుంటే ఎన్‌హెచ్‌ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ -మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అంగీకరించారు.

రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్‌చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన ఇందుకు బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు వి.శేషాద్రి, మాణిక్‌రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు కె.ఎస్ శ్రీనివాసరాజు, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు పాల్గొన్నారు.

అది ధృతరాష్ట్ర కౌగిలి !


మిత్రపక్షాలు అనేక ఎన్డీఏకు గుడ్‌బై చెప్పాయి. (ఫైల్)

న్యూఢిల్లీ : బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి అన్న నానుడి ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో మరోసారి రుజువైంది. పలు భాగస్వామ్య పక్షాలు కనుమరుగైపోగా, మరికొన్ని ప్రాభవాన్ని కోల్పోయాయి. రాష్ట్రాల్లో బీజేపీని వ్యతిరేకిస్తూ, కేంద్రంలో కొమ్ముకాసిన పార్టీలూ మట్టికరిచాయి. అవసరార్థం చేతులు కలిపిన టీడీపీ, జేడీయూ, ఎల్జేపీ పార్టీలే కమలదళాన్ని ఆదుకున్నాయి. అవి కూడా గతంలో బీజేపీపై కత్తులు నూరినవే. వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లు ఇప్పుడు మోడీ-షా ద్వయానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

2014లో నరేంద్ర మోడీ తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు బీజేపీకి 24 మిత్రపక్షాలు ఉండేవి. ఆ తర్వాత వాటిలో పలు పార్టీలు ఎన్డీఏతో సంబంధాలు తెంచుకున్నాయి. మోడీ తన అవసరార్థమే పొత్తులు పెట్టుకుంటారని, అవసరం తీరిన తర్వాత కరివేపాకులా వదిలేస్తారని మిత్రపక్షాలు భావించడమే దీనికి కారణం.

నాడు సంకీర్ణ ధర్మాన్ని పాటించారు

అంతకుముందున్న ప్రభుత్వాలన్నీ సంకీర్ణ ధర్మాన్ని పాటించేవి. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కొద్దికాలమే అధికారంలో ఉన్నప్పటికీ కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రకారం పాలన సాగించింది. భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయ కమిటీ ఉండేది. ఆ తర్వాత యూపీఏ కోసం వామపక్ష నేతలు, పి.చిదంబరం కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కూటమికి కూడా సమన్వయ కమిటీ ఉండేది. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో ఏర్పడిన తొలి ప్రభుత్వానికి పరిపాలనకు సంబంధించి జాతీయ అజెండా ఉంది. దీనిని జస్వంత్ సింగ్ రూపొందించారు. 1999లో ఈ అజెండాను సవరించారు. సమాఖ్య సామరస్యాన్ని కాపాడతామని, మైనారిటీలకు పూర్తి రక్షణ కల్పిస్తామని అందులో హామీ ఇచ్చారు. వాజ్‌పేయి రెండోసారి అధికారాన్ని చేపట్టినప్పుడు సమన్వయ కమిటీని ఏర్పాటు చేయలేదు. అయితే తరచూ మిత్రపక్షాలతో సమావేశమై వారి డిమాండ్లపై చర్చించే వారు.

అదే మోడీ తరహా పాలన

2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమన్వయ కమిటీ ఊసే లేదు. భాగస్వామ్య పక్షాలతో కానీ, పార్టీ సహచరులతో కానీ చర్చించిన దాఖలాలూ లేవు. ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను ఆయనే నిర్ణయించారు. నిపుణుల కమిటీ రూపొందించిన విధానాలు, కార్యక్రమాలను ప్రభుత్వం తరఫున ఆయనే ప్రకటించే వారు. చివరికి అదే ఎన్డీఏ విధానమై పోయింది. భాగస్వామ్య పక్షాలు, చివరికి పార్టీ ఎంపీల మాటకు విలువే లేకుండా పోయింది. వారందరూ మోడీ చెప్పిన దానినే ప్రభుత్వ విధానంగా ఆమోదించే వారు. 2002లో గుజరాత్ మారణహోమం జరిగినప్పటి నుండి ఇదే మోడీ తరహా పాలన అయింది.

ఆయన వైఖరే కారణం

ఎన్డీఏను భాగస్వామ్య పక్షాలు విడిచిపెట్టడానికి మోడీ వైఖరే ప్రధాన కారణమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు. 2014, 2019లో మిత్రపక్షాల డిమాండ్లను మోడీ పెడచెవిన పెట్టారు. ఆయనకు సభలో పూర్తి మెజారిటీ ఉండడమే దీనికి కారణం. తమ మనుగడే ప్రశ్నార్థకం అవడంతో

బాబు వర్సెస్ షా

స్నేహబంధం చెడిపోయిన తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, చంద్రబాబు కొన్ని నెలల పాటు పరస్పరం విమర్శలు, ఆరోపణలు చేసుకున్నారు. 2019లో షా మాట్లాడుతూ చంద్రబాబుకు ఎన్డీఏ తలుపులను శాశ్వతంగా మూసేశామని చెప్పారు. చంద్రబాబు త్వరలోనే ఎన్డీఏ గూటికి చేరతారని షా అంచనా వేశారు కానీ అది జరగలేదు. షా మాటకు ప్రతిగా చంద్రబాబు 'దక్షిణాదిన ఖాతా తెరిచేందుకు బీజేపీని ఎన్నటికీ అనుమతించం' అని భీషణ ప్రతిజ్ఞ చేశారు. చంద్రబాబు కంటే అతి పెద్ద అవకాశవాది మరొకరు ఉండరని షా ఎద్దేవా చేశారు. ఆయన పెద్ద అవినీతిపరుడని ఆరోపించారు. తన కుమారుడికి పదవులు కట్టబెట్టడం పైనే చంద్రబాబుకు ఆసక్తి ఎక్కువ అని విమర్శించారు. '2014కు ముందు ఈ అమిత్ షా ఎక్కడున్నారు? ఆయన చరిత్ర ఏమిటి? నేను చాలా మాట్లాడగలను. సరైన సమయంలో మాట్లాడతా' అని చంద్రబాబు ప్రతి సమాధానం ఇచ్చారు. ఇలా వారిద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఇప్పుడు ఇరు పక్షాలు మరోసారి చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నాయి.

నాడు మోడీపై చంద్రబాబు విమర్శలు

ఇప్పుడు ఎన్డీఏతో జట్టు కట్టిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు 2018లో ఆ కూటమిని వదిలి పెట్టారు. మిత్రపక్షాలతో సమావేశం కావడానికి కూడా మోడీకి సమయం దొరకడం లేదని అప్పుడు చంద్రబాబు ఆరోపించారు. అంతేకాదు...మోడీ గర్విష్టి అని, నిరంకుశుడని నిందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుండో డిమాండ్ చేస్తోంది. అందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. అప్పుడు చంద్రబాబు ఏమన్నారంటే 'మోడీ మిత్రపక్షాలకు హామీలు ఇస్తారు. ఆ తర్వాత వాటిపై వెనకడుగు వేస్తారు'.

దారుణంగా దెబ్బతిన్నాయి

సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ మాదిరిగానే దాని విధేయులైన మిత్రపక్షాలు కూడా ఎదురు దెబ్బలు తిన్నాయి. విశ్లేషణ కోసం బీజేపీ మిత్రపక్షాలను నాలుగు గ్రూపులుగా విభజిద్దాం. మొదటి గ్రూపులో బీజేపీతో సంవత్సరం, అంతకంటే ఎక్కువ కాలం స్నేహం చేసిన ఎన్సీపీ (అజిత్), శివసేన (షిండే), అసోం గణపరిషత్, తమిళనాడులోని మూడు అన్నా డీఎంకే వర్గాలు. ఈ పార్టీలన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి.

ఈ మూడు పార్టీలే ఆదుకున్నాయి

రెండో గ్రూపులో ఉన్న పార్టీలు జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, తెలుగుదేశం. ఈ మూడు పార్టీలు గతంలో ఎన్డీఏ మిత్రపక్షాలే. ఆ తర్వాత వివిధ కారణాలతో ఎన్డీఏకు గుడ్‌బై చెప్పాయి. ఈ మూడు పార్టీలతో ఎన్నికలకు ముందే బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఈ పొత్తు సత్ఫలితాలను ఇచ్చింది. జేడీయూకు 12, టీడీపీకి 16, చిరాగ్ పార్టీకి ఆరు స్థానాలు లభించాయి. ఈ మూడు పార్టీల మద్దతు కారణంగానే బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌ను దాటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలో కుస్తీ... ఢిల్లీలో దోస్తీ

ఇక మూడో గ్రూపులో వైఎస్సార్‌సీపీ, బిజూ జనతాదళ్, బీఆర్ఎస్ ఉన్నాయి. ఇవి ఆయా రాష్ట్రాల్లో అధికార పార్టీలు. అవి స్థానికంగా బీజేపీతో పోరాడినప్పటికీ పార్లమెంటులో కీలక సమయాలలో ఆ పార్టీకే కొమ్ము కాశాయి. ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూకాశ్మీర్‌కు లభించిన స్వయం ప్రతిపత్తి రద్దు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్ట సవరణలు, పౌరసత్వ సవరణ చట్టం ఓటింగుకు వచ్చినప్పుడు, అవిశ్వాస తీర్మానాల సమయంలో ఎన్డీఏకు మద్దతు తెలిపాయి. నవీన్ పట్నాయక్, జగన్ రెడ్డి, చంద్రశేఖర్ రావు ఏమి ఆశించి ఎన్డీఏకు మద్దతు ఇచ్చారో తెలియడం లేదు. ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలకు భయపడ్డారా? అధికార పక్షం వైపు ఉంటే సురక్షితమని భావించారా? కారణమేదైనా ఈ మూడు పార్టీలూ ఎన్డీఏకు మద్దతు ఇచ్చాయి. అయితే ఈ మూడింటినీ ఓటర్లు తిరస్కరించడం గమనార్హం. బీఆర్ఎస్, బీజేడీ పార్టీలకు లోక్‌సభలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ కేవలం నాలుగు స్థానాలకే పరిమితమైంది. లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ ప్రతిపక్షం వైపే ఉంటానని పట్నాయక్ ఇప్పుడు చెబుతున్నారు. బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని కార్యకర్తలకు ఆయన ఉద్బోధించారు.

బీజేపీతో జట్టు కట్టి దారుణంగా దెబ్బతిన్న పార్టీలు

- పరోక్షంగా మద్దతు ఇచ్చిన పార్టీలకూ అదే గతి
- మట్టి కరిచిన మాజీ మిత్రులు
- ఆదుకున్నది ఆ మూడు పార్టీలే

ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లతో తలనొప్పులు

ఇప్పుడు మళ్లీ చంద్రబాబు దగ్గరకు వద్దాం. ఆయన చాంతాండంత డిమాండ్ల చిట్టా పట్టుకొని రాజధానికి వచ్చారు. ప్రధానిని, మంత్రులను కలిసి విజ్ఞాపనలు అందించారు. ముఖ్యంగా ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇవే రకమైన డిమాండ్లు వస్తున్నాయి. బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జేడీయూ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. జేడీయూ డిమాండ్‌కు చిరాగ్ కూడా మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పాలనలోని కర్నాటక, వామపక్షాల ఏలుబడిలో ఉన్న కేరళ కూడా ప్రత్యేక ప్యాకేజీ కోసం డిమాండ్ చేస్తున్నాయి. 2020 నుండే ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ప్రత్యేక ప్యాకేజీని కోరుతున్నాయి. మోడీ-షా ద్వయానికి ఇప్పుడు ఈ ప్రత్యేక ప్యాకేజీ డిమాండే తలనెప్పి తెచ్చి పెడుతోంది.

ఈ పార్టీలూ మట్టి కరిచాయి

ఇక్కడ నాలుగో కేటగిరీ గురించి చెప్పుకుందాం. ఒకప్పుడు బలమైన అనుయాయులుగా ఉండి, ఆ తర్వాత అప్పుడప్పుడు మద్దతు ఇచ్చిన వారు ఈ కేటగిరీ కిందికి వస్తారు. 1996 నుండి శిరోమణి అకాలీదళ్ పార్టీ బీజేపీకి మిత్రపక్షంగా ఉంటోంది. 24 సంవత్సరాల పాటు బీజేపీకి మద్దతు ఇచ్చిన ఆ పార్టీ 2020 సెప్టెంబరులో రైతుల ఆందోళన నేపథ్యంలో దోస్తీ కటీఫ్ చెప్పింది. కానీ అప్పటికే ఆలస్యమైంది. బీజేపీతో సుదీర్ఘ కాలం చెలిమి చేయడంతో ఆ పార్టీ స్థానాన్ని వేరే పార్టీలు ఆక్రమించాయి. ఇప్పుడు వంద సంవత్సరాల నాటి ఆ పురాతన పార్టీ అంతర్గత కుమ్ములాటలతో విలవిలలాడుతోంది. తమిళనాట అన్నా డీఎంకే పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆ పార్టీ చాలా కాలం పాటు బీజేపీ మిత్రపక్షంగా ఉంది. మోడీ అవలంబించిన విభజన రాజకీయాలు అన్నా డీఎంకే పునాదిని కదిలించాయి. ఈ పార్టీలోని కొన్ని చిన్న చిన్న గ్రూపులు ఇప్పటికీ బీజేపీకి మద్దతు ఇస్తుండగా ఎడపాడి పళనిస్వామి నేతృత్వంలోని బలమైన గ్రూపు గత సెప్టెంబరులో కమలదళంతో సంబంధాలు తెంచుకుంది. జమ్మూకాశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటు కోసం మహబూబా ముఫ్తి నేతృత్వంలోని పీడీపీ కమలదళంతో పొత్తు పెట్టుకుంది. కానీ అది ఎంతో కాలం సాగలేదు. 2018 జూన్‌లో ఆ సంకీర్ణానికి తెర పడింది.

సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ పూర్తిగా కనుమరుగు కావడానికి వేరే కారణాలు ఉన్నాయి. ఈడీ, సీబీఐ భయంతో ప్రతిపక్షాల ఓట్లు చీల్చి, బీజేపీకి లబ్ది చేకూర్చేందుకు బీఎస్పీ అధినేత్రి మాయావతి అభ్యర్థులను నిలిపారు. ఫలితంగా ఒకప్పుడు యూపీలో అధికార పార్టీగా ఉన్న బీఎస్పీ 2.04 శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ పార్టీకి దిగువసభలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. హర్యానాలో బీజేపీకి చాలా కాలం నుండి మిత్రపక్షంగా ఉన్న దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీ పార్టీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది.

అనసూయ కాదు..

ఇక అనుకతిర్ సూర్య

- లింగమార్పిడి చేయించుకున్న సివిల్స్ అధికారి
- ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తెలంగాణ క్యాడర్‌కు చెందిన సివిల్ సర్వీస్ అధికారి ఎం.అనసూయ తన పేరును ఎం.అనుకతిర్ సూర్యగా మార్చుకున్నారు. లింగమార్పిడి ఆపరేషన్ చేయించుకున్న తర్వాత తన పేరును అనుకతిర్ సూర్యగా మార్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం ఎదుట తన అభ్యర్థన ఉంచారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక నుంచి ఆమె మిస్ కాకుండా మిస్టర్ కానున్నారు. ప్రస్తుతం అనుకతిర్ సూర్య హైదరాబాద్‌లోని కస్టమ్స్ ఎక్సైజ్‌తో పాటు సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి సర్టిఫికేట్‌లోనూ మిస్ బదులు మిస్టర్‌గా మార్చుకోవాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన ఈ ఐఆర్ఎస్ అధికారి అనుకతిర్ సూర్య చెన్నై లోనే విద్యాభ్యాసం పూర్తి చేశారు. మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. భోపాల్‌లోని నేషనల్ లా ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ నుంచి సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. ఆ తరువాత సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సీ అండ్ ఐటీలో తొలిసారి తన వృత్తిలోకి అడుగు పెట్టారు. కెరీర్ ప్రారంభంలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత 2018లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. 2023లో అనుకతిర్ హైదరాబాద్‌లోని సీఈఎస్‌టీఏటీ (కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్)లో పదవీ బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతానికి అందులోనే కొనసాగుతున్నారు. సివిల్ సర్వీసెస్ అయిన ఆమె లింగమార్పిడి చేయించుకుని కొత్త చరిత్ర సృష్టించారు.

యూరోపియన్ పార్లమెంట్‌లో గణనీయ శక్తిగా

కొత్త మితవాద గ్రూపు

- ఈయూ దిశను ప్రభావితం చేస్తుందంటున్న నిపుణులు

బ్రస్సెల్స్ : యూరోపియన్ పార్లమెంట్‌లో కొత్తగా ఏర్పడిన మితవాద పేట్రియాట్స్ ఫర్ యూరప్ అలయన్స్‌కు యురోపియన్ యూనియన్ పంథాను ప్రభావితం చేసేంత సామర్థ్యం వుందని నిపుణులు పేర్కొంటున్నారు. అధికారికంగా సోమవారం ఏర్పడిన ఈ అలయన్స్ 10వ యూరోపియన్ పార్లమెంట్‌లో మూడవ అతిపెద్ద రాజకీయ గ్రూపుగా మారింది. వచ్చే వారం ఈ గ్రూపు మొదటి ప్లీనరీ సమావేశం జరగనుంది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడిగా ఉర్సులా వాన్ డెర్ లేయన్ తిరిగి రెండో పదవీ కాలానికి ఎన్నికవుతారా లేదా అనే అంశంపై ఈ సమావేశంలో ఓటింగ్ జరగనుంది. ఈ గ్రూపులో 12 ఇయు సభ్య దేశాల నుండి 84మంది యూరోపియన్ పార్లమెంట్ సభ్యులున్నారు.

హక్కుల కోసం కేంద్రంపై పోరాడాలి...

రేవంత్ సర్కారుకు ఎస్ వీరయ్య సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



బీజేపీ ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య చెప్పారు. ఇటీవల మెదక్‌లో జరిగిన కొన్ని మతోన్మాద ఘటనల పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలో చోటు చేసుకున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చాకే ఇవన్నీ జరిగాయని గుర్తు చేశారు. మెదక్‌కు సంబంధించి ప్రభుత్వం స్పందించి, బాధ్యులపై కేసులు నమోదు చేసినప్పటికీ, అది సరిపోదని అన్నారు. ఈ ఘటనపై సీఎం రేవంత్, మిగతా మంత్రులు నోరు మెదపకపోవటం శోచనీయమన్నారు. మతోన్మాదాన్ని నిలువరించాల్సిన బాధ్యత అధికార పార్టీగా కాంగ్రెస్‌కు, పీసీసీ చీఫ్‌గా రేవంత్‌కు లేదా? అని ప్రశ్నించారు.

బీజేపీ ఆర్థిక విధానాలతోపాటు దాని మతోన్మాదంపై కరకుగా ఉండాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. అప్పుడే బీజేపీని నిలువరించగలుగుతారని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, గ్రాంట్లు, హక్కుల సాధనకు కేంద్రంపై పోరాడాలని సీఎం రేవంత్‌కు వీరయ్య ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్ర విభజన అంశాలపై ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ చర్చించటం మంచిదేననీ, అయితే రెండు రాష్ట్రాలకు సంబంధించి కేంద్రం పరిధిలోని అంశాలపై మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలనే ప్రతిపాదన వారిద్దరికీ లేకపోవటం శోచనీయమని అన్నారు.

బీజేపీని నిలువరించటమే మా కర్తవ్యం

- ఆ పోరాటంలో ఎవరు కలిసొస్తే వారిని కలుపుకునిపోతాం: సీపీఐ(ఎం) విస్తృత సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగానూ బీజేపీని నిలువరించటమే తమ పార్టీ ప్రధాన కర్తవ్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇందుకు సంబంధించిన పోరాటంలో అన్ని శక్తులనూ కలుపుకునిపోతామని ఆయన చెప్పారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై తమ్మినేని మాట్లాడుతూ కేవలం ఎన్నికల సందర్భంలోనే గాక బీజేపీని, దాని మతోన్మాద భావజాలాన్ని అన్ని సమయాల్లోనూ నిలువరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎనిమిది ఎంపీ సీట్లను ఆ పార్టీ గెలుచుకున్న నేపథ్యంలో ప్రజలు దాని పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీ, దాని విధానాలకు వ్యతిరేకంగా పోరాడే అన్ని శక్తులనూ కలుపుకుని ముందుకు పోవాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలోని రేవంత్ సర్కారు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక పరిస్థితి, నిధుల కొరత పేరిట వాటి అమలును ఎగ్గొట్టే ప్రయత్నం చేయొద్దని కోరారు. రైతు భరోసా, రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సహాయం, ఇండ్లు, ఇండ్ల పట్టాలు, కార్మికులకు కనీస వేతనాల అమలు తదితర ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రేవంత్‌రెడ్డిని తమ్మినేని కోరారు.

మూడో టి20లోనూ గెలుపే..

- జింబాబ్వేపై 23పరుగుల తేడాతో ఘన విజయం
- సుందర్ ఆల్‌రౌండ్ షో



హరారే: ఐదు టి20ల సిరీస్ ఆడేందుకు జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత యువ జట్టు అద్భుతంగా రాణిస్తోంది. తొలి టి20లో నిరాశపరిచినా.. రెండు, మూడు టి20ల్లో నెగ్గి సిరీస్ ఆధిక్యతలో నిలిచింది. హరారే వేదికగా జింబాబ్వేతో బుధవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 6వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. డియోన్ మైయర్స్(65నాటౌట్, 49 బంతుల్లో; 7ఫోర్లు, సిక్సర్), క్లైవ్ మదండె (37, 26 బంతుల్లో; 2ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్‌కు మూడు, అవేశ్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యతలో నిలిచింది. వాషింగ్టన్ సుందర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66, 49 బంతుల్లో; 7ఫోర్లు, 3సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (49, 28 బంతుల్లో; 4ఫోర్లు, 3సిక్సర్లు) రాణించారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (36, 27 బంతుల్లో; 4ఫోర్లు, 2సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. రెండో టి20లో సెంచరీతో కదం తొక్కిన అభిషేక్ శర్మ(10) నిరాశపరిచాడు. గిల్‌తో ఓపెనర్‌గా వచ్చిన జైస్వాల్ తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు, సిక్సర్‌తో తన ఉద్దేశాన్ని చాటాడు. రెండో ఓవర్లో గిల్ సైతం 4, 6, 4తో భారత్ స్కోరు రాకెట్ వేగాన్నితలపించింది. ఈ ఇద్దరూ దూకుడుగా ఆడటంతో 8ఓవర్లు ముగిసేసరికే భారత్ వికెట్ నష్టపోకుండా 67పరుగులు చేసింది. తొమ్మిదో ఓవర్లో రజా వేసిన బంతిని స్వీప్ చేయబోయిన జైస్వాల్.. బెన్నెట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన అభిషేక్ ఈ మ్యాచ్‌లో తేలిపోయాడు. కానీ రుతురాజ్ అండతో గిల్ రెచ్చిపోయాడు. మద్వెరె వేసిన 13వ ఓవర్లో గిల్ ఓ సిక్సర్ బాదగా రుతురాజ్ 6,4 సాధించాడు. చటారా 14వ ఓవర్లో ఫోర్ కొట్టిన గిల్ 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా ఆడే క్రమంలో గిల్.. ముజర్బని వేసిన 18వ ఓవర్లో రజాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కానీ ఆఖర్లో రుతురాజ్ వేగంగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. అర్ధ సెంచరీకి ఒక్క పరుగు దూరంలో రుతురాజ్ ఔట్ అయి నిరాశగా పెవిలియన్‌కు చేరాడు. జింబాబ్వే బౌలర్లలో కెప్టెన్ సికిందర్ రాజా, బ్లెస్సింగ్ ముజర్బనికి రెండేసి వికెట్లు దక్కాయి. నాల్గో టి20 శనివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బెన్నెట్ (బి)రాజా 36, శుభ్‌మన్ (సి)రాజా (బి)ముజరబాని 66, అభిషేక్ శర్మ (సి)మరుమణి (బి)రాజా 10, రుతురాజ్ గైక్వాడ్ (సి)మధెవెరె (బి)ముజరబాని 49, సంజు (నాటౌట్) 12, రింకు సింగ్ (నాటౌట్) 1, అదనం 8. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 182పరుగులు.

వికెట్ల పతనం: 1/67, 2/81, 3/153, 4/177

బౌలింగ్: బెన్నెట్ 1-0-15-0, నరవా 4-0-39-0, ఛటారా 3-0-30-0, ముజరబాని 4-0-25-2, రాజా 4-0-24-2, మసకడ్జా 3-0-25-0, మధెవెరె 1-0-19-0

జింబాబ్వే ఇన్నింగ్స్: మధెవెరె (సి)అభిషేక్ శర్మ (బి)ఆవేశ్ ఖాన్ 1, మరుమణి (సి)దూబే (బి)ఖలీల్ అహ్మద్ 13, బెన్నెట్ (సి)బిష్ణోయ్ (బి)ఆవేశ్ ఖాన్ 4, మెయిర్స్ (నాటౌట్) 65, సికిందర్ రాజా (సి)రింకు సింగ్ (బి)సుందర్ 15, ఛాంప్‌బెల్ (సి)రియాన్ పరాగ్ (బి)సుందర్ 1, మదండే (సి)రింకు సింగ్ (బి)సుందర్ 37, మసకడ్జా (నాటౌట్) 18, అదనం 5. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 159పరుగులు.

వికెట్ల పతనం: 1/9, 2/19, 3/19, 4/37, 5/39, 6/116

ఎంఎస్ఎంఈలలో అసంఘటిత కార్మికులే అధికం

న్యూఢిల్లీ : 2023 జనవరిలో అప్పటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) మంత్రి నారాయణ్ రాణే ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (ఎస్ఐడీబీఐ) భాగస్వామిగా ఉంది. జీఎస్టీ అధికారుల వద్ద నమోదు కాని అనధికారిక సూక్ష్మ తరహా పరిశ్రమలకు ఉద్యం రిజిస్ట్రేషన్‌ను కల్పించడమే ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు ఉద్దేశమని ఎస్ఐడీబీఐ తెలిపింది. ఉద్యం వేదిక కానీ, జీఎస్టీ కింద రిజిస్ట్రేషన్ కానీ అసలు సమస్యే కాదు. అయితే అనధికారిక, అధికారిక పరిశ్రమల రోజువారీ పనితీరుపై అవగాహన కోసం ఇవి ఉపయోగపడతాయి. ఇటీవలి కాలంలో ఎంఎస్ఎంఈలు రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాయి. ఎంఎస్ఎంఈలకు సంబంధించి ప్రభుత్వం అందించే సమాచారం ఉద్యం, జీఎస్టీపై ఆధారపడి ఉంటుంది. అసలు రిజిస్ట్రేషన్ల కారణంగా ఎవరు, ఎలా ప్రయోజనం పొందుతారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సంబంధించిన వివరాలు ఈ రిజిస్ట్రేషన్ల ద్వారా తెలుస్తాయి. చట్టప్రకారం ఏర్పడని సంస్థలపై 2016లో ఎన్ఎస్ఎస్ ఓ సర్వే నిర్వహించింది. దీని ప్రకారం సంవత్సరానికి రూ.25-50 లక్షల ఆదాయం ఉన్న పరిశ్రమల యజమానుల్లో 45% మంది వస్తు సేవల (జీఎస్టీ) వ్యవస్థలో నమోదయ్యారు. అయితే వారి ఉద్యోగుల్లో 65 శాతం మంది అనధికారికంగా పని చేస్తున్న వారే.

బంగారు ఆభరణాలను దొంగిలించిన....

మహిళను పట్టుకున్న సత్తుపల్లి పోలీసులు

నవతెలంగాణ-సత్తుపల్లి

24 గంటలు గడవకముందే అపహరణకు గురైన బంగారు ఆభరణాలను దొంగిలించిన మహిళను సత్తుపల్లి పోలీసులు బుధవారం మధ్యాహ్నం చాకచక్యంగా పట్టుకున్నారు. పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ మంగళవారం సత్తుపల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తాను భద్రపరిచిన 112 గ్రాముల బంగారాన్ని రిలీజ్ చేసుకొని ఇంటికి వెళ్లేందుకు సత్తుపల్లి బస్టాండుకు చేరుకుంది. ఈలోగా బస్సు రాగానే ఆమె బస్సు ఎక్కుతున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన దేవరకొండ దుర్గా అనే మహిళ వరలక్ష్మి బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు ఉన్న బాక్సును తస్కరించింది. తాను దొంగిలించిన బంగారు ఆభరణాలను కరిగించేందుకు చోరురాలు బుధవారం సత్తుపల్లిలో ఆటోలో వస్తుండగా వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి ఆమె ఆటోలోంచి దిగి పారిపోతుండగా గమనించిన పోలీసులు ఆమెను వెంబడించి పట్టుకున్నారు. ఆమె వద్ద ఉన్న బంగారాన్ని తీసుకొని పరిశీలించగా మంగళవారం బస్టాండ్లో చోరీకి గురైన బంగారు ఆభరణాలుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న112 గ్రాముల బంగారు ఆభరణాల్లో ఒక చంద్రహారం, నాలుగు గాజులు, రెండు చైన్లు, మూడు ఉంగరాలు ఉన్నాయి. చోరురాలు దుర్గను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు.



గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ కు కృషి చేసిన మంత్రి పొంగులేటికి కతజ్ఞతలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణంలో ధంసలాపురం వద్ద ఎగ్జిట్ మార్గం లేక స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆ సమస్య పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర రెవెన్యూ, గహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని బుధవారం ఆయా ప్రాంతాల కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి కతజ్ఞతలు తెలిపారు. కీలక హైవే నిర్మాణంలో ఎగ్జిట్ మార్గం లేక స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విన్నవించగా.. తనవంతుగా కీలక కృషి చేసినందుకు మంత్రికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో 18వ డివిజన్ కార్పొరేటర్ మందడపు లక్ష్మీ మనోహర్ రావు, 23వ డివిజన్ కార్పొరేటర్ ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, కార్పొరేటర్ మడూరి ప్రసాద్, 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి తమ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ హెూమ్స్ అధినేత దేవరపల్లి శ్రీనివాసరెడ్డి (డీఎస్సార్), మందడపు రామ కృష్ణారెడ్డి, శ్రీరామ్ హిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బెల్లం మనోహర్ రావు, నాయకులు మందడపు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, మడూరి సైదారావు, రామ కృష్ణాపురం, పందిళ్ళపల్లి ముఖ్య నాయకులు, 16, 18, 21, 23 వ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

రష్యా పర్యటనపై పశ్చిమ దేశాల అక్కసు!

ప్రధాని నరేంద్రమోడీ సోమ, మంగళవారాల రష్యా పర్యటన ముగిసింది.రక్షణ ఒప్పందంతో సహా పూర్వపు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనా నాడు ఏర్పడిన బంధం తరువాత రష్యాతో కూడా జయప్రదంగా కొనసాగుతున్నది. పాకిస్థాన్‌కు ఆధునిక ఆయుధాలు ఇచ్చి మన మీద ఉసికొల్పిన అమెరికాకు పోటీగా మనకు అవసరమైన మిలిటరీ సాయంతో పాటు అంతరిక్ష ప్రయోగాలలో కీలకమైన క్రయోజెనిక్ ఇంజన్ల పరిజ్ఞానంతో సహా అనేక రంగాలలో రష్యాతో మన అనుబంధం కొనసాగుతోంది.ఉక్కు, ఔషధ, ఇతర రంగాలలో మనం పొందిన సాయం కూడా తక్కువేమీ కాదు. ఇప్పటికీ మిలిటరీ ఆయుధాలు, పరికరాల అంశంలో రష్యాపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాము. ప్రపంచ శ్రేణి క్షిపణి బ్రహ్మోస్ తయారీలో రష్యా భాగస్వామిగా ఉంది.ఎకె రకం మరతు పాకుల తయారీలో భాగ స్వామ్యం గురించి... ఇలా చెప్పుకుంటూపోతే పెద్ద గ్రంథమే అవుతుంది. ఇంతగా పెనవేసుకుపోయిన రెండు దేశాలనూ విడదీయాలని, తన ఆయుధాలను మనకు అంటగట్టాలని గడచిన మూడు దశాబ్దాలుగా అమెరికా చేయని ప్రయత్నం లేదు. ఈ పూర్వరంగంలో మోడీ పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ పర్యటన ద్వారా పశ్చిమ దేశాల పాటలకు అనుగుణంగా భారత్ నృత్యం చేసేందుకు సిద్ధంగా లేదన్న సందేశం పంపినట్లుగా చెప్పవచ్చు. దీని అర్థం వాటి నుంచి దూరంగా జరిగిందని భావించకూడదు.



> **నాటో కూటమి 75వ సమావేశాలు వాషింగ్టన్‌లో జరుగుతున్న తరుణంలో మూడవసారి అధికారానికి వచ్చిన నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమదేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. భారత్-రష్యా-చైనా సంబంధాలను దెబ్బతీసేందుకు తంపులు పెట్టాలని చూస్తోందని, అమెరికా, ఇతర పశ్చిమదేశాల వలలో పడొద్దని చైనా సూచిస్తోంది. ఉక్రెయిన్ సమస్య నాటో విస్తరణతో లింకు అయి ఉందన్న విషయం గమనంలో పెట్టుకుని, రష్యా-ఉక్రెయిన్ సమస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పడం సబబే.**

గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రను చూసినపుడు కొన్ని సందర్భాలలో ఏదో ఒక శిబిరం వైపు మొగ్గుచూపినట్లు కనిపించినా, ఆమేరకు కొన్ని చర్యలున్నా భారత పాలకవర్గాలు అలీన విధానం పాటిస్తూ అటు సోషలిస్టు శిబిరం, ఇటు పెట్టుబడిదారీ కూటమి నుంచి కూడా లబ్ధిపొందేందుకు చూడటం తెలిసిందే. ఉదాహరణకు చైనాకు వ్యతిరేకంగా అమెరికా మనలను తన వైపు లాగేందుకు చూస్తున్నది. దానిలో భాగంగానే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన కూటమి, క్వాడ్ (చతుష్టయం)లో భారత్‌ను కూడా చేర్చుకున్నారు. అయితే 2020లో గాల్వన్ సరిహద్దు ఘర్షణ తరువాత చైనాతో శాశ్వత శత్రుత్వంలో ఉంటుందనుకున్నవారి ఆశలు ఫలించలేదు. చైనా నుంచి దిగుమతుల అంశంలో నరేంద్రమోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టారు. పెట్టుబడులను అడ్డుకొనేందుకు చూసినా తాజాగా విద్యుత్ వాహనాల రంగంలో చైనా పెట్టుబడులను కూడా అనుమతించేందుకు వైఖరిని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇది మన కార్పొరేట్ల ప్రయోజనాల కోసమని వేరే చెప్పనవసరం లేదు. ఇదే విధంగా ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థంగా ఉన్నప్పటికీ పశ్చిమ దేశాల ఆంక్షలు, బెదిరింపులను ఖాతరు చేయకుండా రష్యా నుంచి చౌకధరలకు మనదేశం చమురు కొని పరోక్షంగా రష్యాను ఆర్థికంగా ఆదుకున్నది. దీన్ని పశ్చిమ దేశాలు మింగా కక్కలేకుండా ఉన్నాయి. మన కార్పొరేట్లు రష్యా చమురు ఉత్పత్తులను చౌకధరలకు ఐరోపా దేశాలకు విక్రయించి లబ్ధిపొందుతున్నాయి.

అమెరికాతో వ్యూహాత్మకంగా, రష్యాతో రక్షణ భాగస్వామిగా సంబంధాలు కలిగిన ఏకైక దేశం మనదేశమే. అంతర్జాతీయ రాజకీయాల్లో అటు అమెరికా, ఇటు రష్యా తమవైపు తిప్పుకొనేందుకు రెండూ ప్రయత్నిస్తున్నాయి. కొన్ని అంశాల్లో గత యుపిఏ, ప్రస్తుత మోడీ సర్కార్ అమెరికాతో అంటకాగేందుకు కొన్ని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ కొన్ని సందర్భాలలో దాని ఒత్తిడికి లొంగటం లేదు.ఉక్రెయిన్ సంక్షోభంలో తమవైపునకు రానందుకు మన మీద అమెరికాకు పీకల దాకా కోపం ఉన్నప్పటికీ కొన్ని అంశాలలో తనకు అనుకూలంగా ఉన్నందున అది బయటపడకుండా తమాయించుకుంటున్నది. ఎక్కడ రష్యా వైపు మొగ్గుతామోనన్న భయంతో లేదా ఇతర కారణాలతో గానీ ఉక్రెయిన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల విషయంలో ఐరాస నిబంధనలకు భారత్ కట్టుబడి ఉండాలని మోడీ రష్యా పర్యటన సందర్భంగా అమెరికా బహిరంగంగానే వినతి పూర్వక హెచ్చరిక చేసింది.రష్యాతో సంబంధాలపై తమకున్న ఆందోళనలతో సహా అనేక అంశాలపై ఎలాంటి శషభిషలు లేకుండా భారత్‌తో చర్చించినట్లు అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. రష్యాతో వ్యవహరించే ఏదేశానికైనా తాము ఇదే చెబుతామన్నాడు.

నాటో కూటమి 75వ సమావేశాలు వాషింగ్టన్‌లో జరుగుతున్న తరుణంలో మూడవసారి అధికారానికి వచ్చిన నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమదేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. భారత్-రష్యా-చైనా సంబంధాలను దెబ్బతీసేందుకు తంపులు పెట్టాలని చూస్తోందని, అమెరికా, ఇతర పశ్చిమదేశాల వలలో పడొద్దని చైనా సూచిస్తోంది. ఉక్రెయిన్ సమస్య నాటో విస్తరణతో లింకు అయి ఉందన్న విషయం గమనంలో పెట్టుకుని, రష్యా-ఉక్రెయిన్ సమస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పడం సబబే. అంతమాత్రం చేత రష్యా నుండి మన దేశానికి అవసరమైన ఒప్పందాలు చేసుకోవడాన్ని తప్పుపట్టలేము.

'నీరో' రాజ్యంలో మణిపూర్

(**సమయం:** జూలై 1, అర్ధరాత్రి 11.49 గంటలు.
స్థలం: లోక్‌సభ, ఢిల్లీ.
ప్రసంగిస్తున్నది : ఇన్నర్ మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్)

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్: మిస్టర్ చైర్‌పర్సన్ సర్, ఇప్పుడు సమయం ఇచ్చినందుకు ధన్యవాదాలు... (అంతరాయం) భారతదేశ చరిత్రలో కష్ట కాలాన్ని గురించి మాట్లాడేటందుకు- ఇలా గతంలో ఎప్పుడూ జరిగి ఉండలేదు - దానిని మణిపూర్ విషాదం అని పిలవ్వచ్చు, నేను ప్రసంగించడానికి లేవగానే ప్రభుత్వం నా నోరు నొక్కేందుకు చూస్తున్నది...(అంతరాయం) ఇంతటి ప్రాముఖ్యంవున్న విషయాన్ని నిశ్శబ్దంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, అర్ధరాత్రి సమీపిస్తుండగా దానిపై ప్రసంగించేందుకు అవకాశం రావడం ఒక ఎగతాళి. నా స్వరాష్ట్రంలోని ప్రజలు ఢిల్లీలో ఉన్న కాలం కంటే రెండు గంటలు ముందు ఉంటారన్న విషయం గుర్తుకొస్తున్నది.

ఢిల్లీ పాటకు మేము డాన్స్ చేస్తున్నాము, సమయం ఇప్పుడు (రాత్రి) 12 గంటలకు దగ్గరగా వుంది..

జాహ్ను బారువా, అతని లాంటి ఇతరులు ఎన్నో ఏళ్లుగా ఈశాన్యానికి ప్రత్యేకమైన టైమ్‌జోన్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే, అప్పుడు మాత్రమే మేము గౌరవంగాను, క్షేమంగానూ ఉండగలం. అయితే, నేను మాట్లాడటానికి అవకాశం ఉన్నదని గ్రహించగలగటమే ఈ క్షణాన నాకున్న ప్రాధాన్యత.

మిస్టర్ చైర్మన్, రాష్ట్రపతి ప్రసంగంలో మణిపూర్ లేదన్న విషయం మీ దృష్టికి తెస్తున్నాను. ఇదేదో పొరపాటున తప్పిపోవటం కాదు. ప్రజలను మినహాయించే జాతీయ స్వఅహతో ఇది జరిగిందని గుర్తు చేస్తున్నాను. గతేడాది కాలంగా దుర్భరమైన పరిస్థితుల్లో 60 వేల మంది ప్రజలు దైన్య, దీన స్థితిలో ఉన్నారని మీరు తెలుసుకోవాలి. నేను ఒక పరిశోధన అంశానికి సహాయపడుతుండే వాడిని. 1947 విభజన సమయంలో బతికి బట్టకట్టిన 1500 మందిని మేము ఇంటర్వ్యూ చేశాం. అటువంటి పరిస్థితుల్లోనే ఇప్పుడు ఇక్కడ బతుకుతున్నారని మేము చూశాము. వాటిని అన్ని నేను ఇక్కడ పేర్కొనలేను. సర్, 60 వేల మంది ప్రజలు నిర్వాసితులుగా మారారు అంటే అది తేలికగా తీసుకునే విషయం కాదు. 200 మందికి పైగా



చనిపోయారు. అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. తమ గ్రామాల రక్షణ కోసం ప్రజల ఆయుధాలు పట్టుకొని తిరుగుతున్నారు, ఒకరితో ఒకరు పోట్లాడుకుంటున్నారు. గతేడాదిగా ఉన్న ఈ విషాదానికి భారత రాజ్యం మౌన ప్రేక్షకుడిలాగా వుంటున్నది.

మణిపూర్‌లోని ప్రతి సెంటిమీటర్‌లో సాయుధ బలగాలు కేంద్ర మోహరించి ఉన్నాయని ఈ సభకు గుర్తు చేస్తున్నాను. దేశంలో అత్యధిక సైనికీకరణ జరిగిన ప్రాంతాల్లో ఇది ఒకటి. సాయుధ బలగాలే కాక, ఇక్కడ సివిల్ పోలీసులకన్నా, ఎక్కువమంది సాయుధ పోలీసులు ఉన్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ, 60 వేల మంది ఎలా నిరాశ్రయులు అయ్యారు? పల్లెలు, ఇండ్లు ఎలా ధ్వంసమయ్యాయి? ఇప్పటికీ ప్రధానమంత్రి మౌనముద్రలో ఉన్నారు. ఆయననోటి నుంచి ఒక్క మాట కూడా రాలేదు. దేశ అధ్యక్షుల వారి ప్రసంగంలో కూడా దీని సంగతి లేదు. ఈ మౌనం మామూలుది కాదని నేనంటాను. వలసపాలన నుంచి వలస అనంతర పాలనకు మధ్య కొనసాగింపు ఇది అని అనేకమంది మేధావులు చెప్పిన విషయం గుర్తు చేస్తున్నది.

> **మణిపూర్‌లోని ప్రతి సెంటిమీటర్‌లో సాయుధ బలగాలు కేంద్ర మోహరించి ఉన్నాయని ఈ సభకు గుర్తు చేస్తున్నాను. దేశంలో అత్యధిక సైనికీకరణ జరిగిన ప్రాంతాల్లో ఇది ఒకటి. సాయుధ బలగాలే కాక, ఇక్కడ సివిల్ పోలీసులకన్నా, ఎక్కువమంది సాయుధ పోలీసులు ఉన్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ, 60 వేల మంది ఎలా నిరాశ్రయులు అయ్యారు? పల్లెలు, ఇండ్లు ఎలా ధ్వంసమయ్యాయి?ఇప్పటికీ ప్రధానమంత్రి మౌనముద్రలో ఉన్నారు. ఆయననోటి నుంచి ఒక్క మాట కూడా రాలేదు. దేశ అధ్యక్షుల వారి ప్రసంగంలో కూడా దీని సంగతి లేదు. ఈ మౌనం మామూలుది కాదని నేనంటాను. వలసపాలన నుంచి వలస అనంతర పాలనకు మధ్య కొనసాగింపు ఇది అని అనేకమంది మేధావులు చెప్పిన విషయం గుర్తు చేస్తున్నది.**

ఈరోజు వలసపాలన కాలం నాటి వారసత్వాన్ని వదిలించుకొని కొత్త క్రిమినల్ చట్టాలను తెచ్చుకున్న రోజు. కానీ, అశీష్ నంది చెప్పినట్టు, వలసవాదం అనేది బుద్ధికి సంబంధించింది, ఇది ఒక మానసిక ధోరణి, అదొక దృక్కోణం,ప్రజలను అర్థం చేసుకునే దృష్టి, ప్రపంచం ఏమిటో తెలుసుకునే దృష్టి. సత్యం ఏమిటంటే,19వ రాష్ట్రంగా వున్న (మణిపూర్)రాష్ట్ర విషాదం పట్ల నిర్లక్ష్య ప్రదర్శన కొనసాగిస్తూ, మణిపూర్ రాష్ట్రం స్వదేశీ పౌరులకు ఈ తిరస్కరణ వలన వారికి కలిగిన ఆగ్రహాన్ని ఆవేదాన్ని నడిరాత్రి సమీపిస్తుండగా చెప్పే అవకాశం నాకు కలగటం మహాద్భుతం.

ఈ సభను గట్టిగా ప్రశ్నిస్తున్నాను. భారతదేశ రాష్ట్రాలకు సంబంధించి మీరు మాకు అవసరం లేదని ఈ మూగ సమాచారం ద్వారా ఈశాన్య రాష్ట్ర ప్రజలకు, మరీ ముఖ్యంగా మణిపూర్ ప్రజలకు చెప్పాలనుకుంటున్నారా? ఆత్మాహుతి బాంబర్‌తో పెనుగులాడిన, అశోక చక్ర అవార్డు గ్రహీత మేజర్ లయిష్ రామ్ మణిపూర్‌వాడు. అతను అశోక్ చక్ర అవార్డు పొందాడు. మీరు అతని రాష్ట్రాన్ని అవమాన పరుస్తున్నారు. శ్రీలంకలో శాంతి దళంలో ఈ దేశం తరపున పని చేస్తూ కర్తవ్య నిర్వహణలో ప్రాణం కోల్పోయిన మేజర్ ఎన్గంగోమ్ జాయ్ దత్తా వీర చక్ర అవార్డు పొందాడు. మీరు అతన్ని అగౌరవ పరుస్తున్నారు. మేరీకోమ్, సరితా కుంజారాణి, మీరాబాయి చాను లాంటి వారిని, మీరు ఈ దేశానికి అవసరం లేదని, మీ రాష్ట్రం మాకు అవసరం లేదని చెప్తున్నారు. ఈ దేశ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రతన్ థియమ్, అరిబామ్ శ్యామ్‌శర్మ దేశానికి ఏమీ కారని కూడా మీరు చెబుతున్నారు... (అంతరాయం) మీకు ఈ రాష్ట్రం పట్ల లేశమంత బాధ వున్నా ఈ సభలో ఈ మౌనం, రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన లేకపోవటం జరిగేది కాదు. దీనిని స్పష్టంగా గుర్తించండి.

గౌ!! చైర్ పర్సన్ (శ్రీకృష్ణ ప్రసాద్ తెన్నేటి): దయచేసి మీ పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటి?

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్ (ఇన్నర్ మణిపూర్) : దీనిని స్పష్టంగా గుర్తించండి. ఈ రాష్ట్ర ప్రజల జాతీయత,దేశభక్తి పట్ల మీరు సందేహించదలిస్తే, ఈ దేశం కోసం ఈ ప్రజలు పోరాడారని తెలుసుకోండి. ఈ దేశం కోసం ఈ ప్రజలు త్యాగాలు చేశారు. దయచేసి గుర్తుపెట్టుకోండి.

డా.నిశీకాంత్ దూబే (గొడ్డా): సభాపతిజీ, ఇది పొరపాటు మాట. నా పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటంటే... (అంతరాయం) గౌరవనీయులైన సభ్యుడు మేరీకోమ్ పేరు తీసుకొచ్చారు. మేరీ కోమ్‌కి మేము గౌరవం ఇవ్వటం లేదని అంటున్నారు.... (అంతరాయం) ఎంత మాట ఇది. మేరీకోమ్‌ని పార్లమెంటు సభ్యురాలు చేసాము, భారతీయ జనతా పార్టీ ఆమెను ఎంపీ చేసింది...(అంతరాయం) ఏ విధంగా మేము మణిపూర్‌కి గౌరవం ఇవ్వలేదు? మణిపూర్‌కి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఇచ్చాం. నా మామకు మణిపూర్‌లో తుపాకీ గుండు దెబ్బ తగిలింది. అతను సిఆర్‌పిఎఫ్ లో డిఐజి గా ఉండేవారు...(అంతరాయం) ఇతనికి అమరవీరులు అంటే అర్థం తెలియదు. 1956వ సంవత్సరానికి ముందు మణిపూర్‌లో ఆర్మ్‌డ్ పోలీస్ (స్పెషల్ పవర్స్) ఎఎఫ్ఎస్‌పిఏ అమల్లో ఉండేది, ఇంకా 1956 నుంచి ఇప్పటిదాకా...(అంతరాయం) కాంగ్రెస్ వల్ల ఈ పరిస్థితి ఉంది.

> **ఈ సభను గట్టిగా ప్రశ్నిస్తున్నాను. భారతదేశ రాష్ట్రాలకు సంబంధించి మీరు మాకు అవసరం లేదని ఈ మూగ సమాచారం ద్వారా ఈశాన్య రాష్ట్ర ప్రజలకు, మరీ ముఖ్యంగా మణిపూర్ ప్రజలకు చెప్పాలనుకుంటున్నారా? ఆత్మాహుతి బాంబర్‌తో పెనుగులాడిన, అశోక చక్ర అవార్డు గ్రహీత మేజర్ లయిష్ రామ్ మణిపూర్‌వాడు. అతను అశోక్ చక్ర అవార్డు పొందాడు. మీరు అతని రాష్ట్రాన్ని అవమాన పరుస్తున్నారు. శ్రీలంకలో శాంతి దళంలో ఈ దేశం తరపున పని చేస్తూ కర్తవ్య నిర్వహణలో ప్రాణం కోల్పోయిన మేజర్ ఎన్గంగోమ్ జాయ్ దత్తా వీర చక్ర అవార్డు పొందాడు. మీరు అతన్ని అగౌరవ పరుస్తున్నారు. మేరికోమ్, సరితా కుంజారాణి, మీరాబాయి చాను లాంటి వారిని, మీరు ఈ దేశానికి అవసరం లేదని, మీ రాష్ట్రం మాకు అవసరం లేదని చెప్తున్నారు.**

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్(ఇన్నర్ మణిపూర్): నీవు మణిపూర్‌ని మినహాయిస్తున్నావు. దానిని కాదనగలవా?... (అంతరాయం) 75 ఏళ్ల తర్వాతి ఈశాన్య చరిత్రను గురించి మేము మాట్లాడుతున్నాం. మీరు చేస్తున్నది శుద్ధ మినహాయింపు. వలసవాద శక్తుల దృష్టిలో భారతదేశం చరిత్రకు సంబంధించిన విషయం కాదు, మానవ సంబంధిత విషయం... (అంతరాయం) ఈరోజు భారతదేశ చరిత్రకు సంబంధించిన పాఠ్య పుస్తకాలలో ఈశాన్యం చరిత్రకు వెలుపల ఉంది. అందువల్లనే మీరు వారిని ఇతరులుగా చూస్తున్నారు. ఆ మౌనం, ఏపూరి విషాదం మీద నెలకొన్న నిశ్శబ్దం విశేషమైనది కాదు. వలస పాలనా కాలం తర్వాత సాధారణ కొనసాగింపునకు ప్రతిరూపం ఇది...(అంతరాయం)

గౌ. చైర్ పర్సన్ (శ్రీకృష్ణ ప్రసాద్ తెన్నేటి): సర్, మీ పాయింట్‌ను తెలియజేశారు.(అంతరాయం)

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్ (ఇన్నర్ మణిపూర్): మణిపూర్ విషాదం పట్ల ఈ మౌనం బీజేపీలాంటి జాతీయ పార్టీకి సౌకర్యవంతంగా ఉందని చూడటం దుఖం కలిగిస్తున్నది.... (అంతరాయం) మీ గుండెల మీద చేతులు పెట్టుకుని ఆలోచించండి, 60 వేలమంది ప్రజలు కోణార్క్ శిబిరాల్లో అల్లాడుతున్నారు... (అంతరాయం) వారి తల్లుల గురించి ఆలోచించండి, భర్తలు కోల్పోయిన వారిని గురించి ఆలోచించండి, ఆ తర్వాతే జాతీయవాదాన్ని గురించి మాట్లాడండి...(అంతరాయం)

గౌ. చైర్‌పర్సన్: అతను విషయాన్ని చెప్పాడు.

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్(ఇన్నర్ మణిపూర్): అప్పుడు మాత్రమే ఈ విషాదం అంటే ఏమిటో అర్థం చేసుకోగలం...(అంతరాయం)మిస్టర్ చైర్మన్, బీజేపీ క్యాబినెట్ మంత్రిని ఓడించి, ప్రజాస్వామ్య దేవాలయాల్లో భాగమైన నన్ను ఎవరో అన్నట్టు తోసివేయటం బాధను, కోపాన్ని కలిగిస్తున్నది. నా బాధను ఊహించండి. నా గొంతు నుంచి వచ్చిన ఆవేదనను, బాధను మీరు వినండి. వెనక్కి పరికించి ఆ విషయాలు చూడండి... (అంతరాయం) 60 వేల మంది జనం శరణార్థ శిబిరాల్లో అల్లాడుతున్నారు... (అంతరాయం) దీనిని గెలిచేదాకా (దేశ) విభజన గురించి మాట్లాడవద్దు... (అంతరాయం) ప్రధానమంత్రి నోరు తెరిచి మాట్లాడినప్పుడు, జాతీయవాద పార్టీ మణిపూర్ భారత దేశంలో భాగమని అన్నప్పుడు, మేము ఆ ప్రజల రక్షణ చూస్తామని చెప్పినప్పుడు నేను నిశ్శబ్దంగా ఉంటాను... (అంతరాయం) అప్పుడు మాత్రమే మన దేశం యొక్క జాతీయవాదాన్ని అంగీకరిస్తాను... (అంతరాయం) ఈ మాటలతో నా ప్రసంగం ముగిస్తున్నాను.

- అనువాదం: కర్లపాలెం

సామం!

లో లోపల..
వివేకినన్న భ్రమలున్నప్పుడు
కండ్లు నెత్తిలకెక్కుతయి !

నాల్కె తిమతిమ..
అతి నోటి దురద..
మాటలు కోటలు దాటుతయ్ !
తోపు,సిపాయి పదాలు
పల్లవులై మారుమోగుతయ్ !!



దృష్టి సరిగా లేనప్పుడు
గ్రహణ సంక్లిష్టత సహజం !
నువ్వెంత ఏకాగ్రత పెట్టి
కట్టెల మంట పెట్టినా..
గాలివాటం ఎటుంటదో సెప్పలేం!?

ఒక ఇంటికి
రెండు ప్రవేశద్వారాలున్నప్పుడు
ఒకవైపు తలుపులు మూసేస్తే
రెండోవైపో గొళ్ళెం వుండే ఉంటది!

మీతిమీరిన..
మాటకారితనం వెకిలిప్రక్రియ !
సింప్లిసిటీ..
అగ్ర శిఖరాగ్ర సమానం !!

నిప్పులు..
ఎగదోసుకోవడం ఎంతసేపు!
కలుపుకుపోవడమే
జీవనది అంతిమ పరమార్థం!!

కనీస సహ,ఎరుకలేని
ప్రగల్భ సందర్భాలు
శవాలమీద పేలాల లెక్క !
మనిషిని పురుగులెక్క సూత్తయ్ !!
పరిణతి,పరిగణన పూరకాలు!

తపన,తండ్లాట మంచిదే
పొయ్యి,పొగ,దర్ప శపథాలు..
మాటైనా,సేతైనా..
నవ్వైనా,నడకైనా
నలుగురు నొచ్చుకోవద్దు కదా!

సామం..
సర్వమోద మాధుకరం !
భేదం ఎదలకు ఖేదం !!

-అశోక్ అవారి,
సెల్ : 9000576581

నూతన నేర చట్టాలు నిలిపివేయాలి

గత లోక్‌సభ చిట్టచివరి సమావేశాల్లో అత్యంత నిర్లక్ష్యంగా అప్రజాస్వామిక పద్ధతిలో ఆమోదించిన మూడు నూతన చట్టాలు జులై 1 నుంచి దేశమంతటా అమలులోకి వచ్చేలా బీజేపీ గట్టి చర్యలు తీసుకున్నది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు గత చట్టాల స్థానాన్ని భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం అనే ఈ మూడు చట్టాలు ఆక్రమించాయి. ఎలాంటి సన్నాహాలు, చర్చ, వాదనలు లేకుండానే మొత్తం న్యాయ వ్యవస్థ ప్రధాన మార్పులకు లోనుకావడం చూస్తే బుర్ర తిరిగే వ్యవహారం తప్ప మరొకటి కాదు. బీజేపీ పని తీరు పైన విధానాల పైన ఓటర్లు తీర్పు ఇచ్చిన తర్వాత, పార్లమెంటులో మెజార్టీ రాకుండా పోయిన తర్వాత కూడా ఆ పార్టీలో ఏ మార్పు లేదని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. హిందీలో మాత్రమే నామకరణం చేయబడిన ఈ మూడు చట్టాలపై లోక్‌సభలో లోతైన చర్చ జరిగిందే లేదు. ఏదో మొక్కబడి కోసం వాటిని సెలెక్ట్ కమిటీకి పంపి సభ ముందు పెట్టి క్షణాల మీద ఆమోదించేశారు. అసలు ఆ సమయంలో సభలో ప్రతిపక్ష సభ్యులు వుండే అవకాశమే లేకుండా చేయబడింది. ఎందుకంటే వారిలో 148 మందిని సస్పెండ్ చేసినందున సభలో పాల్గొనే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ అన్ని స్థాయిల్లోనూ వుండే న్యాయవాద బఅందాలు, సభ్యులు, ఆఖరుకు పోలీసులు కూడా ఈ కొత్త చట్టాలను గురించి పెద్దగా తెలియలేదు. అందువల్ల వాటి అమలు సహజంగానే వాటికి ఏ విధమైన వ్యాఖ్యానమివ్వాలి, అమలు చేయాలి అనే తీవ్రమైన సమస్యలు తెచ్చిపెడుతుంది. ఈ చట్టాలను అమలులోకి తేవడంతో పాటు దానికి సమాంతరంగా మరో నేర న్యాయవ్యవస్థ కూడా ఉనికిలోకి వస్తుంది. ఏమంటే జులై ఒకటవ తేదీకి ముందు ఏదైనా నేరం చేసిన ఒక వ్యక్తికి అప్పుడున్న విస్తారమైన నేర చట్టాల ప్రకారమే విచారించవలసి వుంటుంది. అదే నేరం గనక జులై 1 తర్వాత జరిగినట్టయితే ఈ సరికొత్త విస్తారమైన చట్టాల మేరకు విచారించవలసి వస్తుంది. అంటే దీని అర్థం ఏమంటే ఒక సమాంతర న్యాయవ్యవస్థ ఏర్పరచడం, ఒకే సమయంలో రెండు రకాల చట్టాలు అమలులోకి రావడం జరుగుతుందన్నమాట. దాంతో ఏ చట్టాన్ని వర్తింపచేయాలనే వివాదం రావడం సహజంగా జరుగుతుంది. ఉదాహరణకు జులై ఒకటవ తేదీ ముందు ఎఫ్ఐఆర్‌లో నేరారోపణకు గురైన వారు తమను పాత చట్టాల ప్రకారం విచారించాలిన కోరవచ్చు. కానీ ప్రాసిక్యూషన్ వారిని కొత్త చట్టాల ప్రకారం విచారణకు పెట్టడానికి ప్రయత్నించవచ్చు. వాజ్యాలు కూడా చాలా సంక్లిష్టంగా మారి పోతాయి.

మరో యాభై ఏళ్ల అస్పష్టత

చట్టాలకు సుప్రీంకోర్టు భాష్యం చెబుతూ వచ్చింది. సిఆర్‌పిసికి 1973లో చేసిన సవరణలు ఇప్పుడే కొంత నిశ్చిత రూపం సంతరించుకున్నాయి. ఈ కొత్తచట్టాలకు ఆ విధమైన స్థిరత్వం రావాలంటే మరో యాభై ఏళ్ల పడుతుంది. దేశంలోని వేలాది మంది మేజిస్ట్రేట్లు ఈ కొత్త చట్టాలకు వేర్వేరు పద్ధతుల్లో తమవైన వ్యాఖ్యానాలు చేసినప్పుడు ఏది నిలబడుతుందో ఊహించుకోవచ్చు. ఈ రకరకాల వ్యాఖ్యానాలు, ఆలస్యాల వల్ల నిందితులు విపరీతమైన సమస్యలకు గురవడం తథ్యం. ఆ నిందితులు గనక కస్టడీలో వుండేట్టయితే అతడు లేక ఆమె సమస్యలు మరింత జటిలంగా పరిణమిస్తాయి. చట్టం నిర్దేశించే పద్ధతి వల్ల తప్ప మరే విధంగానూ ఒక పౌరుడి ప్రాణాలకు, స్వేచ్ఛకు ఆటంకం రాకూడదని 21వ అధికరణం హామీనిస్తుంది. కాని ఇక్కడ అసలు చట్టం ఏమిటి అన్నదే వివాదమైనప్పుడు దాన్ని అమలు చేయడం కూడా కష్టతరమవుతుంది. ఈ కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయనే దానిపైనే అనిశ్చితిని, అస్పష్టతను తెచ్చిపెడతాయి. ఈ నూతన చట్టాలు వచ్చిన తర్వాత నేర కేసులు 30 శాతం ఎక్కువగా జాప్యం జరుగుతుందని సీనియర్ లాయర్లు చెబుతున్నారు. వేల మందికి, ప్రత్యేకంగా వనరులు లేని వారికి న్యాయం నిరాకరించబడటానికి ఇది దారితీస్తుంది. అసలు కేసుల పెండింగుపై దీని ప్రభావం ఏమిటనేది లెక్క కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన దాఖలాలే కనిపించవు. ఎందుకంటే దాన్ని సర్కారు ఖాతరు చేయదల్చుకోలేదు. అనువాదం చేయడానికి, అమలు చేయడానికి సంబంధించిన సమస్యలు ఎలాగూ తప్పవు గనక అనివార్య చిక్కులుగా వదిలేయవచ్చు. కాని ఈ నూతన చట్టాలలో కొన్ని సెక్షన్లు అత్యంత నిరంకుశమైనవి, మరికొన్ని సెక్షన్లు న్యాయం అందించడంలో అవరోధాలు సృష్టించేవిగా వున్నాయి.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

> **ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎలో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది.**

పోలీసులకు నిరంకుశాధికారాలు

న్యాయాన్ని చేరుకోవడంలో మొదటి అడుగు ఎఫ్ఐఆర్. ఈ కొత్త చట్టాల కింద మూడు నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశమున్న ఏదైనా నేరానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ 14రోజుల వరకూ జాగు చేయొచ్చు. ఈ విషయానికి సంబంధించిన వివిధ కోణాలను అధ్యయనం చేయడంలో స్టేషన్ హౌస్ అధికారి ఆలోచనలు కొనసాగించవచ్చు. బాధితులైన అతడు/ఆమె తమ ఫిర్యాదును ఉపసంహరించాలంటూ ఈ కాలంలో ఒత్తిడి తీసుకురావచ్చు. ఇది పోలీసులలోనూ అవినీతిని దారితీయొచ్చు. తమను తాము కాపాడుకోవడానికి రకరకాలైన పద్ధతులకు పాల్పడే అవకాశం అతడు/ ఆమెకు లభించవచ్చు. ఈ కొత్త చట్టాలు తీసుకొచ్చిన మార్పుల వల్ల పేదలు బలహీనులు న్యాయం పొందే హక్కుకు అంత్యంత తీవ్రమైన హాని కలుగుతుంది. వారిప్పటికే అనేక విధాల న్యాయం పొందే హక్కును ఉపయోంచుకోలేకపోతున్నారు. అలాగే ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు గత చట్టంలో పేర్కొన్న 15 రోజుల కాలపరిమితిని మించి అధికకాలం పాటు రిమాండులో వుంచాలని కోరవచ్చు. తరచూ నేరాలు చేసేవాళ్లకు (ఇదో కొత్త తరహా విభజన) ఈ కొత్త చట్టం ప్రకారం సంకెళ్లు కూడా వేయొచ్చు. పేదలు, బలహీనులకూ, అణచివేయబడిన వారికి, ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించేవారుగా పోలీసులు భావించేవాళ్లకు న్యాయాన్ని నిరాకరించే అధికారం మరింత పెరుగుతుంది.

124 ఎ మరింత తీవ్రరూపంలో

ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎలో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది. ఇక ఈ కొత్త చట్టాలతో పరిస్థితి ఇంకా దిగజారుతుంది. అంతేగాక ప్రస్తుతం ఉపా చట్టం కింద వున్న అనేక నేరాలను ఈ కొత్త నేరచట్టంలో పొందుపరిచారు. అంటే నిందితుడు వాస్తవంలో కొత్తనేర చట్టంలో ఉపా కింద ఎన్ఐఎ, కొత్త నేర చట్టం కింద పోలీసులు పెట్టే రెండు రకాల చార్జిషీట్లు ఎదుర్కొనవలసి వుంటుంది. చివరకు ఒకే శిక్ష విధించినా ఈ ఈ మొత్తం ప్రక్రియే తీవ్ర శిక్షలా నడుస్తుంది. పైగా ఉపా కింద దర్యాప్తు చేసేది స్థానిక పోలీసు కన్నా పై స్థాయి అధికారి కాగా కొత్త చట్టంలో మామూలు పోలీసు స్టేషన్‌కే టెర్రరిజంపై దర్యాపు చేసే హక్కు వుంటుంది. ఉపా కింద విచారణ జరిపేందుకు ప్రభుత్వ అనుమతి అవసరం కాగా కొత్త చట్టంలో ఒక సాధారణ పోలీసు అధికారి కూడా ఎవరినైనా టెర్రరిజం పేరిట దర్యాప్తు జరిపే అధికారం పొందడం ఇంకా ఆందోళన కలిగించే విషయం.

నిలిపేవరకూ పోరాటం

ఈ నూతన చట్టాలపై గట్టిగా పోరాడాల్సి వుంది. దేశ వ్యాపితంగా న్యాయవాద సంఘాలు నిరసనలు, కోర్టుల బహిష్కరణకు సన్నాహాలు చేస్తున్నాయి. సుప్రీం కోర్టును ఉద్దేశించి పిటిషన్లపై వేలాది మంది సంతకాలు చేసి పంపారు. ఈ చట్టాల గురించిన సమాచారం మరింత విస్తృతంగా తెలిసేకొద్దీ నిరసనలూ వ్యతిరేకత పెరుగుతూనే వుంటాయి. ప్రజాభిప్రాయం నిర్మించడం ద్వారా ఎన్‌డిఎ సర్కారుపై ఒత్తిడి తెచ్చి ఈ కొత్త చట్టాల అమలును నిలుపు చేయవలసిన పరిస్థితి తీసుకు రావాలి. వాటిని తాజాగా మరోసారి సమీక్షించాలి. ఎందుకంటే ఈ చట్టాలు దేశంలోని పౌరులందరి జీవితాలకూ స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. వాటిని ఇప్పుడున్న రూపంలో ఆమోదించే ప్రసక్తే వుండకూడదు.

(జులై3 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ
ఖమ్మం
5
గురువారం | జూలై 11, 2024 | www.navatelangana.com



సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో...
స్టడీ మెటీరియల్ వితరణ

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లికి చెందిన సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని నాలుగు పాఠశాలల విద్యార్థులకు ఆ ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి బుధవారం స్టడీ మెటీరియల్‌ను వితరణ చేశారు. నాచారం, రాళ్లబంజర, తొట్టిపంపు, ముకుందాపురం తదితర ఈ నాలుగు పాఠశాలలకు చెందిన 84మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, జియోమెట్రీ బాక్సులు (కంపాస్ బాక్స్) అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కుటుంబాలు పేద వర్గాలకు చెందిన వారు కావడంతో వారి పిల్లలకు ఇతోధికంగా సాయపడాలనే ఉద్దేశంతో స్టడీ మెటీరియల్‌ను అందించామన్నారు. కష్టపడి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి కన్నతల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, పుట్టిన ఊరికి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి విద్యార్థులను కోరారు. పిల్లలను పనులకు పంపకుండా మంచిగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, జియోమెట్రీ బాక్సులు అందించడం పట్ల ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు డాక్టర్ సుధారాణికి కృతజ్ఞతలు తెలిపారు.



'సెర్ప్' పథకాల నిర్వహణ, రికవరీలపై ఏపీడీ సమీక్ష

నవతెలంగాణ-సత్తుపల్లి

గ్రామీణాభివృద్ధిశాఖలోని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ (సెర్ప్) ద్వారా అమలవుతున్న పథకాలు, వాటి నిర్వహణ, రికవరీ తదితరాంశాలపై స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన వీవోఏలు, సీసీలకు బుధవారం ఏపీడీ నూరుద్దీన్ సమీక్ష సమావేశాన్ని జరిపారు. సెర్ప్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణాలు, రికవరీలపై చర్చించారు. ప్రతినెల రెగ్యులర్‌గా జరిగే లైవ్ మీటింగ్స్ అంశాలు, బ్యాంకు నిల్వలను బట్టి ఆయా గ్రూపులకు సంబంధించి 2014, మార్చి నుంచి 2023 ఫిబ్రవరి వరకు నమోదైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్, స్త్రీనిధి టార్గెట్లు, రెగ్యులర్ రికవరీ మహిళా శక్తి పథకాలు, మీ-సేవ కేంద్రాలు, పాడి పరిశ్రమలు, కోళ్లు, చేపల పెంపకం, క్యాంటిన్ల నిర్వహణ తదితర అంశాలపై ఏపీడీ నూరుద్దీన్ పూర్తిస్థాయిలో సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో స్త్రీనిధి ఆర్ఎం భీమా నాయక్, సత్తుపల్లి, వేంసూరు మండలాల ఏపీఎంలు సుబ్బారావు, శ్రీనివాసరావు, డ్వాక్రా ఈవో తలశీల రత్నకుమారి, డీజీఎం జనార్ధనరావు, వీవోఏలు, సీసీలు శ్రీనివాస్, రామారావు, కృష్ణ నరేందర్, షబ్బీర్, ప్రసాద్, చెన్నారావు, భాస్కర్ పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివద్ధికి సహకరించాలని బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించామని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1977 సంవత్సరంలో వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని, గతంలో నిర్మించిన తరగతి గదులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని, ప్రస్తుతం 15 శాశ్వత తరగతి గదులు అవసరం ఉన్నదని తెలిపారు. వైరా చుట్టుపక్కల గ్రామాల్లో పదో తరగతి పాస్ అయిన బాలికలకు ఇంటర్మీడియట్ చదవడానికి హాస్టల్ లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, కళాశాలకు అనుబంధంగా బాలికల హాస్టల్ ఏర్పాటు చేయవలసిందిగా వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కచ్చితంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను చెట్లు కాపాడుతాయి

నవతెలంగాణ - బోనకల్

పర్యావరణ సమతుల్యతను చెట్లు కాపాడతాయని మండల తహసిల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ ఎంపీడీవో లకావత్ రాజు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ అన్నారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనమహోత్సవంలో భాగంగా బుధవారం మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలను నాటారు. సుమారు కాలేజీలో 100 మొక్కల వరకు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ, ఏపీవో బసవోజు కృష్ణకుమారి, టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోడ శ్రావణ్ మాతృమూర్తికి దయాకర్ రెడ్డి నివాళి

నవతెలంగాణ- ఖమ్మం



కాంగ్రెస్ నాయకులు బోడ శ్రావణ్ మాతృమూర్తి గుండె పోటుతో హఠాన్మరణం చెందగా మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం నివాళు లర్పించారు. నగరంలోని 8వ డివిజన్ గోపాల పురంలోని వారి నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బోడ శ్రావణ్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో షేక్ ఇమామ్, ఉమ్మినేని కృష్ణ, ఎయిర్టెల్ నర్సింహారావు, యువ గోపి తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపైన ఉందని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ కే.రామయ్య, అధ్యాపకులు ఎం శ్రీనివాసరావు, జీకే చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-కల్లూరు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ ప్రమోషన్లపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఘనంగా సత్కరించి మెమెంటోలు అందించారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు పైగా సేవలందించిన చెరుకూరి రాజేశ్వరి, అరుణ, ఆర్ నిర్మల జ్యోతి, ఇందుప్రియ, వేముల శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పి.పద్మ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా తోపుడు బండి ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ జన్మదిన



సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు విద్యార్థులకు పుస్తకాలు, బహుమతులు ప్రోత్సాహకాలు అందిస్తూ సేవలు అందిస్తున్న సాధిక్ అలిని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలి

- కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి
- సీఐటీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, ఖమ్మం కార్పొరేషన్‌లో అక్రమ ప్రమోషన్లు నిలుపుదల చేయాలని, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరుతూ ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన నిర్వహించారు. జినుకల శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు వెంటనే నిర్ణయించి అమలు చేయాలని, ఖమ్మం కార్పొరేషన్‌లో అక్రమ ప్రమోషన్లు నిలుపుదల చేయాలని, కార్మికులకు రక్షణ పరికరాలు, డంపింగ్ యార్డ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో జవాన్ల ప్రమోషన్లు అక్రమ పద్ధతిలో ఇస్తున్నారని, ఇలాంటి పద్ధతిని వెంటనే నిలుపుదల చేయాలని, కార్మికులకు సీనియార్టీ లేదా చదువు ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకి కనీసం ఇవ్వాల్సిన రక్షణ పరికరాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని, చీపుర్లు, కొడవళ్ళు ఇతర పరికరాలు కార్మికుల్ని కొనుక్కోమని, కొంతమంది జవాన్లు ఒత్తిడి చేయడం మానుకోవాలని, ఇలాంటి ఒత్తిడిలు చేస్తే తిరిగి కార్మికులు ఆందోళన చేస్తారని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్‌కు దారి లేకపోవడం వల్ల వెహికల్స్ డ్రైవర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెహికల్స్ వెళితే తిరిగి రాని పరిస్థితిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, డంపింగ్ యార్డ్‌కి రోడ్డుని వెంటనే వేయించాలని, స్థానిక సమస్యలపై ఉన్నత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని పరిష్కారం చేయ్యాలని, లేని యెడల కార్మికులు తిరిగి ఆందోళన చేస్తారని హెచ్చరించారు. అనంతరం ఆందోళన వద్దకు మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ వచ్చి సమస్యలపై వారం రోజుల్లో పరిష్కారం చేస్తారని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దొడ్డా నరసింహారావు, వెంకటరమణ, పద్మ, విజయ, జల్లి శ్రీను, లాజర్, తురక నాగేశ్వరరావు, బుర్రి ఉపేందర్, సత్యం, కొరిపల్లి రవి, నాగేశ్వరరావు, బండారు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే వారి నిర్వాకం...
కొట్టుకుపోయిన వరినాట్లు

- సుమారు 100 ఎకరాల్లో రైతులు కోలుకోలేని నష్టం
- ముంపు పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అధికారుల అలసత్వంతో మంగళవారం కురిసిన భారీ వర్షానికి సత్తుపల్లి మండలంలోని కిష్టాపురం, తుంబూరు గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలకు తీవ్రనష్టం జరిగింది. భారీగా వరదనీరు రావడంతో కాలువలు తెగి ఏకంగా వరినాట్లు వేసిన పొలాల మీదుగా వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ఈ వారం రోజుల నుంచి వేస్తున్న వరినాట్లన్నీ కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవే నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వర్షాలు పడితే ఈ ప్రాంత రైతుల పంట పొలాలపై వరదనీరు ఉధృతంగా ప్రవహించి నష్టం జరుగుతుందని ముందే గ్రహించిన ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఈ విషయాన్ని గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి పట్టించుకోలేదని రైతులు అంటున్నారు. భారీ వర్షాలు పడిన సందర్భాల్లో తాము సూచించిన మూడుచోట్ల తూములు ఏర్పాటు చేస్తే వరదనీరు ఎంత వచ్చినా పంటచేలు ముంపుకు గురికాకుండా కాలువల ద్వారా వెళ్లిపోతాయని చెప్పినా వినకుండా కేవలం ఓ చోట మాత్రమే చిన్నతూరను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ వరినాట్లు వేయడానికి నారులేని పరిస్థితి

వేసిన వరినాట్లన్నీ భారీవర్షానికి కొట్టుకు పోవడంతో మళ్లీ నాట్లు వేసేందుకు రైతుల దగ్గర వరినారు సిద్ధంగా లేదు. కేవలం తమకు సరిపోయే విధంగానే వరినారు చల్లుకున్నామని, ఇలా జరుగుతుందని గ్రహించలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఒక్కో రైతుకు రూ. 25నుంచి 30వేల వరకు ఖర్చయిందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి నారు తెచ్చుకొని వరినాట్లు వేద్దామన్నా అది చాలా ఖర్చుతో కూడిన పనవుతుందని బాధిత రైతులు వాపోతున్నారు. కిష్టాపురం, తుంబూరు గ్రామాలకు సంబంధించి సుమారుగా 100 ఎకరాల్లో వరినాట్లు కొట్టుకుపోయాయని రైతులు తెలిపారు.

వరద ముంపు పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

భారీవర్షంతో ముంపుకు గురై కొట్టుకుపోయిన వరినాట్లు పడిన పొలాలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ బుధవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నష్టం జరిగిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే బాధిత రైతులకు హామీ ఇచ్చారు. బుధవారం సాయంత్రం ఐబీ అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. రైతులకు జరిగిన నష్టంపై ఐబీ అధికారులు గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది.



భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2)లను రద్దు చేయాలి

ఏఐఆర్టిడబ్ల్యూఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రమ్

నవతెలంగాణ- ఖమ్మం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2)లను రద్దు చేయాలని ఏఐఆర్టిడబ్ల్యూఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలోని జిల్లా రవాణా శాఖ అధికారి ఎంవీఐ వి.వెంకటరమణకి(సిఐటియు) ఏఐఆర్టిడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2)లను రద్దు చేయాలని, ఇది డ్రైవర్లకు విపరీత నష్టం కలిగిస్తుందని, ఏదైనా ప్రమాదం జరిగితే ఏడేళ్ల జైలు శిక్ష, పది లక్షల రూపాయలు జరిమానా విధించే అవకాశం ఉందని, అందుకని రద్దు చేయాలని, అలాగే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు, 12వేల రూపాయలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాందాస్, జిల్లా నాయకులు సాగర్, నాగేశ్వరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముష్టికుంట్ల పొలాలలో నాగలవంచ కూలీలు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో రోజువారీ కూలిపై రైతుల, కూలీల మధ్య వివాదం ఏర్పడటంతో రైతులు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కూలీలపై ఆధారపడ్డారు. గత మూడు రోజులుగా రోజువారి కూలి 300 రూపాయలు ఇవ్వాలని వ్యవసాయ కూలీలు ఆందోళన నిర్వహిస్తూ పనులు బంద్ చేశారు. మూడు రోజుల నుంచి ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కూలీలు ఎవరూ వ్యవసాయ పనులకు వెళ్ళటం లేదు. దీంతో కొంతమంది రైతులు చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన రైతులను రహస్యంగా తీసుకువచ్చి వ్యవసాయ పొలాలలో పత్తిలో కలుపు తీత పనులు చేయించుకుంటున్నారు. రోజువారి కూలి కాకుండా ఎకరాల వారీగా కలుపుతీత పనులను కాంట్రాక్టు పద్ధతిలో అప్పగిస్తున్నారు. ఒకవైపు ముష్టికుంట్ల కూలీలు పనులు నిలిపివేసి బంద్ పాటిస్తుండగా మరొకవైపు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు రహస్యంగా పనులు చేయించుకోవడం విశేషం. రోజువారి కూలి విషయంపై రైతుల, కూలీల మధ్య వివాదం ఏర్పడి వ్యవసాయ కూలీలు పనులు బంద్ చేసిన విషయాన్ని వారి దృష్టికి తీసుకురాగా ఆ విషయం మాకు తెలియదని, అందువల్లే తాము పనులకు వచ్చినట్లు తెలిపారు. ఒకవేళ వ్యవసాయ కూలీలు పనులకు రావద్దని అంటే తాము ఆగిపోతామని తెలిపారు. వారైనా కూలీలే మేమైనా కూలీలమే వారికి అండగా ఉంటామని తెలిపారు.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని ట్రంకురోడ్డులో శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా జూన్, జూలై మంత్ థీమ్ "గ్రీన్ ఇండియా మిషన్" అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణంలో మొక్కల ప్రాముఖ్యత ఎంతో ఉన్నతమైన స్థానాన్ని సంపాదిస్తుందని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని చెప్పి ప్రతి ఒక్క పిల్లవాడు పుట్టినరోజు సందర్భంగా ప్రతి విద్యార్థి మొక్కను నాటించి పర్యావరణానికి తోడ్పడాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రవి మాట్లాడుతూ పచ్చని చెట్లు అనేవి పర్యావరణానికి సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, అటువంటి పచ్చని చెట్ల నుండి వచ్చే ఆక్సిజన్ అనేది భూమి మీద ఉన్న ప్రతి ఒక్క జీవరాశికి కూడా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనంతరం నగరంలోని వీధుల్లో తిరిగి నినాదాలతో పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్నట్లు ఎన్నో నినాదాలతోని వారు సమాజానికి వివరణ ఇచ్చే విధంగా సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, జోనల్ కోఆర్డినేటర్ కృష్ణ రావు, ప్రైమరీ కోఆర్డినేటర్ పార్వతి, ప్రీ ప్రైమరీ



కోఆర్డినేటర్ గౌతమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, డీన్ హర్ష రాజు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియాపై 'సంకల్ప' పోరాటం

- అన్ని విధాలుగా అండగా ఉంటాం
- అటవీశాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్

నవతెలంగాణ-ఖమ్మం



తలసేమియా వ్యాధి సోకిన పిల్లల భవిష్యత్తు కోసం సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఎంతగానో పాటు పడుతోందని అటవీశాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ అన్నారు. బుధవారం సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలోని సంస్థ కార్యాలయంలో తలసేమియా చిన్నారులకు బ్యాగ్‌లు, నోట్‌బుక్స్, మందులు, ఇతర సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ తాను 2016లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసే సమయంలోనే తలసేమియా వ్యాధిపై ఒక అవగాహన వచ్చిందని తెలిపారు. తాను రాయాల్సిన పరీక్షలకు సంబంధించి సైన్స్, బయలాజికల్ సబ్జెక్ట్‌ల్లో తలసేమియా వ్యాధి గురించి ఉన్నదని పేర్కొన్నారు. తలసేమియా వ్యాధి ఉంటే రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువ అవుతుందని, దీంతో ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. మన దేశంలో ఈ వ్యాధి చాలామందికి ఉందని, అలాగే యూ.కే, అమెరికాల్లో కూడా ఉందన్నారు. అయితే గతంలో ఈ వ్యాధిపై అంతగా అవగాహన లేదని, ఎవరికైనా తలసేమియా ఉంటే తల్లి ద్వారానే సంక్రమించిందని నిందించేవారన్నారు. అన్ని రీసెర్చ్‌లు అయిన తర్వాత ఇందుకు గల కారణాలు కనుగొన్నారన్నారు. ఈ వ్యాధి ఉన్న అనేకమంది పెద్ద పెద్ద రంగాల్లో రాణించారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సినీనటుడు అమితాబ్ బచ్చన్‌కు, టెన్నిస్ ప్లేయర్ పీట్ సంప్రాస్‌కు తలసేమియా కారియర్ (మైనర్)లని తెలిపారు. తలసేమియాలో మైనర్, మేజర్ అనే రెండు రకాలున్నాయని, మైనర్ ఉంటే ఏ ఇబ్బంది ఉండదన్నారు. అయితే పెళ్లి ముందు టెస్ట్ చేయిస్తే సరిపోతుందని తెలిపారు. తలసేమియా ఉన్న అమితాబ్ బచ్చన్ కుటుంబంలో అభిషేక్ బచ్చన్‌కు, ఇతర సభ్యులకు తలసేమియా రాలేదన్నారు. ఎందుకంటే ఆయన భార్య జయబచ్చన్‌కు లేకపోవడంతో ఆ వ్యాధి కుటుంబంలో రాలేదని వివరించారు. ఖమ్మం పెద్ద జిల్లా అని, ఇక్కడ 15 లక్షల వరకు జనాభా ఉన్నారన్నారు. తలసేమియా వ్యాధి గురించి కలెక్టర్, డీఎంహెచ్ఓలతో మాట్లాడతానని, అలాగే సింగరేణి వంటి కంపెనీలతో మాట్లాడి తలసేమియా వ్యాధితో బాధపడే పిల్లలకు అండగా ఉండేలా చూస్తామన్నారు. తలసేమియా పిల్లలకు సేవ చేయడంలో సంకల్ప స్వచ్ఛంద సంస్థ అద్భుతంగా పనిచేస్తోందని కొనియాడారు. అయితే వ్యాధిగ్రస్తులైన పిల్లలతో అందరూ కలిసిపోవాలని, వారితో నార్మల్‌గానే మాట్లాడాలని, వారి వ్యాధిని గుర్తు చేసేలా ప్రవర్తించవద్దన్నారు. వారు ఆటలు, పాటల పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. అటవీశాఖ తరుపున రక్తదాన శిబిరం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్‌లు, వాటర్ బాటిల్స్ వితరణగా అందజేసిన భాగ్య, మమత, అనురాధలకు సంస్థ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.నారాయణమూర్తి, ఎఫ్ఆర్‌వో బెల్లం రాధిక, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, సభ్యులు ఉదయ్‌భాస్కర్, అనిత, ఉపేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెంలో లోకాయుక్తా అధికారి పర్యటన

- పూర్వం అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ
- అదే స్థలంలో నేషనల్ హైవేకు అనుమతి
- గతంలో భద్రునాయక్ ఫిర్యాదుపై అక్రమార్కులకు ఫైన్

నవతెలంగాణ- ఖమ్మం



రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి, కోయ చెలక రెవెన్యూ గ్రామాల పరిధిలోని పీర్ల గుట్టను అనుమతులకు మించి అక్రమంగా తవ్వి, మట్టిని తరలించుకొని పోతున్న విషయమై వచ్చిన ఫిర్యాదుపై గతంలోనే విచారణ తలపెట్టిన లోకాయుక్త విచారణ అధికారి మ్యాత్యు కోషి బుధవారం రఘునాథపాలెం మండలంలో మరోసారి పర్యటించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ చేసిన ఫిర్యాదులపై విచారణ జరిపిన సందర్భంగా ఫైన్ విధించిన ఉదంతం విధితమే . కాగా ప్రభుత్వం మారినా అక్రమార్కుల వైఖరి, అధికారుల సమన్వయ లోపం కారణంగా నేషనల్ హైవే కోసం పీర్ల గుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు పక్క దారి పడుతున్న విషయమై మరోసారి విచారణ నిర్వహించడానికి రఘునాథపాలెం మండలంలో పర్యటించి, ఆయన విచారణ చేపట్టారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్, ఏడి మైన్స్, మండల తాసిల్దార్, సర్వేయర్‌లు వెంట రాగా లోకాయుక్త విచారణ అధికారి మ్యాత్యూకోషి విచారణ జరిపారు. స్థానిక వివిధ శాఖ అధికారులు ఎక్కడ నుంచి ఎక్కడ వరకు అనుమతులు ఇచ్చారు ? అనే విషయంపై స్పష్టంగా వివరణలు ఇవ్వకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అక్రమ మట్టి రవాణా జరగకుండా అనుమతి ఇచ్చిన చోట కాకుండా మరోచోట తవ్వకాలు జరగకుండా, సరిహద్దులను నిర్ణయించి, చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేయాలని తన వెంట వచ్చిన అధికారులను ఆయన సూచించారు. కార్యక్రమంలో అబ్దుల్ రెహమాన్, ఉపేంద్ర బాయి, డి.నాగేశ్వరరావు, షేక్.నజిమా, కిషన్ నాయక్, రవీందర్ నాయక్, వీరన్న నాయక్ పాల్గొన్నారు.

20 మందికి ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

టీజీఎం గౌడ్స్‌లో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ ఆధ్వర్యంలో బుధవారం 20 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్‌లను తహసీల్దార్ పులి సాంబశివుడు, ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు, సీడీప కార్యదర్శి రెవ పి.ఎనోష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సభకు సిడిప కార్యదర్శి పి.ఎనోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ పులి సాంబశివుడు మాట్లాడుతూ నిరుపేదలకు ఇది ఒక గొప్ప సువర్ణ అవకాశమని అందరు మీ కుటుంబంల అభివృద్ధికి వినియోగించుకోవాలని కోరారు. సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ కార్యదర్శి ఎనోష్ కుమార్ మాట్లాడుతూ.... గత రెండు సంవత్సరాలుగా సీడీప సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్ ని నడుపుతున్నామని, దీని ద్వారా ప్రతి బ్యాచ్‌కి 20 మంది నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబ మహిళలు ఉపాధి పొందటం ద్వారా సంతోషిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రలీల ఎనోష్, కాటేపల్లి రజనీకాంత్, మట్టూరి జనార్ధన్ పాల్గొన్నారు.

పాఠశాలలో వన మహోత్సవం

నవతెలంగాణ-కల్లూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ పాఠశాలలో మొక్కలు నాటే వన మహోత్సవ కార్యక్రమాన్ని ఎంఈఓ దామోదర్ ప్రసాద్, మండల నోడల్ అధికారి పత్తిపాటి నివేదత, బాలికలు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పి.పద్మ అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పెద్ద కోరుకొండి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మొక్కలు నాటి ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాలలో మొక్కలానే కార్యక్రమం చేపడుతున్నారని ఎంఈఓ దామోదర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ ప్రధానోపాధ్యాయులు బాలాజీ నాయక్, సీఆర్పీ యాలాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండ సీఎంఆర్ఎఫ్ ఫండ్

నవతెలంగాణ-బోనకల్

నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తుందని చిరునోముల తాజా మాజీ సర్పంచ్ ములకారపు రవి అన్నారు. మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన పిల్లెం కొండకు రూ. 35 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును ములకారపు రవి బుధవారం చిరునోములలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు రూ.35 వేలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు గూడ నర్సయ్య శాస్త్రి, బుర్రి రోశయ్య, చెవల బాబు, మాజీ ఉప సర్పంచ్ ఆముదాల పుల్లారావు, యువజన కాంగ్రెస్ నాయకుడు నిమ్మ తోట జనప్రియ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు చవల రాజేష్, నిమ్మతోట సాయి గోపి తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మిక వర్గాన్ని కాపాడాలి

- **ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య డిమాండ్**

నవతెలంగాణ-తల్లాడ

అసంఘటిత రంగ కార్మిక వర్గాన్ని కాపాడాలని ఐఎఫ్టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం తల్లాడ పట్టణ మార్కెట్ యార్డ్‌లో తల్లాడ, ఏన్కూరు ఏరియా ఐదో మహాసభ పఠాన్ నాగుల్ మేరా అధ్యక్షతన నిర్వహించారు. రామయ్య ప్రసంగిస్తూ కార్మిక సమస్యలపై ఉద్యమిస్తున్న ఐఎఫ్టియు ఐదో మహాసభలు తల్లాడ పట్టణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏ.వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్మియా, తల్లాడ, వైరా ఏరియా అధ్యక్షులు వై.బాబు, ఏరియా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షులు కే. పుల్లారావు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

దోస్త్ కౌన్సెలింగ్ కు హాజరు కావాలి

నవతెలంగాణ-ఖమ్మం

దోస్త్ -2024 ద్వారా 2024-25 వార్షిక విద్యా సంవత్సరానికి మూడు ఫేసుల్లో సీట్లు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 వరకు సమయముందని తెలిపారు. గైర్హాజరైన విద్యార్థులు సీట్లు కోల్పోతారని తెలిపారు.

ఎక్కిరాల సుగుణమ్మకి సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో బుధవారం సీపీఐ(ఎం) సానుభూతిపరాలు ఎక్కిరాల సుగుణమ్మ చిత్రపటానికి సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, నాయకులు సేలం సత్యనారాయణ రెడ్డి, మోహన్రావు, శీలం పకీరమ్మ, కళ్యాణ కృష్ణయ్య, పులి కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి

నవతెలంగాణ-నేలకొండపల్లి

ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.ఆమోస్ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలంటే ప్రతి ఒక్కరూ పచ్చని మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కే.గురవయ్య, అధ్యాపకులు భరత్, సూర్యప్రకాష్, భాస్కర్, సోమేశ్వరరావు, ప్రమోద, బాలకష్ణ, గ్రంథపాలకురాలు రమాదేవి, అరుణ, సూపరింటెండెంట్ పాష, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పంట పొలాల రైతులను ఆదుకోండి

- **సీపీఐ(ఎం) జిల్లా నాయకులు మోరంపూడి, జాజిరి**

నవతెలంగాణ-సత్తుపల్లి

భారీవర్షాల కారణంగా వరి పొలాలు ముంపుకు గురై తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మండలంలోని పెదపాకలగూడెం, చినపాకలగూడెం, సత్యనారాయణపురం, బేతుపల్లి, నారాయణపురం, కిష్టాపురం, తుంబూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు వరి నాట్లు వేసిన క్రమంలో భారీ వర్షంతో వచ్చిన వరదకు వరి నాట్లు వేసిన పంటపొలాలు కొట్టుకుపోయాయన్నారు. పైన తెలిపిన గ్రామాలకు సంబంధించి వరద కారణంగా సుమారు 500 ఎకరాల్లో వంట పొలాలు కొట్టుకుపోగా కిష్టాపురం, తుంబూరు గ్రామాల పరిధిలో సుమారు 100 ఎకరాల్లో నాట్లు పడిన వరిచేలు గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాట్లేసిన వరిచేలు వరద ఉధతికి కొట్టుకుపోయాయన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఆయా పొలాలకు ముంపు ఇబ్బంది రాకుండా ఆయా గ్రామాల రైతులు ముందుగానే హైవే అధికారులకు తూములు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ వారు నిర్లక్ష్య ధోరణి వహించి తూములు ఏర్పాటు చేయని కారణంగా కిష్టాపురం, తుంబూరు గ్రామాల పరిధిలో వరినాట్లు వేసిన పొలాలు కొట్టుకుపోయాయని వారన్నారు. ముంపుకు గురైన ఆయా గ్రామాల రైతులకు ప్రభుత్వం నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి సీఐ బియ్యం వితరణ

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

జూన్ 5న సీతానగరం గ్రామానికి చెందిన మేకల సావిత్రి చిన్న కుమారుడు మేకల సంతోష్ (13) పిడుగుపాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. దీనికి సుమారు ఏడాది ముందు సావిత్రి భర్త మేకల విజయ్ సైతం విష జ్వరానికి సరైన వైద్యం అందక మృతి చెందిన విషయం విదితమే. కుటుంబ పోషణ అంతంత మాత్రంగా ఉన్న ఆ కుటుంబానికి సంతోష్ కర్మల నిమిత్తం రూ.5 వేలు ఎస్సై ఈ.రతీష్ పోలీస్ శాఖ తరుపున మానవతా ధృక్పథంతో అందజేసిన విషయం తెలిసిందే. అదే విషయం తెలుసుకున్న సీఐ టి.సురేష్ సైతం బుధవారం పోలీస్ శాఖ తరుపున ఆ నిరుపేద కుటుంబానికి 2 క్వింటాళ్ల బియ్యం వితరణగా అందజేశారు.

మూడు క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్షలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్



మూడు క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా 8వ రోజు న్యాయవాదులు రిలే దీక్షలు బుధవారం సీనియర్ న్యాయవాది వడ్డెల్లి కృష్ణ మూర్తి ప్రారంభించారు. ఈ దీక్షలో న్యాయవాదులు తన్నీరు పాపయ్య చెరుకూరి ముక్తేశ్వరరావు, కొత్త రాంబాబు, ప్రభాకర్ రావు, షేక్ బాను, పిడతల రామూర్తి దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్షలకు సీపీఐ(ఎం) నాయకులు ఎం.సుబ్బారావు, పి.శ్రీదేవి, డాక్టర్ గోపీనాథ్, మరియు బృందం, న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, జక్కంపూడి నాగేశ్వర్ రావు, బాజీ జాళావతి ఎల్ఐసీ నాయకులు కె.వి. లక్ష్మి తిరుమల రావు, శేషగిరి రావు, విప్లవ కుమార్, వై.శ్రీనివాస్ రావు సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు షురూ

- **12 వరకు దరఖాస్తు చేసుకోవాలి**
- **కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా జరగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ బదిలీలకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, జిల్లా క్యాడర్ పోస్టుల బదిలీ ప్రక్రియ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులలోని నిబంధనల ప్రకారం 4 సంవత్సరాలు ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని, అదే సమయంలో 2 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, జూలై 9 నుంచి జూలై 12 వరకు బదిలీల కోసం దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ శాఖ తమ పరిధిలో నాలుగు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఉద్యోగులు, శాఖ పరిధిలోని ఖాళీల తుది జాబితాను రూపొందించి ఉద్యోగస్తులకు అందుబాటులో పెట్టాలని, రెండు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులలోని ప్రాధాన్యత క్రమం వరుసలో బదిలీలు చేపట్టడం జరుగుతుందని, జిల్లా స్థాయి క్యాడర్ బదిలీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బదిలీ కోసం వచ్చిన దరఖాస్తు వివరాలను నమోదు చేసి పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, జిల్లాస్థాయి క్యాడర్ పోస్టుల బదిలీ దరఖాస్తులను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పరిశీలిస్తుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ ఎదుట బస్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. తాగునీటికీ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలని, ప్లాస్టిక్ బాటిళ్ల వాడకూడదని, స్టీల్ వాటర్ బాటిళ్ల వాడాలని ఆయన తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి నెల నెలా వేతనం అందేలా చూడాలన్నారు. అధికారులు, ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ కోసం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. శ్రీరామ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గోకినేపల్లి హైవే వద్ద స్కూటీ దగ్ధం

నవతెలంగాణ-ముదిగొండ



నేలకొండపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి ఖమ్మం నుండి స్కూటీపై బస్తాలు తీసుకెళు ్తుండగా గోకినేపల్లి హైవే వద్ద సైలెన్సర్‌కు బస్తాలు అంటుకొని మంటలు వ్యాపించాయి. దీంతో స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. స్కూటీ మీద ఉన్న వ్యక్తి చాకచక్యంగా తప్పించుకొని ప్రమాదం నుండి బయటపడ్డారు.

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలో చిరుమర్రి గ్రామానికి చెందిన నిరుడు మోహన్ రావు(28) అనే యువకుడు కుటుంబ కలహాలతో పురుగుమందు తాగి బుధవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు 108లో వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యవసాయ బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో కట్టకూరు గ్రామానికి చెందిన పాకనాటి పిచ్చిరెడ్డి(36) ఆర్థిక సమస్యలు తట్టుకోలేక గ్రామ సమీపాన ఓ వ్యవసాయ బావిలో దూకి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా, కోదాడలో హోటల్ వ్యాపారం చేసి ఆర్థికంగా దెబ్బతిన్నాడు. పిచ్చిరెడ్డికి భార్య ఒక బాబు ఉన్నారు. మృతుడు అన్నయ్య పాకనాటి కొరివి వీరారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై గజ్జెల నరేష్ తెలిపారు.

బ్యాంకు లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఎర్రుపాలెం



విద్యార్థులు బ్యాంకు నందు అకౌంటు తీసుకొని దానిని నిర్వహించుకున్నట్లయితే పొదుపు పైన అవగాహన, బ్యాంకు లావాదేవీలపై పరిజ్ఞానం పెంపొందించుకోవ చ్చునని బనిగండ్లపాడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ నక్క అభిషేక్ విద్యార్థులకు సూచించారు. మీనవోలు గ్రామంలో గల శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు బ్యాంకింగ్ లావాదేవీలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలతో ప్రతి పని ముడిపడి ఉంటుందని తెలిపారు. 400 మంది విద్యార్థులతో బ్యాంక్ అకౌంట్‌లను తెరిపించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ గోపి, భాస్కర స్కూల్ కరస్పాంటెండెంట్ భట్లపెనుమర్తి సూర్యనారాయణ, డైరెక్టర్ వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది పూర్ణ, సోమ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్మించిన సబ్ మార్కెట్ కమిటీ గోదాం అధికారుల ఆదరణ కరువై నిరూపయోగంగా మారింది. గోదాం రేకులు పగిలిపోయి దర్శనమిసన్నాయి. సబ్ గోడౌన్‌కు అనుబంధంగా నిర్మించిన ప్లాట్ ఫామ్ కూడా నిరూపయోగంగా మారింది. సుమారు 2010లో రూ.10 లక్షలతో నిర్మించిన సబ్ గోదాం, అందమైన ఆర్చి నిరూపయోగంగా మారటం పట్ల రైతుల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



గోడౌన్ రేకులు పగిలిపోయిన దృశ్యం



నిరూపయోగంగా ఉన్న ప్లాట్ ఫామ్

నిరూపయోగంగా మధిర మార్కెట్ కమిటీ సబ్ గోదాం

- **పగిలిపోయిన రేకులు**
- **పట్టించుకోని అధికారులు**

నవతెలంగాణ - బోనకల్

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బోనకల్ మండల రైతుల డిమాండ్ మేరకు మండల పరిషత్ కార్యాలయం వెనుక సబ్ గోదాం నిర్మాణానికి పది లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఈ నిధులతో సబ్ గోదాం నిర్మాణము, పెద్ద ఎత్తున ఆర్చిని నిర్మించారు. గోడౌన్ కు సిమెంటు రేకులతో పైకప్పు వేశారు. దీనిని ఆనాటి చీఫ్ విప్ మల్లు భట్టి విక్రమార్క 27 జులై 2010న ప్రారంభించారు. ఈ గోదాంను కేవలం మూడు నాలుగు సంవత్సరాలు మాత్రమే వినియోగించింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండల వ్యాప్తంగా కొనుగోలు చేసిన మొక్కజొన్నలను, ధాన్యాన్ని ఈ గోదాంలో భద్రపరిచారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సహకార సంఘాల ద్వారా నామమాత్రంగానే మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించారు. గత కొన్నేళ్లుగా అధికారులు సబ్ గోదాం వైపు కన్నెత్తి చూడటం లేదు. సబ్ గోదాం కంటే ముందు ఆనాటి సీపీఐ(ఎం) మధిర ఎమ్మెల్యే కట్ట వెంకట నరసయ్య హయంలో రైతుల సౌకర్యార్థం పంటల కోసం ప్లాట్ ఫామ్ కూడా నిర్మించారు. వ్యవసాయ పంటలను ఈ ప్లాట్ ఫామ్‌పై రైతులు ఆరబెట్టుకునేవారు. ఆ తర్వాత గోదాం నిర్మించారు. గోదాం రేకులు పగిలిపోవడంతో వర్షాకాలకు కురుస్తోంది. గోడలు కూడా పలుచోట్ల పగుళ్లు వచ్చాయి. ఈ గోదాం నిర్మాణ సమయంలో సదరు కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మాణం చేస్తున్నాడని నవతెలంగాణ కథనాలను కూడా ప్రచురించింది. కథనం వచ్చిన రోజు సంబంధిత అధికారులు స్పందించి, ఆ తర్వాత సదర్ కాంట్రాక్టర్ తో కుమ్మక్కైనట్లు ఆనాడు ఆరోపణలు బలంగా వచ్చాయి. గోడౌన్ నిర్మించిన కేవలం 14 సంవత్సరాల వ్యవధిలోనే రేకులు పగిలిపోవడం, గోడలు పగుళ్లు ఇవ్వటంతో అధికారులు వినియోగించుకోకుండా వదిలేశారు. గోదాంను వినియోగంలోకి తీసుకురావాలని మండల రైతాంగం కోరుతోంది.

కూలి రేట్ల పెంపు కోసం కూలీల ఆందోళన

- **రోజు కూలి రూ.300 ఇవ్వాలి : కూలీలు**
- **రూ. 250 ఇస్తామంటున్న రైతులు**
- **చర్చలు విఫలం - వ్యవసాయ పనులు బంద్**

నవతెలంగాణ-బోనకల్



రైతుల, కూలీల మధ్య సాగుతున్న చర్చలు

రోజు కూలి రూ.300 ఇస్తేనే వ్యవసాయ పనులకు వస్తామని కూలీలు, లేదు రూ.250 మాత్రమే ఇస్తామని రైతులు చెబుతుండడంతో గ్రామంలో పనులు నిలిచిపోయాయి. మండల పరిధిలోనే ముష్టికుంట గ్రామంలో గత మూడు రోజులుగా వ్యవసాయ కూలీలు రోజువారి కూలి రూ. 300లు ఇస్తేనే పనులకు వస్తామని బంద్ పాటిస్తున్నారు. రైతులు మాత్రం రోజు కూలి రూ.200 మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు మధ్య వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు మధ్యవర్తిగా రంగంలోకి దిగి చర్చలు జరుపుతున్నారు. గత ఏడాది చివరిలో వ్యవసాయ పనులకు రూ. 300లు ఇచ్చారని ఈ సంవత్సరం కూడా అదే రేట్లు కొనసాగించాలని కూలీలు పట్టుపట్టారు. గత ఏడాది చివరి కావడంతో రూ.300లు ఇచ్చామని, వ్యవసాయ కూలీలు రైతుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. దీంతో వ్యవసాయ కూలీలు కూడా తమ పరిస్థితులను కూడా రైతులు అర్థం చేసుకొని సానుకూలంగా స్పందించాలని, పట్టుదలకు పోవద్దు అని కూలీలను కోరారు. గ్రామంలో సుమారు 70 శాతం వరకు వ్యవసాయ కూలీలే ఉన్నారు. రైతుల వ్యవసాయ కూలీల మధ్య సమన్వయకర్తగా బంధం శ్రీనివాసరావు వ్యవహరించినప్పటికీ చర్చలు సఫలం కాలేదు. దీంతో ఇరు వర్గాల వారు ఎవరికివారు చర్చల నుంచి వెళ్లిపోయారు. గత మూడు రోజులుగా కూలీలు గ్రామంలో మైక్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. రోజువారి కూలీ రూ. 300 రూపాయలు ఇస్తేనే పనులకు వెళ్లాలని లేకపోతే వెళ్ళవద్దని అలా కాకుండా ఎవరైనా పనులకు వెళితే వారిపై చర్యలు తీసుకుంటామని కూలీలు హెచ్చరించారు. అదేవిధంగా రైతుల కూడా రోజువారి కూలీ రూ. 250లు మాత్రమే ఇవ్వాలని అలాకాకుండా రైతులు ఎవరైనా దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే రైతులపై చర్యలు తీసుకుంటామని మైకు ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో మూడు రోజుల నుంచి ముష్టికుంట్లలో వ్యవసాయ పనుల పూర్తిగా నిలిచిపోయాయి. చివరికి ఈ సమస్య ఎటువైపు దారితీస్తుందో వేచి చూద్దాం.



డెయిరీ ఏర్పాటుకు స్థలం కేటాయింపు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఇందిరా పాల డెయిరీ ఏర్పాటుకు 40 గుంటల భూమిని తహసీల్దార్ మన్నె ఉషా శారద కేటాయించినట్లు ఇందిరా క్రాంతి పథకం ఏపీఎం వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎర్రుపాలెం నందు బ్లక్ మిల్క్ కూలింగ్ సెంటర్ (బీంసియు) ఏర్పాటుకు తహసీల్దార్ విశ్రాంతి భవనాలకు దగ్గరలో భూమిని కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన భూమిని తహసీల్దార్ మన్నె ఉషా శారద, మండల అభివృద్ధి అధికారి సురేందర్, డీపీఎం దర్గయ్య ఆర్ఐ రవికుమార్, ఏపీఎం వెంకటేశ్వర్లు, సర్వేయర్ రాజశేఖర్ పరిశీలించారు.



కొత్త చట్టాలపై అవగాహన

- ఆళ్ళపల్లి సీఐ, ఎస్సై

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

ఇటీవల దేశంలో ప్రవేశపెట్టిన కొత్త చట్టాలపై సీఐ, ఎస్సై టి.సురుష్, ఈ.రతీష్ ప్రజలకు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం వేరుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలంలో వచ్చే విష జ్వరాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మండలంలో శాంతి భద్రతల పరంగా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. మండలంలో మత్తు పదార్థాలు సేవించడం, కొనుగోలు లేదా అమ్మకం, సాగు చేయడం, రవాణా చేయడం వంటి పనులు చేయరాదని హెచ్చరించారు.

బాటన్ననగర్ గ్రామాన్ని సందర్శించిన ఎస్సై

ఆళ్ళపల్లి ఎస్సై ఈ.రతీష్ స్టేషన్ పరిధిలోని బాటన్ననగర్ గ్రామాన్ని బుధవారం సందర్శించి, ప్రజలతో మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీరే తాగాలని చెప్పారు. అపరచితుల వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు వెంకట్ రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ లు కృష్ణమూర్తి, రాజేశ్వరరావు, కానిస్టేబుల్ కె.ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు మధు**

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలో ఈజీ మనీకి అలవాటు పడిన కొంతమంది గంజాయి విక్రయిస్తూ యువతను పక్కదారి పట్టిస్తున్నారని, అటువంటి వారిని స్థానిక పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అనాసాగరం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు మండల వ్యాప్తంగా గుట్కా, గంజాయి మత్తు పదార్థాల విక్రయాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు మధు మాట్లాడుతూ డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సర్వేలో వచ్చిన సమస్యలపై ఆగస్టు నెలలో ఆందోళనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. యువత గంజాయి, గుట్కాలు, ఇతర డ్రగ్స్ కు అలవాటు పడి విలువైన తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సర్వే కార్యక్రమంలో డీవైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి నాగార్జున, అధ్యక్షులు భార్గవ్, పులకేష్, పవన్ కళ్యాణ్, నాగేంద్రబాబు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నవతెలంగాణ-తల్లాడ



రాష్ట్రంలో 40 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, 2011 కౌలు చట్టం ప్రకారం యజమానికి ఎటువంటి నష్టం లేకుండ, కౌలు రైతులుగా గుర్తించి, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకుని, కౌలు రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం సేలం సత్యనారాయణ రెడ్డి గృహంలో నల్లమోతు మోహన్ రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా ఇంతవరకు కౌలు రైతులపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించలేదన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలోనే కౌలు రైతులను గుర్తించి రైతులకు ఇచ్చే అన్ని రాయితీలను, రైతు బంధును, బ్యాంకుల ద్వారా ఎటువంటి షరతులు లేని రుణాన్ని, పంటల బీమాను వర్తింపజేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేకపోతే కౌలు రైతులందరిని సమీకరించి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంల శీలం, ఫకీరమ్మ, పులి కృష్ణయ్య, కళ్యాణం కృష్ణయ్య, వంగూరి లోకేశ్వరరావు, తెనాలి కృష్ణమ్మ, చల్ల నాగేశ్వరరావు, నన్నేసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పోస్టులు పెంచాలి



నవతెలంగాణ-చండ్రుగొండ

తెలంగాణ రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షను మూడు నెలలు వాయిదా వేయాలని, డీఎస్సీ పోస్టులు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ చండ్రుగొండ యువజన విభాగం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఎల్. ప్రసన్నకి వినతి పత్రాన్ని అందజేశారు.

గుండెపోటుతో ఎస్ఐ మృతి



నవతెలంగాణ-దమ్మపేట

స్థానిక పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న రెండోవ ఎస్ఐ సీమా నాయక్ బుధవారం గుండెపోటుతో ఖమ్మంలో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీమా నాయక్ ఖమ్మంలోని శ్రీ సాయినగర్‌లో తన గృహంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. హుటా హుటీనా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే తీవ్రమైన గుండెపోటుకు గురైన సీమా నాయక్ మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఈ వార్త దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు చేరడంతో దమ్మపేట పోలీసులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులకు దమ్మపేట ఎస్ఐ బీ. సాయి కిషోర్‌రెడ్డి తో పాటు సిబ్బంది సీమా నాయక్ సహచరులు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరారు.

ఉపాధ్యాయుల కొరత.. రోడ్ ఎక్కిన విద్యార్థులు..

- డీఈఓ హామీతో ధర్నా విరమణ



నవతెలంగాణ-అశ్వారావుపేట

విద్యాసంవత్సరం మొదలై నెల రోజులు గడుస్తున్నా గుమ్మడవల్లి ఉన్నత పాఠశాలలో ఇరువురు ఉపాధ్యాయులే ఉండటంతో ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు బడికి తాళాలు వేసి విద్యార్థులతో కలిసి రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 150 మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఎనిమిది మంది ఉపాధ్యాయులకు గాను ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉండటంతో పదో తరగతి విద్యార్థులు తీవ్ర ఆందోళనల చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు కలిసి బుధవారం గుమ్మడవల్లి రోడ్డుపై బైఠాయించి రెండు గంటలసేపు ధర్నా నిర్వహించారు.బోధనా సిబ్బంది లేకపోతే పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న డీఈవో వెంకటేశ్వర చారి సీఆర్పీ రామారావుకు ఫోన్ చేసి గ్రామస్తులతో మాట్లాడారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని ప్రస్తుతానికి ధర్నాని విరమించి స్కూలు తాళాలు తీసి విద్యార్థులను బడిలోకి పంపించాలని ఆదేశించారు. డీఈవో హామీ మేరకు గ్రామస్తులు ఆందోళనలు విరమించి విద్యార్థులను స్కూలుకు పంపారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఈసారి ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు నాగేశ్వరరావు, పల్లపు తిరుపతిరావు, డేరంగుల వెంకయ్య పుట్ట సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు



నవతెలంగాణ-కరకగూడెం

మండల కేంద్రంలో పలు వార్డులలో గత కొంత కాలంగా విద్యుత్ విధి దీపాలు వెలగడం లేదని స్థానిక ప్రజలు తెలిపారు. వీధి దీపాలు వెలుగక పోవడంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంగా ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీది దీపాలు వెలి గేలా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసు కోవాలని గ్రామ ప్రజలు కోరు తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలి
- త్వరలో మండలానికి మరిన్ని అభివృద్ధి పనులు
- మండలంలో ఎమ్మెల్యే పాయం సుడిగాలి పర్యటన



నవతెలంగాణ-పినపాక


మండల స్థాయి అధికారులు నిత్యం గ్రామాలలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని, అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పినపాక, సీతంపేట, బోటిగూడెం గ్రామ పంచాయతీలలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామాలలో స్వయంగా ఆయనే ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా ముందుగా పినపాక మండలంలోని మారేడుగూడెం గ్రామంలో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాలచెరువు, వసంతరావు కుంట వరద నీరు గ్రామంలోకి రావడంతో తమ ఇళు ముంపునకు గురవుతున్నాయని తెలపడంతో వరదనీరు గ్రామంలోకి రాకుండా కాలువకు ఇరువైపులా కట్టనిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలకు సీసీ రోడ్డు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామానికి సుమారు 80లక్షల రూపాయలతో నిర్మించిన నూతన బ్రిడ్జి, 20లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా 1కోటి 60లక్షల రూపాయలతో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అన్ని వసతులతో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని, ఆసుపత్రిలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు కోసం ఇంకా ఎంత నిధులు మంజూరు చేయించాలో పూర్తి వివరాలతో లిస్ట్ అందించాలని కోరారు. మరో పది రోజుల్లో నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషెంట్ వార్డ్‌లను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వైద్య సిబ్బంది 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రజలకు కష్టంతో కాకుండా ఇష్టంతో వైద్యం చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బంది పలు సమస్యలు తెలపడంతో వెంటనే జిల్లా వైద్యాధికారితో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ గతంలో నిర్మించిన తరగతి గదులు కుంగిపోయి ఫ్లోరింగ్ రాళ్ళు పగిలిపోవడంతో వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చక్కగా చదువుకోని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలకు పహారిగోడ, బ్రిడ్జి నిర్మాణం చేయించాలని ఉపాధ్యాయులు కోరగా ఎంతమేరకు నిధులు అవసరం అవుతాయో వివరాలు అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చిమొక్కలు, చెత్త మొత్తం తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పాఠశాలలు, ఆసుపత్రులను ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ వాటి నిర్మాణం లో నాణ్యత లోపం వలన తొందరగా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం సీతంపేట, బోటిగూడెం గ్రామపంచాయతీలలో సుమారు 1కోటి రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డు, కల్వర్టులను ప్రారంభించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు త్రాగునీటి సమస్య ఉన్నదని తెలపడంతో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తోట సూర్యనారాయణ, ఎంపీడీఓ రాఘవరపు రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏడూళ్ళ బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్, విద్యుత్‌శాఖ ఏఈ కావ్య, పీఆర్ ఏఈ రొనాల్డ్, ఆర్ఐ బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం, వైస్ ఎంపీపీ కింది సుబ్బారెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకులు కొర్సా ఆనంద్, ఉడుముల రవీందర్ రెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, పరిమి వెంకటేశ్వర్లు, నవ్వాతి శ్రీను, ఆరె శంకర్, బండారు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు కోసం ఫ్యూచర్ ల్యాబ్ ఆన్ వీల్స్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఫ్యూచర్ ల్యాబ్ ఆన్ వీల్స్ ఫ్లో(బస్) విధానాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాలలో మండలంలో గల అన్నీ పాఠశాలలు కళాశాలల విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జారే ఆదినారాయణ మాట్లాడుతూ సృజనాత్మకత కొత్త కొత్త ఆలోచనలు చేయడం వాస్తవ ప్రపంచంలో ఎలా బ్రతకాలి అనే ఆలోచనలు వచ్చే తరానికి ఏమి అందించాలి అనేదానిపై సైన్స్ ద్వారా భవిష్యత్తులో అనేక ఆవిష్కరణలు చేయ వచ్చు అని అన్నారు. బస్సులో ఉన్నటువంటి ఎక్స్పరిమెంట్ల అనేక అంశాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్య కోసం ఇంత కంటే మంచి మంచి కార్యక్రమాలు తీసుకు వచ్చి మంచి కార్యక్రమాన్ని అందించిన సీఈవో మధులాష్ బాబుని జారే అభినందించారు. వారి బృందాన్ని ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహీల్దార్ జగదీష్ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఎంపిడిఓ మహాలక్ష్మి, సబ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులు నియంత్రించాలి : డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో జ్వరాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే తగిన ప్రత్య పరీక్షలు చేయించి వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ముందుగానే ఎలా నియంత్రించాలి అనే దానిపై డాక్టర్ ప్రియాంక,తన్మయి,వైద్య సిబ్బందికి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకునే విధంగా అదేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య విషయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనేది కూడా ప్రజలకు వైద్య సిబ్బంది సలహాలు ఇవ్వాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, డాక్టర్ చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీ-టెక్ ప్రవేశం కొరకు దరఖాస్తుల గడువు పెంపు

నవతెలంగాణ-ఇల్లందు

ఏరియా సింగరేణి అధికారుల, ఉద్యోగుల పిల్లలకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకతీయ యూనివర్సిటీ కొత్తగుడెం, జేయన్‌టియు(హెచ్) యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మంథని నందు బి.టెక్ కోర్స్‌లలో చేరుటకు దరఖాస్తుల గడువు పెంచినట్టు ఏరియా జియం జాన్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల, ఉద్యోగుల పిల్లలకు మైనింగ్, సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్సు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ విభాగాలలో సీట్స్ కేటాయించారని, ఉద్యోగులకు ఏమైనా సందేహాలు ఉన్నట్లుయితే సంభందిత గని / విభాగాలలో సంప్రదించగలరని తెలిపారు.

అర్హతలు

1.తెలంగాణా రాష్ట్రము నిర్వహించిన 2023-24 ఎం సెట్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
2.దరఖాస్తులో హాల్ టికెట్ నెంబర్, ర్యాంక్ స్పష్టంగా నమోదు చేయాలి.
3.దరఖాస్తులో 2023-24 ఎం సెట్ మెరిట్ జిరాక్స్ కాపీ సమర్పించాలి.
4. కుల ధృవీకరణ పత్రం, స్తానికం/నాన్-లోకల్ సమర్పించాలి.
5.కౌన్సిలింగ్ సమయంలో ఉద్యోగి ఐడీ కార్డును సమర్పించాలి.
6.కౌన్సిలింగ్‌లో ఎంపికైన అభ్యర్థులు ప్రవేశ రుసుము చెల్లించాలి.

ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూలై నెల 20 వ తేదీ లోపు సంభందిత గని విభాగాలలో అందజేయాలని సూచించారు.

ఆదివాసీల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు

- ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వర్



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఆదివాసీల ఆరోగ్య సంరక్షణ కోసమే మారుమూల గిరిజన గ్రామాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వర్ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల వలస ఆదివాసి గుత్తికోయ గ్రామమైన సిరిగుండం గ్రామంలో దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు నిర్వహించిన వైద్య శిబిరంలో దుమ్ముగూడెం వైద్యాధికారి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వెనుకబడిన మారుమూల ఆదివాసీల ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాలను అందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం అన్నారు. వర్షాకాలంలో కురుస్తున్న అధిక వర్షాల వలన దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి విషపూరిత జ్వరాలు ప్రభలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏదైనా అత్యవసరమైతే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించి సహాయం పొందాలని తెలిపారు. గ్రామంలో నివసిస్తున్న 52 కుటుంబాలకు చెందిన సుమారు 200 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన దుమ్ముగూడెం పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం ఇన్స్‌పెక్టర్ అశోక్, ఎస్సై గణేష్, ఆర్ఎస్ఐ హరీష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలు కఠినం

- గంజాయి, కొకైన్ జోలికి వెళ్లొద్దు
- సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయండి
- అవగాహన సదస్సులో డీఎస్పీ చంద్రబాను



నవతెలంగాణ-ఇల్లందు

నూతన క్రిమినల్ చట్టాలు కఠినంగా ఉన్నాయని డీఎస్పీ చంద్రబాను తెలిపారు. ఆర్థిక పరమైన నేరాలను సైబర్ నేరాలు...ఇవీ ఒక వ్యక్తి, లేదా దేశం భద్రత, ఆర్థిక ఆరోగ్యాన్ని దెబ్బతీయవచ్చు. సైబర్ నేరాలకు మీరు ఎప్పుడైనా గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయాలన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్స్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ రంగం రామలింగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ క్రైమ్, లేదా కంప్యూటర్-ఆధారిత నేరమన్నారు. గంజాయి, కొకైన్ వీటికి విద్యార్థులు మరియు యువత 25 నుండి 35 సంవత్సరాలలోపు చాలామంది బలవుతున్నారని కావున వాటి జోలికి వెళ్ళొద్దని తెలిపారు. నూతన క్రిమినల్ చట్టాలు జులై 1 నుంచి అమల్లోకి వచ్చాయని ఆ చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని కావున హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని విద్యార్థులు లైసెన్స్ లేకుండా టూ వీలర్లు నడపద్దని 18 సంవత్సరాల లోపు వయస్సు విద్యార్థులు, పిల్లలు ఎవరైనా టు వీలర్ బండి నడిపి దొరికితే వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, లైబ్రరీన్ ఖాసీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తొర్తి జాన్, మరో ప్రోగ్రాం ఆఫీసర్ విలియం ప్రసాద్, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రవి నాగేశ్వరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- ఎంపీడీవో అశోక్



నవతెలంగాణ-చండ్రుగొండ

పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని రావికంపాడు గ్రామంలో అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలను ఎంపీడీవో అశోక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అశోక్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లలో రికార్డును ప్రతిరోజు నమోదు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రపరచమని పంచాయతీ వర్కర్లకు చెప్పారు. ఆరోగ్య కేంద్రంలోని ఏఎన్ఎం లకు ప్రతిరోజు జ్వరంతో కేంద్రానికి వచ్చిన వారికి తప్పనిసరిగా జ్వరం ఎక్కువగా ఉంటే రక్త పరీక్షలు చేయమన్నారు. ప్రభుత్వ స్కూల్లో పంచాయతీ కార్యదర్శితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఏఎన్ఎం ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం నేర్పించాలి : సీడీపీఓ

అన్నపురెడ్డిపల్లి : అంగన్‌వాడీ కేంద్రంలో ముదు సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి బాల, బాలికలను చేర్చుకొని వారికి నూతన జాతీయ విద్యా విధానాన్ని నేర్పించాలని సీడీపీఓ నిర్మాలజ్యోతి అన్నారు. మండల కేంద్రంలో గల రైతు వేదిక నందు అంగన్‌వాడీ టీచర్లకు నూతన జాతీయ విద్యా విధానంపై శిక్షణ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రంలో 3 సంవత్సరాల పిల్లలకు నర్సరీ ఎల్కేజీ, యూకేజీ దశలో మేధాశక్తి పెరిగే దశ కాబట్టి వారిని నూతన విద్యా విధానం బాల్యంలోనే అలవాటు చేయాలని చూసించారు. అదేవిధంగా ఎ నెలలో ఎంత సిలబస్ చెప్పాలి అనేదానిపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ నాగమణి, సూపర్వైజర్ గంగాజలం పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం



నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని గండుగులపల్లి రైతువేదిక వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎన్వీ. వేణుగోపాల చారి మాట్లాడుతూ విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వినియోగదారులు ఈ వేదిక ద్వారా తెలియజేయాలన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించి తగు సూచనలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వేదిక నుండి ముఖ్యంగా రైతులు విద్యుత్ శాఖకు సంబంధించి ఖాళీలను భర్తీ చేయడం, పామాయిల్ తోటలలో ఉన్న లైన్‌లను మార్చడం గురించి వివరించారు. ఈ ఫోరం నందు మెంబర్ టెక్నికల్ కె. రమేష్, చరందాస్, నరేందర్‌లతో పాటు సంబంధిత పాల్వంచ డీఈ నందయ్య, ఏడీఈ బీ. వెంకటేశ్వర్లు, ఏఈలు మహేష్, సాయికిరణ్, సంతోష, వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీని వాయిదా వేయాలని నిరసన



నవతెలంగాణ-దమ్మపేట

నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న మొండివైఖరిని నిరశిస్తూ మండల బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన విభాగ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగులు కోరుతున్నట్లుగా డిఎస్సీని వాయిదా వేయాలని, గత కొద్ది రోజులుగా నిరుద్యోగులు తమ న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలని చేస్తున్న నిరసనలకు సంఘీభావం తెలుపుతూ తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగాల కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలకు మూడు నెలల పాటు గడువు పెంచాలని కోరుతూ బీఆర్ఎస్ యువజన విభాగం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన విభాగం మండల అధ్యక్ష కార్యదర్శులు అల్లాడి వెంకటేష్, జిలకర గంగరాజులు మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నే సత్యనారాయణ మూర్తి, కణితి రాముడు, అధికార ప్రతినిధి జాని పాషా, ఉపాధ్యక్షులు తునికి కామేష్, సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాస్, నాయకులు పోడియం సుబ్బారావు, నోముల రామిరెడ్డి, మడకం భూపతి, వాగే కృష్ణ, మోతుకురి శ్రీకాంత్, పూసం రాజేష్, కుమ్మరి కుంట్ల సూర్య, అజీమ్, వీర్రాజు , పొడుతురి నాగరాజు, తంతరపలి వెంకటేశ్వరరావు, జెట్టి రామకృష్ణ, రాయపూడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంరూరల్ : రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళన పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ పరీక్షలు మూడు నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు ఆకోజు సునీల్ కుమార్, కాపుల సూరిబాబు, ఐనాల రామకృష్ణ, నర్సింహులు, చిట్టిమల్ల అనిల్, రమేష్, వెంకట్రావ్, రంజిత్, శ్రీరాములుతదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకి ఎమ్మెల్యే జారె నివాళి

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో రెండవ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డుగురోడ్ సీమా నాయక్ బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఎస్ఐ స్వగ్రామం ఖమ్మం చేరుకొని సీమా నాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గిరిజన గురుకులంలో విజయవంతంగా స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-భద్రాచలంరూరల్



ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కాలేజ్ 2024-25 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీ కొరకు రెండవ స్పాట్ కౌన్సిలింగ్ బుధవారం భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారు. భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బీ.రాహుల్ ఆదేశానుసారం ఆర్‌సీఓ తుమికి వెంకటేశ్వర రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు పారదర్శకంగా సీట్లు భర్తీ కౌన్సిలింగ్ నిర్వహించారు. బాలికలకు మొత్తం 127 సీట్లకు గాను 81 సీట్లు అదేవిధంగా బాలురకు 386 సీట్ల గాను 46 సీట్లు ఈ కౌన్సిలింగ్లో భర్తీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ శ్రీ తుమికి వెంకటేశ్వర రాజ్, కృష్ణసాగర్ ప్రిన్సిపాల్ హరి సింగ్, దమ్మపేట ప్రిన్సిపాల్ జాను నాయక్,గుండాల ప్రిన్సిపాల్ హరికృష్ణ ,మణుగూరు ప్రిన్సిపాల్ పద్మావతి, భద్రాచలం ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, అన్నపరెడ్డిపల్లి కాలేజీ ప్రిన్సిపాల్ రాణి, కొత్తగూడెం ప్రిన్సిపాల్ ఉమా చౌహన్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, వివిధ కళాశాలల లెక్చరర్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



'విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలి'

నవతెలంగాణ-భద్రాచలంరూరల్

రజక నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వ ఇస్తున్న ఉచిత విద్యుత్ 250 యూనిట్ల పథకం సంబంధించిన 100 కోట్ల పాత బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి వృత్తిదారులకు ఉపాధి కల్పిస్తున్న ఉచిత విద్యుత్ పథకం ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణ కార్యదర్శులు రాజమండ్రి వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం అయ్యప్ప స్వామి టెంపుల్ సెంటర్ కార్యాలయంలో కమిటీ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ అధికారులు అనేక మండలాలలో గ్రామాల్లో వృత్తిదారులన్ని బిల్లులు కట్టాలని వేధింపులు గురి చేస్తున్నారని, కొన్నిచోట్ల కనెక్షన్స్ కట్ చేసేస్తున్నారని వృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు మొత్తం బకాయిలన్నీ చెల్లిస్తామని తెలిపిన హామీని అమలు చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన రజకులకి 3000 పెన్షన్ ఇవ్వాలని వృత్తి చేస్తూ అనారోగ్యంతో చనిపోయిన రజకులకు 10 లక్షల బీమా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి లక్ష్మణ్, గొట్టాల రామకృష్ణా, వెంకన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పుస్తకాలు వితరణ

నవతెలంగాణ-దమ్మపేట

సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని నాచారం, రాళ్ల బంజర, తొట్టి పంపు ముకుందాపురం గ్రామాలలో ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న 84 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, కంబాక్స్‌లను బుధవారం అందజేశారు. ఈ పాఠశాలలు మారుమూల గ్రామాలలో ఉండడం ఈ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు పేదలు కావడంతో సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి నోటు పుస్తకాలు, కంబాక్స్ లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులను పనులకు పంపకుండా చదివించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. తమకు నోటు పుస్తకాలు, కంబాక్స్‌లు అందజేసిన సుధారాణికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణలో తెలుగుదేశం జెండా ఎగరాలి

- పార్టీ మాజీ అధ్యక్షులు బక్కిని నరసింహులు

నవతెలంగాణ-ములకలపల్లి

తెలంగాణలో తెలుగుదేశం జెండా ఎగరాలని ఆ పార్టీ మాజీ అధ్యక్షులు బక్కిని నరసింహులు అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ జెండా పండగ కార్యక్రమంలో భాగంగా జగన్నాదపురం గ్రామంలో పార్టీ జెండాను మాజీ రాష్ట్ర అధ్యక్షులు బక్కిని నరసింహులు పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం నరసాపురం గ్రామం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతివార్డులో తెలుగుదేశం పార్టీ జెండాఎగరవేసి పార్టీని బలోపేతం చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురపాటి వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట నియోజకవర్గం ఇన్చార్జి కట్రం స్వామి, మండల అధ్యక్షుడు తేళ్ళ చెన్నయ్య, కీసరి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన డివిజన్ పంచాయతీ అధికారి

నవతెలంగాణ-అశ్వాపురం



మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో జరుగుతున్న వివిధ పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం భద్రాచలం డివిజనల్ పంచాయతీ అధికారి సుధీర్ కుమార్ తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ సెగ్రిగేషన్ షెడ్డులో తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, కంపోస్ట్ తయారీ, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయించడం, ఖాళీ స్థలాల యజమానులతో మాట్లాడి వారి స్థలాల్లో ఉన్న నిల్వ నీరుని జెసిబితో కచ్చా డ్రైన్లు తీయించారు. ఈ కార్యక్రమంలో ఎం పీఓ భూక్య శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి సగ్గుర్తి కృష్ణ చైతన్య గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ సర్కార్‌కి కార్మికులు తగిన బుద్ధి చెప్పాలని కార్మికుల చట్టాల రక్షణ కొరకు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల చట్టాల రక్షణ కొరకు సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా పట్టణంలో ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహించి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో డిటి సమ్మయ్యకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంబీ నర్సారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు బండారు శరత్ బాబు అధ్యక్షత వహించగా సిఐటియు పట్టణ నాయకులు ఎం.నాగరాజు, జీ. లక్ష్మీకాంత్, అజయ్ కుమార్, చంద్ర లీల, వరలక్ష్మి, లలిత, రమాదేవి, సురేంద్ర, సురేష్ సతీష్, శ్రీను, వాసు, బాలాజీ, ఆది, తోపాటు అంగనవాడి వీవో ఏ ఏరియా హాస్పిటల్ ఆటో హమాలి ఫ్రూట్స్ టెంపుల్ చిరు వ్యాపారుల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : ఆశావర్కర్లు కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని అదేవిధంగా పరీక్ష పెట్టే విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆశావర్కర్లతో కలసి నిరసన వ్యక్తం చేస్తూ తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మధుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీత, లక్ష్మి, నాగేంద్ర, నారాయణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జంగిలి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి : బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా సిఐటియు కేంద్ర కమిటీ పిలుపులో బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ పుల్లారావుకి డిమాండ్లతో కూడిన మెమొరండం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గంట శ్రీనివాసరావు, కొడుమే ఇందిరా, వర్క రుక్మధరావు, మేకల రమేష్, కే. లలిత, టీ. భారతి, కే. కుమారి, ఎం. పార్వతి, పీ. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చర్ల : కేంద్ర ప్రభుత్వ కార్మికవ్యతిరేక విధానాలపై కార్మికుల తిరుగుబాటుగా జూలై10న దేశవ్యాప్త కార్మికుల డిమాండ్స్ డేని జరపాలని సీఐటీయూ అఖిలభారత పిలుపు మేరకు మండలంలో కార్మికులు భారీప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల నాయకురాలు ఎం.విజయశీల అధ్యక్షతన జరిన దర్నాలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చారామారావు, సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి మాట్లాడారు. ఈ ధర్నాలో సీఐటీయూ మండల నాయకులు బాలాజి, స్వరూప, చంద్రకళ, నిరోషా, నాగమణి, రవి, అనురాధా, సుజాత, లక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు కార్మికులు సాధించుకున్న పోరాడి సంపాదించుకున్న హక్కులను కాపాడాలని సిఐటియు మండల కార్యదర్శి తాళ్లూరి కృష్ణ పిలుపునిచ్చారు. కార్మికుల కోరికల దినం పురస్కరించుకొని సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. హాజర సుల్తానా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘీభావంగా వచ్చిన ఐఎఫ్టియు జాతీయ నాయకులు సాధినేని వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంగన్వాడి హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు కే.మరియ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆలేటి కిరణ్, కేపీఎస్ నాయకులు మన్నెం మోహన్‌రావు, ఐద్వా జిల్లా నాయకురాలు సంధ్య, బిల్డింగ్ వర్కర్ జిల్లా సహాయ కార్యదర్శి కామ నాగరాజు, ఎం.యాకమ్మ, డి.సునీత, శ్రీను, చంద్రకళ, పాసి, వెంకటమ్మ, తిరుమల, ఐలమ్మ, రేణుక,ఎస్ శ్రీను, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ : కార్మిక వ్యతిరేక దుర్మార్గ చట్టాల్ని వెనక్కు తీసుకోవాలి.సిఐటియు పట్టణ కన్వీనర్ కే.సత్య అన్నారు. అంతర్జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా పాల్వంచ పట్టణంలో కార్మికులందరూ భారీ ర్యాలీ, సభ, ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పాల్వంచ పట్టణ కన్వీనర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు మొగిలి గుర్రం రాములు, రమ్య, అచ్చమ్మ, భాను, అచ్చి, శ్రీను, అరుణ, లక్ష్మి, నగేష్, శ్రీను, ఈ.రాములు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం : స్కీం వర్కర్లకు వేతనాలు పెంచాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రం నుండి టిడిపి సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ స్వర్ణకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మండేపూడి సాంబశివరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కరుణాకర్, మోకాళ్ళ రమేష్ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కళ్యాణి, అరుణ, విజయ ఆశ వర్కర్లు కిరణ్ కుమారి తిరుపతమ్మ పాల్గొన్నారు.

దమ్మపేట : ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు కేంద్ర రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించి కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు కొప్పుల శ్రీను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ రామకృష్ణ, సూరమ్మ, జ్యోతి, శాంతి, సునీత, రజిని, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించి కార్మిక హక్కులను కాపాడాలని నినాదాలు ఇస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.అనసూర్య, వ్యకాస మండల కార్యదర్శి భయ్యా రాము, ఎల్.పద్మ, ఎం.ఈశ్వరి, ఎం.పుల్లమ్మ, సులోచన, కనితి బాలమ్మ, సిలం లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి : ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, దీనిలో భాగంగా ముందుగా నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సీఐటీయూ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ విధానాలను నివారించి, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేయడం కోసం సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలో జూలై 10వ తేదీన ఆమె ఆధ్వర్యంలో కోరికల దినం పాటించారు. ముందుగా ఆళ్లపల్లిలోని బస్టాండ్ సెంటర్ నుండి తహసీల్ వరకు ర్యాలీ నిర్వహించి, ఆఫీస్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి వినతిపత్రాన్ని ఆఫీస్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఈసం వెంకటమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐటీయూ సంఘం ఆశా వర్కర్ల మండల కన్వీనర్, అంగన్వాడీ కార్యకర్తల మండల అధ్యక్షురాలు ఎస్.సుగుణ, కొమరం జయశ్రీ, సభ్యులు చంద్రకళ, సీతాదేవి, కావేరి, ఎమ్మార్ సుశీల, విజయ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ : ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్న పరీక్షలను రద్దుచేసి, కనీస వేతనాలు ఇవ్వాలంటూ ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు స్థానిక పీహెచ్‌సీ కార్యాలయం నుండి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఎల్.ప్రసన్నకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు రామదాసు వెంకటాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు రుక్మిణి, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పెద్దిని వేణు, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కోరికల దిన సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం నుండి ఎమ్మార్వో ఆఫీసుకు ర్యాలీ నిర్వహించి, ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ నాగభవాని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వీరన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుగుణ, సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలం రూరల్


అన్నపురెడ్డిపల్లి


చర్ల



ఇల్లందు


పాల్వంచ



అశ్వాపురం


దమ్మపేట


పాల్వంచ



టేకులపల్లి



చండ్రుగొండ


ఆళ్ళపల్లి


బూర్గంపాడు

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- అక్రమం సంబంధం....పథకం ప్రకారం హత్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రెహమాన్

నవతెలంగాణ-కొత్తగూడెం



అక్రమం సంబంధంకు అడ్డుగా ఉన్నాడని వ్యక్తిని హత్యచేసిన కేసును కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు చేధించారని, హత్యకేసు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రెహమాన్ తెలిపారు. బుధవారం రామవరం టూ టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హత్యకేసు వివరాలు డిఎస్పీ తెలిపారు. ఈనెల 6 వ తేదీన గౌతమ్ పూర్ గ్రామంలోని జరిగిన ఆటో డ్రైవర్ హత్య యత్నం కేసులో అతని భార్య ఫిర్యాదు దారులు సాహు చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేసి తర్వాత అయిన గాయపడిన వ్యక్తి సాహు ఈశ్వర్ కుమార్ కొత్తగూడెం ఆసుపత్రితకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఆరోగ్య హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో హత్య కేసుగా సెక్షన్ ఆల్టరేషన్ చేసి విచారణ చేపట్టి నిందితులైన నలుగురు అరెస్టు చేసినట్లు తెలిపారు. ఏ-1గా చుంచుపల్లి మండలం గౌతంపూర్ కాలనీ చెందిన అరికె రమేష్, ఏ-2,బట్టు చందు, ఏ-3, అరికె ఇందిర, ఏ-4 ఎండి. రెహనా అలియాస్ సాహు రెహానాలను మంగళవారం కొత్తగూడెం టూ టౌన్ సిఐ రమేష్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు బట్టల్ని స్వాధీన పరచుకోవడం జరిగిందన్నారు. నేరం జరిగిన విధానం నిందితుడైన అరిక రమేష్‌కు, రెహనాతో అక్రమ సంబంధం ఏర్పరచుకొని అక్రమ సంబంధానికి ఈశ్వర్ కుమార్ సాహూ అడ్డుస్తున్నాడని తను అక్రమంగా ఉంటున్న సింగరేణి క్వార్టర్‌ని సింగరేణి జిఎంకి ఫిర్యాదు చేసి ఇళ్ల ఖాళీ చేయించాడని కక్ష పెంచుకుని ఒక పథకం ప్రకారం చందు, రమేష్ భార్య ఇందిరాతో కలిసి కత్తులతో విచక్షణ రహితంగా ఈశ్వర్ కుమార్‌పై దాడి చేయడంతో అతను గాయాలపాలై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు.

యువకుల మధ్య 'మద్యం' వివాదం..

- కత్తితో దాడి..ఒకరికి తీవ్రగాయాలు..

నవతెలంగాణ-అశ్వారావుపేట



మద్యం విషయమై చోటు చేసుకున్న వివాదం కాస్తా కత్తితో దాడికి దారి తీసింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై శివరామకృష్ణ వివరాల ప్రకారం..మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన దామతోటి తిరుపతయ్య, ముళ్లగిరి కార్తీక్‌లు అనే యువకులు మద్యం విషయంలో గొడవ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన కార్తీక్ ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చి తిరుపతయ్యపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తిరుపతయ్యకు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికు తరలించారు. బాధితుడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దీనిపై బాధితుడి సమీప బంధువు దాసరి జగదీశ్వరి చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

● డాక్టర్ ప్రియాంక

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంక అన్నారు. గ్రామ శివారులో గల తంగేళ్ల గుంపులో మంగళవారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, మొత్తం 76 మందికి ఓపీ చూడగా వారిలో ఐదుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించామని, వారి నుండి రక్త పూతలు సేకరించి వారికి కావాలసిన మందులు పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ ఎస్తేర్ రాణి, హెచ్ఈఓ కృష్ణయ్య లక్ష్మి, జ్యోతి, కోటేశ్వరరావు, ఆశావర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లో రెడ్ కార్డు విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

● టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ,

సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసాన వీరభద్రం

నవతెలంగాణ-కొత్తగూడెం

ఎల్లో రెడ్ కార్డు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసాన వీరభద్రం సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెం టీబీజీకేఎస్ ఆఫీసులో బుధవారం వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశం వారు మాట్లాడుతూ కార్మికులు, కార్మిక సంఘాలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేస్తూ ఇబ్బందులలో ఉన్న కార్మిక వర్గానికి సపోర్టుగా నిలవవలసిన యాజమాన్యం ఈ సమయంలో ఇటువంటి ఉత్తర్వులు తీసుకొస్తూ ఇంకా ఇబ్బందికి గురి చేయాలని చూస్తున్న ప్రయత్నం వెంటనే మానుకోవాలన్నారు. కార్మికులు సూపర్ వైజర్స్ మీద క్రమశిక్షణ చర్యలు భాగంగా ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని వెంటనే విరమించుకోవాలి. ఈ విధానం వల్ల సింగరేణిలో పారిశ్రామిక అశాంతి ఏర్పడుతుందన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ కమిటీ మెంబర్స్ వాసికర్ల కిరణ్, కాగితపు విజయ్ కుమార్, ఫిట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ తిరుపతయ్య సూరజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆట పాట విధానంలో బోధన చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యార్థులకు ఆట పాట విధానంలో బోధన చేయాలని మోటివేషనల్ ట్రైనింగ్ క్లాస్ బాగీ శిరీష అన్నారు. స్థానిక న్యూ గొల్లగూడెం, కొత్తగూడెంలోని కిడ్స్ పార్క్ టాలెంట్ స్కూల్‌లో (మోటివేషనల్ ట్రైనర్) ప్రిప్రైమరీ విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాంటెండెంట్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 40 సంవత్సరాలు పని చేశానని, ఆ అనుభవం ఈ పాఠశాల నిర్వహణలో ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపల్ మౌనిప్రియ విద్యార్థులకు గాని, విద్యార్థుల తల్లిదండ్రులకు గాని, ఈ శిక్షణ చాలా ఉపయోగకరము అన్నారు. గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు ధర్మప్రియ ఎంతో చురుకుగా రైమ్స్‌ను పాడించగా ఆంగ్ల ఉపాధ్యాయురాలు పృథ్వీలత పిల్లలకు చాలా హుషారుగా నృత్యం చేయించారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ ఆర్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ మౌనిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు భరోసా చేయూత

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరులోని సింగరేణి పాఠశాలలో చదువుకుంటున్న ఓ నిరుపేద విద్యార్థినికి 'భరోసా స్వచ్ఛంద సంస్థ' ఆధ్వర్యంలో చేయూత అందించారు. స్థానిక సింగరేణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ సభ్యురాలు ఉప్పుతల నీల తన పుట్టినరోజు సందర్భంగా ఆ విద్యార్థిని చదువుకు అయ్యే ఒక సంవత్సరం ఫీజును అందచేశారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు ఎండీ అమీనుద్దీన్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యురాలు గొప్ప మనసు చాటుకొని ఓ పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించడం నిజంగా అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వరుణ్, తిరుపతి, స్కూల్ హెచ్ఎం శ్రీనువాస్, ఉపాధ్యాయులు వేణు, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి

నవతెలంగాణ-మణుగూరు

బొగ్గు బ్లాక్ లను సింగరేణికి కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో 5వ రోజు విజయవంతంగా నిరాహార దీక్ష కార్యక్రమం కొనసాగింది. బుధవారం దీక్షలో పాల్గొన్న వారికి వై.రాంగోపాల్ దండలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రామనర్సయ్య, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, గోలి గంగాధర్ రావు, పిట్ సెక్రటరీలు గుంపెన శ్రీనివాసరావు, కోడి రెక్కల శ్రీనివాస్, గుండు శరత్ పాల్గొన్నారు.

యువశక్తి నిర్వీర్యం చేస్తున్న పాలకులు

నవతెలంగాణ-కారేపల్లి

పాలకులు యువతకు ఉద్యోగ, ఉపాధీ చూపటంలో నిర్లక్ష్యం కారణంగానే యువత పెడద్రోవకు కారణమవుతుందని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్వీ రాకేష్ విమర్శించారు. బుధవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో పివైఎల్ జిల్లా అధ్యక్షులు జాటోత్ ప్రేమ్, ఖమ్మం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మంద సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ- బోనకల్

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్, తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ బుధవారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని పెద్దబీరవల్లి, రామాపురం బోనకల్ మోటమర్రి తదితర గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు ఈ కళ్యాణి లక్ష్మి చెక్కులను అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిర్దావర్ గుగులోతు, లక్ష్మణ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నవతెలంగాణ- కల్లూరు

కల్లూరు పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. ఆ మేరకు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి అందరితో పాటే ఉన్న బాలిక తెల్లవారేసరికి లేచి చూస్తే కనిపించలేదు. దీంతో బంధువులు, స్నేహితుల దగ్గర వెతికినా దొరకపోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎస్కే షాకీర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గంగారం సెంటర్లో 'మధుబాబు' జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం గంగారం గ్రామ అభివృద్ధి ప్రదాత, కాంగ్రెస్ యువ నాయకుడు దాసరి మధుమోహనరెడ్డి (మధుబాబు) జన్మదిన వేడుకలను బుధవారం రాత్రి గంగారం సెంటర్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. కేక్ కట్ చేశారు. బాణాసంచా పేల్చారు. మధుబాబు జన్మదిన వేడుకల సందర్భంగా ఉదయం గంగారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అక్కడి రోగులకు పాలు, పండ్లు రొట్టెలు, పంపిణీ చేశారు. మధుబాబు జన్మదిన వేడుకలను గంగారం గ్రామంలోని పలు కాలనీల్లో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మధుబాబు యూత్ బాధ్యులు కోలగట్ల చెన్నాకేశవరావు, ఊకే రమేష్ (కరాటే), కావేటి అప్పారావు, జల్లిపల్లి వాసు, కొండపల్లి మహేష్, బత్తుల నారాయణ, చిన్ని వెంకటేశ్వరరావు, కాలసాని నాగేశ్వరరావు, బండారు రమేష్, బత్తుల కోటయ్య, బండారు మహేష్, కోటమర్తి జవహర్ లాల్, బెజవాడ శ్రీనివాస్, కంచి శ్రీనివాస్, బండారు జగదీష్, యామాల భోగేశ్వరరావు, ముత్తాల అబ్బులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు ఫామ్ 16 వెంటనే ఇవ్వాలి : సీఐటీయూ

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు ఏరియా సింగరేణి కార్మికులకు ఫామ్ 16 వెంటనే ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో టీవీఎంవి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు అవుతున్న ఇంతవరకు ఫామ్ 16లను కార్మికులకు అందజేయలేదని అన్నారు. ఈ నెలాఖరులోగా కార్మికులు ఈ ఫైలింగ్ చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ విషయంలో యాజమాన్యం చాలా అలసత్వం వహిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో మాచారపు లక్ష్మారావు, రామ్మూర్తి, నందం ఈశ్వరరావు, లక్ష్మణరావు, విల్సన్ రాజు, ప్రభాకర్ రావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాంబాబు

నవతెలంగాణ-బోనకల్

పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ సమావేశం బుధవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 2022 నుంచి డిఎలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదే విధంగా పీఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే పిఆర్సి అమలు చేయాలని, బదిలీలు కోరుకొని రిలీవ్ కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల సమయాన్ని మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేసిన జీవో శాస్త్రీయంగా లేదన్నారు. నిపుణులు, మేధావులు, ఉపాధ్యాయ సంఘం నాయకుల అభిప్రాయాలు తీసుకొని పాఠశాల సమయాన్ని అందరికీ అనువుగా ఉండేటట్లు మార్చాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలల్లో స్కావెంజర్ల లేక పాఠశాల పరిశుభ్రత కొరవడుతుందని, వెంటనే స్కావెంజర్లను నియమించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. గత ప్రభుత్వ హాయంలో అనేక ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదని, ఈ ప్రజా ప్రభుత్వమైనా వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యా రంగ సమస్యలు పరిష్కారం కాకుండా విద్యావ్యవస్థ అభివద్ధి సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగానికి అధిక ప్రాధా న్యత ఇస్తూ, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు భూపతి ప్రీతం, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ జిల్లా నాయకులు సద్దా బాబు మండల ఉపాధ్యక్షులు పి గోపాల్ రావు, కోశాధికారి కంభం రమేష్ మండల కమిటీ సభ్యులు చిన్న రంగారావు పీ.పుల్లారావ్ ఎం నారాయణ, జి.శ్రీనివాసరావు, పిల్లలమర్రి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కామేపల్లి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తాసిల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బాదావతు శ్రీనివాస్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సిఐటియు మండల కార్యదర్శి జయమ్మ మాట్లాడుతూ.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి బిల్లులు పెరిగిన ధరలకు అణుగుణంగా పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సుధాకర్‌కు అందజేశారు. తమ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎంట్రీ..ఎగ్జిట్‌కు ఎన్‌హెచ్ఏ గ్రీన్‌సిగ్నల్

● రూ.70 కోట్లతో రహదారి నిర్మాణం
● ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో సౌకర్యం
● రెండు డిజైన్లు సిద్ధం చేయాలని ఆదేశాలు
● మంత్రి తుమ్మలను సన్మానించిన నగరవాసులు
● ఎంట్రీ సౌకర్యం కోసం 'నవతెలంగాణ' కథనాలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఖమ్మం- దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే (ఎన్‌హెచ్ 365బీజీ) జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో మరో పురోగతి చోటుచేసుకుంది. ఖమ్మం నగరం, జిల్లా ప్రజలకు బోనకల్ రోడ్డులో ధంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రాకపోకలు నేరుగా ఉండేందుకు వీలుగా ఎంట్రీ, ఎగ్జిట్ సౌకర్యాన్ని కల్పించాలని స్థానికులు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. కానీ నేషనల్ హైవే అథారిటీ అధికారులు నిరాకరించడంతో పనులు నిలిపివేసి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీనిపై 'నవతెలంగాణ'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ విషయాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నేషనల్ హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సీఎంతో హైదరాబాద్‌లో మంగళవారం నేషనల్ హైవే అథారిటీ అధికారులు సమావేశమయ్యారు. మంత్రుల చొరవతో జిల్లా నుంచి కూడా నేషనల్ హైవే అధికారులు వెళ్లి ధంసలాపురం ఎగ్జిట్ ఆవశ్యకతను వివరించారు.

భూసేకరణ వ్యయం రాష్ట్రం..రోడ్డు నిర్మాణం ఎన్‌హెచ్..

భూసేకరణ వ్యయాన్ని రాష్ట్రప్రభుత్వం భరించేలా...రోడ్డు నిర్మాణ బాధ్యతను ఎన్‌హెచ్ఏ చేపట్టేలా అంగీకారం కుదిరింది. రూ.70 కోట్లతో ధంసలాపురం వద్ద బోనకల్ రహదారితో పాటు దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌ను అనుసంధానం చేస్తూ నిర్మాణం చేపడుతారు. రెండు డిజైన్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. హైవేకు సమాంతరంగా రహదారి నిర్మించడం లేదా మలుపులతో కూడిన రహదారి నిర్మించి ఎగ్జిట్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదించారు. రెండింటిలో ఏది తక్కువ ఖర్చుతో సౌలభ్యంగా ఉంటే దానిని చేపడుతారు. ధంసలాపురం వద్ద ఎగ్జిట్ మంజూరైందని, ఖమ్మం-బోనకల్ మీదుగా విజయవాడ, మధిరలకు వెళ్లే వారికి సౌకర్యవంతంగా ఉండనుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల అనుసంధానంతో నేషనల్ హైవేతో రింగురోడ్డు నగరానికి నలువైపులా రానుందని అన్నారు. ఖమ్మం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కోదాడ, ఖమ్మం-కురవి, అమరావతి-నాగపూర్ రహదారులతో రాకపోకలు సాగుతాయని వివరించారు.

సీఎంతో వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గన్నారు. హైవేలు, ఇతరత్ర రోడ్లకు సంబంధించి పలు ప్రతిపాదనలు చేశారు. ఖమ్మం టూ దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ కోసం విన్నవించారు. ఖమ్మం టూ అశ్వారావుపేట రహదారి జాతీయ రహదారుల ప్రాధికారసంస్థ పరిధిలో ఉన్న నేపథ్యంలో మరమ్మతులు చేయలేకపోతున్నామని, దీనిని రాష్ట్రానికి బదలాయించాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి నుంచి కొత్తగూడెం వయా వలిగొండ, తొర్రూర్, మహబూబాబాద్ మీదుగా మంజూరైన జాతీయ రహదారికి తొర్రూర్ వరకే టెండర్ పూర్తయిందని, తొర్రూరు నుంచి కొత్తగూడెం వరకు తక్షణం టెండర్ పిలవాలని కోరారు. జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వయా బోనకల్, వైరా, తల్లాడ మీదుగా జాతీయ రహదారి మంజూరు చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

మంత్రి తుమ్మలకు సన్మానం...

ఖమ్మం నుంచి దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే (ఎన్‌హెచ్ 365 బీజీ)కు ధంసలాపురం వద్ద ఎంట్రీ-ఎగ్జిట్ మంజూరు కావడంపై స్థానికులు హర్షం వెలిబుచ్చారు. ఇందుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. చింతకాని మండలంతో పాటు రామకృష్ణాపురం, గాంధీనగర్, ఖమ్మం ధంసలాపురం, శ్రీరాంహిల్స్, అగ్రహారం ప్రాంతవాసులు 16, 17, 18, 19 డివిజన్ల వాసులు మంత్రి తుమ్మలను కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం, ఎన్‌హెచ్ పనులు శరవేగంగా సాగేందుకు కృషి చేస్తున్న తుమ్మలకు అభినందనలు తెలిపారు. మంత్రిని సన్మానించిన వారిలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, మేడారపు వెంకటేశ్వర్లు, మదూరి ప్రసాద్, ఆళ్ల శిరీష అంజిరెడ్డి, మందడపు లక్ష్మీమనోహర్, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, మందడపు మనోహర్, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి, మందడపు రామకృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, తుపాకుల ఎలగొండస్వామి, శ్రీను, పిట్టల బ్రహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులకు రక్షణ కల్పించాలి

నవతెలంగాణ-కారేపల్లి

కార్మికుల హక్కులకు రక్షణ కల్పించాలని, వెట్టి నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులు బుధవారం కారేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అందోళన నిర్వహించారు. కార్మికుల కొర్కెల దినం సందర్భంగా 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వం రంగ సంస్థలు సంరక్షించాలని, ఆసంఘటిత రంగ కార్మికులకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సామినేని నర్సింహరావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు కన్వీనర్ కే.నరేంద్ర, ఎస్‌కె.హుస్సెన్, బోళ్ల కొమరయ్య, ఎం.స్వరూపరాణి, అజ్మీర సుక్యా, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పంచాయతీ సిబ్బంది ధర్నా

నవతెలంగాణ-ఖమ్మం

పల్లెలు శుభ్రంగా ఉంచే గ్రామ పంచాయితీ సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం అలసత్వం పట్ల ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు, మల్టీ పర్పస్ విధానం రద్దు, కనీస వేతనాలు అమలు తదితర అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాదె లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు, ఏఐటియుసి ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, ఏఐటియుసి గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య ప్రసంగించారు.



కార్మికుల పట్ల కాంగ్రెస్ వైఖరి తెలియపరచాలి

● తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ ధర్నా

నవతెలంగాణ-మణుగూరు

కార్మికుల పట్ల కాంగ్రెస్ పార్టీ నిజమైన వైఖరి తెలియపరచాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సీఐటీయూ సీనియర్ సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోరికలు దినోత్సవాన్ని పాటించారు. సీఐటీయూ అనుబంధ సంఘాలతో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు రెండు దొందు దొందే అని అన్నారు. గద్దెనెక్కే ముందు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు పట్టించుకున్న పాపాన పోవటం లేదన్నారు. అంగన్వాడీ, మధ్యాహ్నం భోజన వర్కర్లు, గ్రామపంచాయతీలు, ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ వర్కర్లు, వీఓఏలు, హమాలీ వర్కర్లు మున్సిపాలిటీ వర్కర్లచే వెట్టి చాకిరీ చేస్తున్నాయని అన్నారు. కనీస వేతనాలు అందడం లేదన్నారు. ముందుగా స్థానిక శ్రామిక భవనం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు హేమలత, వివిధ రంగాల సంఘటిత, అసంఘటితరంగా కార్మికులు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నాయకులు. టీవీ ఎంవి ప్రసాద్, వల్లూరు వెంకటరత్నం, మాచారపు లక్ష్మణరావు, రంగ శ్యామల, మున్సిపాలిటీ నాగేశ్వరరావు, దుర్గారావు, అంగన్వాడీ నాయకురాలు శ్యామల మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మున్నేరుపై అంతర్ జిల్లాల బ్రిడ్జి ప్రారంభం

పాలేరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

పాలేరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రెవెన్యూ, గహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అజ్మీర్ తండా నుండి చిలకలపాడు పోయేందుకు మున్నేరుపై సుమారు 11 కోట్ల వ్యయంతో నిర్మించిన అంతర్ జిల్లాల బ్రిడ్జిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ బ్రిడ్జి వల్ల అంతర్ జిల్లాల ప్రయాణ సౌకర్యంతో పాటు రైతన్నకు అన్ని విధాలా ఉపయోగపడుతుందని అన్నారు. అతి త్వరలో సీతారామ ప్రాజెక్టు కాలును పూర్తి చేస్తామన్నారు. పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామల చేసేందుకు 2500 ఎకరాల్లో 12 టీఎంసీల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్ని నిర్మించబోతున్నారని అన్నారు. అనంతరం మండల పరిధిలోని అజ్మీర తండాలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, ఎంపీపీ మంగీలాల్, మండల నాయకులు తాటికొండ కిరణ్, కోట్ల కిరణ్, రాంరెడ్డి, జడల నగేష్, మండల యూత్ నాయకులు దూదిమెట్ల వెంకట్, మహేష్, పిడమర్తి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల ప్రయివేటీకరణపై

భగ్గుమన్న శ్రామిక సంఘాలు

● వేలం ప్రక్రియను నిలిపివేయకుంటే కోల్ బెల్ట్ ప్రాంతాలను స్తంభింపచేస్తాం
● సింగరేణి సంస్థ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలు కలిసి రావాలి
● సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.వీరన్న, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం



వేలం ప్రక్రియను నిలిపివేయకుంటే కోల్ బెల్ట్ ప్రాంతాలను స్తంభింప చేస్తామని, సింగరేణి సంస్థ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలు కలిసి రావాలని ఏఐటీయూసీ సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.వీరన్న, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ కే సాబీర్ పాషాలు స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన సింగరేణి హెడ్డాఫీసు ధర్నా హెూరెత్తింది. ప్రయివేటీకరణను నిరసిస్తూ కార్మిక సంఘాలు, విపక్ష పార్టీలు నిర్వహిస్తున్న దశలవారీ ఆందోళరన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కేంద్ర నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణ నిర్ణయం తెలంగాణలోని సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. బొగ్గు ఉత్పత్తిలో వందేళ్లకుపైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకులను కేటాయించాల్సిన కేంద్రం అదానీ, అంబానీ లాంటి మిత్రులతో కుమ్మక్కై జాతీయ సంపదను దోచిపెట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణలోని బగ్గు గనులు ప్రైవేటీకరిస్తే సింగరేణి ప్రాంతాలకు మనుగడ ఉండదని, కార్మికుల హక్కులు హరించుకుపోవడంతోపాటు తొలగింపు ప్రక్రియను వేగవంతం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ లేని తెలంగాణను చూడలేమని, సింగరేణి కార్మికుల ఉద్యమం వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రము ఏర్పాటైందని అలాంటి సింగరేణిని లేకుండా చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. భేషరతుగా సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకులను అప్పగించాలని లేనిపక్షంలో కోల్ బెల్ట్ ప్రాంతాలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు విజయగిరి శ్రీనివాస్, వై. వెంకటేశ్వర్లు, గాజుల రాజారావు, సూరం అయిలయ్య, కూరపాటి సమ్మయ్య, అన్సారీ పాష, రమణ, ప్రభాకర్, సక్రం, కిషన్, ఏఐటియూసీ కార్మిక సంఘాల నాయకులు నరాటి ప్రసాద్, దమ్మాలపాటి శేషయ్య, వంగ వెంకట్, రమణమూర్తి, కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి, జె.గట్టయ్య, కిష్టాఫర్, పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి



కొత్తగూడెం

● సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న

నవతెలంగాణ-కొత్తగూడెం

దేశ వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కార్మికుల కోర్కెల దినం (డిమాండ్స్ డే) సందర్భంగా కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల ఆస్తులను ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ దేశాన్ని లూటీ చేస్తుందని విమర్శించారు. స్వాతంత్ర్యం కంటే పూర్వమే బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను 8 గంటల పని దినాన్ని కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మిక వర్గాన్ని రోడ్డున పడేసే విధంగా బీజేపీ నరేంద్ర మోడీ విధానాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి జి.రాజారావు మున్సిపల్ నాయకురాలు అంబాల దుర్గమ్మ, అంగన్వాడీ నాయకురాలు కళావతి, శైలజ, రత్నకుమారి, జుబేదా, సునీత తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

దుమ్ముగూడెం : కేంద్రంలోని బీజేపీ విధానాలను నివారించి కార్మిక హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేయడం కోసం సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు



దుమ్ముగూడెం :

జూలై 10న కోరికల దినం పాటిస్తున్నట్లు జిల్లా నాయకులు కొలగాని రమేష్ అన్నారు. బుధవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించే సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ పి.చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు నాయకురాలు కమలదేవి, గజలక్ష్మి క్రిష్ణ వేణి, లక్ష్మి, ఆశా వర్కర్ చిన్నక్క, నర్సు, తిరుమల బిల్డింగ్ వర్కర్స్ రమేష్ కార్మికులు సుస్మిత, సమ్మక్క, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- తండ్రి, ముగ్గురు పిల్లలను కాపాడిన స్థానికులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ఓ కారు చెరువులోకి దూసుకెళ్లగా.. స్థానికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ముగ్గురు పిల్లలు, తండ్రిని స్థానికులు తాడు, ట్యూబ్ సాయంతో బయటకు తీసుకొచ్చి ప్రాణాలను కాపాడారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామపంచాయతీ పరిధిలోని బైరాన్‌కాన్ చెరువులో బుధవారం జరిగింది. సీఐ అంజిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం బీఎస్.రెడ్డికి చెందిన అశోక్ తన ముగ్గురు పిల్లలతో కలిసి కారులో ఇనాంగూడ చెరువు వైపు వస్తుండగా వాహనం చెరువులోకి దూసుకెళ్లింది. ఆ ప్రాంతానికి దగ్గరలో తాటి చెట్టు పై ఉన్న కల్లు గీత కార్మికుడు పాండుగౌడ్ గమనించి.. వెంటనే అతని కుమారుడికి సమాచారం ఇచ్చాడు. అతను తాడు, ట్యూబ్‌ను తీసుకురాగా చెరువులోకి దూకి.. స్థానికుల సహకారంతో ముగ్గురు పిల్లలు, తండ్రిని సురక్షితంగా బయటకు తీశారు. కొద్దిపాటి ఆలస్యమైనా పెను ప్రమాదం జరిగేది. ఈ ఘటనకు సంబంధించిన కేసును మీర్‌పేట పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసినట్టు సీఐ అంజిరెడ్డి తెలిపారు.

శభాష్ గౌడన్న..

కారు చెరువులోకి దూసుకెళ్లగా ప్రాణాలను తెగించి వారిని కాపాడిన స్థానిక గీత కార్మికులు పాండు గౌడ్, అతని కుమారుడు సాయి కుమార్ గౌడ్‌ను పలువురు ప్రశంసించారు. స్థానికుల నుంచి, సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి అభినందనలు వస్తున్నాయి. శభాష్ గౌడన్న అంటూ పోస్టులు వైరలవుతున్నాయి. అయితే ఆర్థిక సమస్యలతో అశోక్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

పెయిడ్ ఆర్టిస్టులతో ధర్నాలు చేయిస్తారా?

- ఉద్యోగం కోసం వారు దరఖాస్తు కూడా చేయలేదు : బీఆర్ఎస్ నేతలపై ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలు పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం ఫైరయ్యారు. ధర్నాలు చేస్తున్న వారిలో కొంత మంది ఉద్యోగం కోసం కూడా దరఖాస్తు చేయలేదని ఆరోపించారు. ఇలాగే చేస్తే బట్టలూడదీసి ఉరికేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తన పదవి, రాజకీయం వదిలి మీ ముందుకు వస్తానని సవాల్ విసిరారు. 'బరిగే పడతాం, మీ ముందుకు వస్తాం. దొర దగ్గరే ఉండాలా? ఉద్యోగాలు రావద్దా? ఉద్యోగాలు వస్తున్నాయి అంటే మీకు కడుపులో మంట' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఆపార్టీ నేతలు గాదరి కిశోర్, బాల్క సుమన్ పరుష పదజాలంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. తాము బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెట్టారని విమర్శించారు. గత పదేండ్లలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు వేయలేదని నిలదీశారు. ఇప్పుడు తాము నోటిఫికేషన్ వేస్తే బీఆర్ఎస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఫైరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డిపై పరుషంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ సిగ్గు లేకుండా దళితులను ముందు పెట్టి మాట్లాడిస్తున్నారని తెలిపారు. ఆయన ఎంగిలి మెతుకుల కోసం కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులపై మాట్లాడటానికి బీఆర్ఎస్‌కు నైతిక అర్హత లేదని చెప్పారు.

ఏనుగును పంపేందుకు కర్నాటక అటవీశాఖ అంగీకారం

- ఫలించిన మంత్రి కొండా సురేఖ ప్రయత్నాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బోనాల ఉత్సవాల్లో అమ్మవారి అంబారీ ఊరేగింపు, మొహర్రం పండుగ(బీబీ కా ఆలం అంబారీ ఊరేగింపు) నిమిత్తం రూపవతి(ఏనుగు)ని తెలంగాణకు పంపేందుకు కర్నాటక అటవీశాఖ అంగీకారం తెలిపింది. కర్నాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో మంత్రి కొండా సురేఖ పలుమార్లు చర్చించారు. ఏనుగు తరలింపునకు ఆమోదం తెలిపేలా చర్యలు చేపట్టారు. దీంతో కర్నాటక దావణగెరెలోని పాంచాచార్య మందిర ట్రస్టు నుంచి ఏనుగు తీసుకొచ్చేందుకు మార్గం సుగమమైంది. అటవీ చట్టాల అనుసరించి ఏనుగు తరలింపులో పాటించాల్సిన జాగ్రత్తలు, పర్యవేక్షణ తదితర అన్ని రకాల మార్గదర్శకాలను అనుసరించి ఏనుగును రాష్ట్రానికి తీసుకురానున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు. ఏనుగు రాష్ట్రానికి చేరుకున్న తర్వాత పోషణ, విశ్రాంతి తదితర అంశాలకు సంబంధించి అటవీ చట్టాల మార్గదర్శకాలను పాటించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాసులు



- చిన్నారులకు యూనిఫామ్‌లిస్తాం
- అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక డ్రైవ్
- ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు
- పౌష్టికాహార తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం
- అధికారులు వారానికో సెంటర్‌ను సందర్శించాలి
- నాసిరకం వస్తువులు సరఫరా చేస్తే కఠిన చర్యలు : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాసులను ప్రారంభించబోతున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆ కేంద్రాలకు వచ్చే పిల్లలకు యూనిఫారాలు అందజేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి వారంపాటు అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. పౌష్టికాహార తెలంగాణే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతా ధికారులతో కలిసి జిల్లా సంక్షేమ అధికారులు, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా భద్రత, దత్తత, చైల్డ్ కేర్ వంటి అంశాలపై చర్చించారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని సీతక్క సచివాలయంలో ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీతక్క మాట్లాడుతూ..పిల్లలకు తొలి ఒడి అమ్మ అయితే మలిఒడి అంగన్‌వాడీ కేంద్రాలేనని చెప్పారు. కేంద్రాల్లో ఇస్తున్న సరుకులు, సేవల నాణ్యతను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాసిరకం కోడిగుడ్లు, పాల ప్యాకెట్ల సరఫరా కట్టడి విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలనీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వారానికో ప్రాంతంలో పర్యటించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. పేద పిల్లలకు పౌష్టికాహారం, విద్య, భద్రత అందేలా చూడాలన్నారు. అమ్మ స్థానంలో ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది..పిల్లలకు అమ్మ ప్రేమను పంచేలా చూడాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ అంగన్‌వాడీ కేంద్రాలు నిలవాలని ఆకాంక్షించారు. కేంద్రాలకు పెయింటింగ్ పనులు పూర్తిచేయించాలని ఆదేశించారు. చాటు మాటుగా దత్తత తీసుకుని ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పిల్లలను త్వరితగతిన దత్తత తీసుకునేలా సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చేరే విధంగా ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మహిళలపైనా, చిన్నారులపైనా దాడులు, అఘాయిత్యాలు జరిగితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యునిసెఫ్ సౌజన్యంతో రూపొందించిన న్యూట్రిషియన్ ఛాంపియన్ పుస్తకాన్ని, న్యూట్రిషియన్ కిట్లను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

తెలంగాణలో ఉన్నామా? సమైక్య రాష్ట్రంలోనా?

- బాల్క సుమన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అన్ని వర్గాలను దగా చేసే పాలనగా మారిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు.బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసుల దాడి చూస్తుంటే తెలంగాణలో ఉన్నామా? సమైక్య రాష్ట్రంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతుందని తెలిపారు. కడప వెళ్లి షర్మిల కోసం ఊరూరా తిరుగుతా అంటూ సీఎం రేవంత్ సమైక్యవాదుల కోసం తాపత్రాయపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో కలుషిత ఆహారం సమస్యలు, యూనివర్సిటీల్లో నియామకాల్లేక సిబ్బంది కొరత, దళిత ఎస్సై ఆత్మహత్య, ఎస్సీ, బీసీ మంత్రులకు అడుగడుగునా అవమానాలతో కాంగ్రెస్ పాలనలో సామాజిక న్యాయం కొరవడిందని దుయ్యబట్టారు. కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల్లోనే సామాజిక న్యాయమంటున్నారే తప్ప చేతల్లో లేదని ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు పోలీసుల చేతిలో అవమానాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా తనకొచ్చిన అవకాశాన్ని మంచి చేయడానికి ఉపయోగించుకోవాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు

- శాంతి భద్రతల అదనపు డీజీగా మహేశ్ భగవత్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకట్రెండ్రోజుల్లో మరికొంత మంది నాన్‌క్యాడర్ ఎస్పీలను బదిలీ చేయటానికి రంగం సిద్ధం చేసింది. ఐపీఎస్‌ల బదిలీలు ఈ విధంగా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత పోస్టింగ్	కొత్త పోస్టింగ్
మహేశ్ భగవత్	అదనపు డీజీ రైల్వే పోలీస్	అదనపు డీజీ రాష్ట్ర శాంతి భద్రతలు
సంజయ్ కుమార్ జైన్	అదనపు డీజీ రాష్ట్ర శాంతి భద్రతలు	అదనపు డీజీ టీజీఎస్పీ
స్వాతి లక్రా	అదనపు డీజీ టీజీఎస్పీ	అదనపు డీజీ ఆర్గనైజేషన్స్, హోంగార్డ్స్
స్టీఫెన్ రవీంద్ర	అదనపు డీజీ	అదనపు డీజీ గ్రేహౌండ్స్, ఆక్టోపస్
విజయ్ కుమార్	అదనపు డీజీ, గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్	అదనపు డీజీ పర్సనల్, ఫోర్స్ అండ్ వెల్ఫేర్
చంద్రశేఖర్ రెడ్డి	ఐజీ పర్సనల్	ఐజీ మల్టీజోన్-1
సత్యనారాయణ	ఐజీ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్	ఐజీ మల్టీజోన్-2
సుధీర్‌బాబు	ఐజీ మల్టీజోన్	కమిషనర్, రాచకొండ
తరుణ్‌జోషి	కమిషనర్ రాచకొండ	డైరెక్టర్, ఏసీబీ
కె. రమేశ్ నాయుడు	వెయిటింగ్	ఐజీ రైల్వే
రక్షిత కె.మూర్తి	ఎస్పీ వనపర్తి	డీసీపీ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్
డి. ఉదయ్ కుమార్‌రెడ్డి	డీసీపీ, సౌత్‌వెస్ట్ జోన్	ఎస్పీ, మెదక్
బి.బాలస్వామి	ఎస్పీ, మెదక్	డీసీపీ, ఈస్ట్‌జోన్ సిటీ
ఆర్. గిరిధర్	డీసీపీ, ఈస్ట్‌జోన్	ఎస్పీ వనపర్తి
జి.చంద్రమోహన్	డీసీపీ, టాస్క్‌ఫోర్స్	డీసీపీ, సౌత్‌వెస్ట్ సిటీ

డీసెట్‌కు 85.96 శాతం హాజరు

- రెండువారాల్లో ఫలితాలు
- కన్వీనర్ శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డీసెట్‌కు 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 15,150 (85.96 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. తెలుగు మాధ్యమంకు 9,698 మంది దరఖాస్తు చేస్తే, 8,189 (84.44 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. ఇంగ్లీష్, ఉర్దూ మీడియంకు 7,957 మంది దరఖాస్తు చేయగా, 6,961 (87.48 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఈనెల 15న ప్రాథమిక కీని www.deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా విడుదల చేస్తామని తెలిపారు. రెండు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి, వినతిపత్రాలు అందజేశారు.

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేయకముందే మతోన్మాద - కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు బీజేపీ రంగంలోకి దిగిందన్నారు. కార్మికుల ఈపీఎఫ్ బకాయిల చెల్లింపులో యాజమాన్యా లకు విధించే జరిమానాలను భారీగా తగ్గించిందని తెలిపారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మేయడం, ప్రయివేటీకరణ చేయడం లాంటివి మరింత వేగవంతం చేస్తామని ప్రకటించిందన్నారు. అందులో భాగంగానే మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను బహిరంగ వేలం వేస్తున్నారని తెలిపారు. అయితే, కార్మికులకు కనీస వేతనం రూ.26,000, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అత్యధిక పెన్షన్ చెల్లింపు, ఓపీఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై మాత్రం కేంద్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు

పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యోగ, కార్మికులకు అనేక హామీలిచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన హామీల గురించి ఊసే లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలు, ఐటీ అధిపతులు, ఫార్మా యాజమాన్యాలతో పాటు మధ్యతరగతి పరిశ్రమల యజమానులు, కాంట్రాక్టర్లతో అనేకసార్లు సమావేశాలు జరిపారు కానీ రాష్ట్ర కార్మిక సంఘాలకు కనీసం అపాయింట్‌మెంట్స్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. కార్మిక సంఘాలతో సీఎం సమావేశమై కార్మిక సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బీజేపీ బాటలో పయనిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గుతోందని అన్నారు. ఇటీవల 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కొత్త జీఓలను విడుదల చేసింది కానీ ఆ జీఓలలో ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదన్నారు. కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, అందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, భూపాల్, జె.మల్లికార్జున్, ఎస్.రమ, పి.జయలక్ష్మి, కె.ఈశ్వర్‌రావు, వి.ఎస్.రావు, టి.వీరారెడ్డి, కళ్యాణం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, ఎ.ముత్యంరావు, బి.మధు, బీరం మల్లేష్, ఎ.జె. రమేష్, ఎం.వెంకటేష్, కె.గోపాలస్వామి, రాగుల రమేష్, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో..

నల్లగొండ జిల్లా కేంద్రంలోని భాస్కర్ టాకీస్ అడ్డా ప్రదేశంలో కార్మికులు, ఐసీడీఎస్ ఆఫీసు ఎదుట అంగన్వాడీలు నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ బాసిత్‌కు వినతిపత్రం అందజేశారు. మునుగోడు మండలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల జెండాతో కార్మికులు నిరసన తెలిపారు. తిప్పర్తి మండలంలో కార్మికులు మార్కెట్ యార్డ్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా, అనంతరం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్, ఇతర రంగాల కార్మికులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మెదక్, సిద్దిపేట పట్టణాల్లో ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించారు.


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశాలు, వివిధ రంగాల కార్మికులు కలెక్టరేట్, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో మున్సిపల్ టౌన్ హాల్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మున్సిపల్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏఎల్ఓ లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గద్వాల జిల్లాలోని ధరూర్ మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



ఖమ్మం కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, అక్రమ ప్రమోషన్లు నిలుపుదల చేయాలని, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరుతూ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గేటు ముందు బైఠాయించి కమిషనర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. అనంతరం ఆందోళన వద్దకు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ వచ్చి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఏన్కూర్ పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో సీఐటీయూ నాయకులు శ్రామిక భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాల్వంచలో కార్మికులు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కుమురంభీం ఆసిఫాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.



కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున కార్మికులు ధర్నా చేశారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. హుజూరాబాద్ పట్టణంలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ధర్నా చేశారు. ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోనూ ధర్నాలు జరిగాయి.

గన్నీ బ్యాగుల ధరలపై సమీక్షలేవి?

ఏడేండ్లలో రైతులకు రూ. 40కోట్ల మేర నష్టం

- జీవో 396 అమలు చేయాలని డిమాండ్
- మూడు గోదాముల్లో మూలుగుతున్న 5 లక్షల గన్నీ సంచులు
- మార్కెట్ ఆదాయానికి భారీగా గండి





నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కి తమ మిర్చి, పత్తి పంటలను తెచ్చిన రైతులకు గన్నీ సంచులకు ఆ పంటలు కొనుగోలు చేసిన వ్యాపారులు మార్కెట్ చార్జీల కింద డబ్బులు చెల్లిస్తారు. సదరు చెల్లింపులు రెండేండ్లకు ఒకసారి జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మెన్, జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశమై చార్జీలను సమీక్షించి పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త ధరలు నిర్ణయించి అమలు చేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులు జీవో 396తో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ-2 ప్రస్తుతం మార్కెట్‌లో రైతుల గన్నీ సంచులకు వ్యాపారులు రూ.30 చెల్లిస్తున్నారు. ఇది ఆనాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న దయానంద్ 04-07-2017న జరిగిన సమావేశంలో నిర్ణయించి ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే చెల్లిస్తున్నారు. ఇందులో పాడైన పేరుతో కొన్ని సంచులకు వ్యాపారులు డబ్బులు ఇవ్వడం లేదు. అంటే ఏడేండ్ల నుంచి రైతుల గన్నీ సంచులకు చెల్లించవలసిన చార్జీలను సమీక్షించి ధరలను పెంచలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల జీవో నెంబర్ 396 ప్రకారం చార్జీలను 2019-2021, 2023లలో సమీక్షించి నిర్ణయించినట్లయితే రైతులకు ఇప్పుడు గన్నీ సంచికి రూ. 60 వచ్చి ఉండేది. దాంతో రైతులు సుమారు రూ.35 నుంచి 40 కోట్ల మేర నష్టపోయినట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా రైతులకు రావలసిన చార్జీలను సమీక్షించి గన్నీ సంచుల ధరలను పెంచాలని రైతులు కోరుతున్నారు.

మూడు గోదాముల్లో మూలుగుతున్న 5లక్షల గన్నీలు

2012-2013 సీజన్‌కు సంబంధించి 21 లక్షలా 31వేల పైచిలుకు గన్నీ బ్యాగులను సీసీఐ కొనుగోలు చేసింది. ఇందులో 5 లక్షలా 31వేల పైచిలుకు బ్యాగులు ఏనుమాముల మార్కెట్‌లోని మూడు గోదాముల్లో ఉంచినట్టు వారు తెలిపారు. మార్కెట్లోని మూడు గోదాముల్లో గన్నీ బ్యాగులు నిల్వ ఉంచడం వల్ల మార్కెట్ ఆదాయానికి భారీ ఎత్తున గండిపడుతుందని తెలంగాణ రైతు సంఘం అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

వ్యాపారులతో మార్కెట్ అధికారుల కుమ్మక్కు

2015 ఆగస్టులో నాటి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ 10,19,550 గన్నీ బ్యాగులకు టెండర్ పెట్టగా వ్యాపారులు సిండికేట్‌గా మారి బ్యాగుకు రూ.7.50 వరకు పాట పాడారు. మళ్లీ టెండర్ నిర్వహించినా వ్యాపారులు మరోసారి సిండికేట్‌గా మారి రూ.7.30కు పాడారు. దాంతో కలెక్టర్ జీవన్ పటేల్ జోక్యం చేసుకొని రైతుల గన్నీ బ్యాగుకు వ్యాపారులు రూ.

15 చెల్లించాలని ఆదేశించారు. ఇదే విషయంపై 2023లో నాటి జిల్లా కలెక్టర్ గోపి నిర్వహించిన సమావేశంలో వ్యాపారులు రైతుల గన్నీ బ్యాగుకు రూ. 25 ఇవ్వాలని నిర్ణయించారు. 2015 నాటికి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని 15 మిల్లుల్లో 9,72,448 గన్నీ బ్యాగులు ఉన్నాయని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్కెట్‌లో రైతుల గన్నీ సంచులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. 30ను రూ. 60కు పెంచి ప్రతి బస్తాకు చెల్లింపులు చేసే విధంగా తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.


గోదాముల కిరాయి రైతు సంక్షేమానికి ఖర్చు చేయాలి



- మోర్తాల చందర్ రావు, రైతు సంఘం నాయకులు

ఏనుమాముల మార్కెట్‌లో 12 ఏండ్ల నుంచి మూడు గోదాముల్లో నిల్వ ఉన్న గన్నీ బ్యాగులను కోర్టు అనుమతితో ఓపెన్ చేసి అందులో ఉన్న సంచులను అమ్మి ఆ డబ్బును కోర్టులో డిపాజిట్ చేయాలి. గోదాముల కిరాయి మార్కెట్ కమిటీ కోల్పోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ అధికారుల జీతాల నుంచి కానీ, సీసీఐ నుంచి కానీ వసూలు చేసి మార్కెట్‌కు సమర్పించాలి. అలా వచ్చిన ఆదాయాన్ని రైతు సంక్షేమానికి ఖర్చు చేయాలి. కొనుగోలుదారులు రైతులకు ప్రతి బస్తాకు రూ. 60 చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటాం



- గుగులోతు రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి

రైతుల గన్నీ బ్యాగుల చార్జీల చెల్లింపుల విషయం ఇటీవలే రైతు సంఘం నేతలు నా దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తాం.

తేనెతో ఇలా...

తేనెలో ఔషధ గుణాలు బోలెడున్నాయి. దానికి తోడు అదిరిపోయే రుచి. అది ఎనర్జీని కూడా ఇస్తుంది. అలాంటి తేనె ఉపయోగాలేమిటో తెలుసుకుందాం.



- దగ్గు వస్తోందా ఓ టీస్పూన్ తేనెను నిమ్మరసంలో కలిపి తాగండి. ఇక దగ్గు మటాష్. పగటి వేళల్లో తేనె, పాలు కలిపి తాగితే.. శరీర అలసట తగ్గుతుంది. ఎనర్జీ పెరుగుతుంది.
- శరీరంలో ఎక్కడైనా గాయాలుంటే.. తేనెను అక్కడ రాసి, నెమ్మదిగా మసాజ్ చెయ్యాలి. తేనె సహజమైన యాంటీబయోటిక్. రోజూ గాయంపై రాస్తుంటే, ఆటోమేటిక్‌గా నయమై పోతుంది. కాలిన గాయాల మీద తేనెను రాయాలి. అంతే.. మచ్చ కూడా లేకుండా గాయం మాయమవుతుంది.
- ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారా.. మీరు తాగే టీలో ఓ స్పూన్ తేనె కలపండి.. టేస్ట్ ఆస్వాదిస్తూ తాగండి.. టెన్షన్ పరార్.

తినరా మైమరచి...



దోశ అంటే ఇష్టపడని వారుండరు... దీనిని వివిధ రకాలుగా తయారు చేసుకుంటూ ఉంటారు. ఉల్లి దోశ, మసాల దోశను తినేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. రోజూ తినే సాధారణ దోశలే కాకుండా.. పాలకూర, కొత్తిమిర, పుదీన, కరివేపాకుతోపాటు, జొన్నలు, స్వీట్‌కార్న్, పన్నీర్ వంటి వాటిని ఉపయోగించి వెరైటీ దోశలను చేసుకోవచ్చు. ఇవి శరీరానికి పోషకాలు అందించటమే కాకుండా... ఎంతో రుచిగానూ ఉంటాయి. ఇలాంటి ఆరోగ్యకరమైన దోశల రెసిపీలు నేటి మానవిలో...

పాలకూరతో..

పాలకూరలో ఉండే ఐరన్, కాల్షియం, విటమిన్లు వంటి పోషకాలు శరీరానికి బోలెడు లాభాలను అందిస్తాయి. అంతేకాకుండా ఇందులో ఫైబర్ కూడా లభిస్తుంది. ఇది శరీర బరువు, రక్తపోటును అదుపులో ఉంచేందుకూ కీలక పాత్ర పోషిస్తుంది.

కావలసిన పదార్థాలు : దోశ పిండి - నాలుగు కప్పులు, పాలకూర - రెండు కప్పులు, పచ్చిమిర్చి - నాలుగు, చిన్న అల్లం ముక్క, దోసెలు



వేసేందుకు - నెయ్యి లేదా నూనె, పసుపు - కొద్దిగా, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం: ముందుగా ఒక గిన్నెను స్టౌవ్‌పై పెట్టుకుని నాలుగు కప్పుల నీరు పోసి వేడు చేసుకోవాలి. అందులో పసుపు పొడి వేసి బాగా మరిగించాలి. నీరు మరుగుతుండగా.. అందులో శుభ్రంగా కడిగిన పాలకూర, పచ్చి మిర్చి అల్లం వేసి 3 నుంచి 4 నిమిషాలు ఉడికించాలి. ఉడికిన తర్వాత నీటి నుంచి పాలకూరను తీసి చల్లారనివ్వాలి. ఆ తర్వాత పాలకూర, పచ్చి మిరపకాయలు, అల్లంను మెత్తని పేస్టులాగా మిక్సీ వేసుకోవాలి. ఈ పేస్టును దోశ బ్యాటర్‌లో వేసి బాగా కలపాలి. పిండిని బాగా కలిపిన తర్వాత పెనం వేడి చేసి, 1/2 టీస్పూన్ నెయ్యి లేదా నూనె వేసి దోశను వేసుకొవాలి. దోశ లేత గోధుమ రంగు వచ్చేంత వరకు రోస్ట్ చేసుకోవాలి. అంతే పాలక్ దోశ రెడీ! మీకు నచ్చిన చట్నీతో సర్వ్ చేసుకోండి.

జొన్న పిండితో..

జొన్న పిండి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నిజానికి డయాబెటిస్ బారిన పడినవారు సాధారణ దోశల కంటే జొన్న పిండితో చేసిన దోశలు తినడం చాలా మంచిది. ఈ జొన్న దోశలు క్రిస్పీగా రుచిగా ఉంటాయి. దీన్ని ఎప్పటికప్పుడు ఇన్‌స్టెంట్‌గా తయారు చేసుకోవచ్చు.

కావలసిన పదార్థాలు : జొన్న పిండి - అరకప్పు, బియ్యంపిండి - పావు కప్పు, కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు.

తయారీ విధానం : ముందుగా ఒక గిన్నెలో జొన్న పిండిని తీసుకోవాలి. ఉండలు కట్టకుండా బాగా కలుపుకోవాలి. అందులోనే బియ్యంపిండిని కూడా వేసి బాగా కలపాలి. ఇప్పుడు నీళ్లు పోసుకుని దోశలు వేయడానికి సరిపడేలా పలుచగా ఉండేటట్టు పిండిని అడ్జస్ట్ చేసుకోవాలి. ఉండలు లేకుండా చూసుకోవాలి. ఈ మిశ్రమంలోనే సన్నగా



తరిగిన ఉల్లిపాయలు, సన్నగా తరిగిన కొత్తిమీర, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పు, జీలకర్ర, కరివేపాకు తరుగు వేసి బాగా కలుపుకోవాలి. ఒక పది నిమిషాలు పక్కన పెట్టాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనాన్ని పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక ఈ పిండిని దోశలాగా పలచగా వేసుకోవాలి. రవ్వ దోశలు ఎలా వేస్తారో అలా పలుచగా వేసుకుంటే ఇవి క్రిస్పీగా వస్తాయి. రెండు వైపులా ఎర్రగా కాలాక కొబ్బరి చట్నీతో తింటే చాలా రుచిగా ఉంటాయి.

సోయాతో..

డయాబెటిక్ పేషెంట్ల కోసం కొన్ని ప్రత్యేక బ్రేక్ ఫాస్ట్ రెసిపీలు ఉన్నాయి. అందులో సోయా దోశ ఒకటి. దీన్ని తినడం వల్ల శక్తి వస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. పైగా రుచిగా కూడా ఉంటుంది. దీన్ని చేయడానికి ఎక్కువ సమయం కూడా పట్టదు.

కావలసిన పదార్థాలు : సోయా పాలు - ఒక కప్పు, కొత్తిమీర తరుగు - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, పచ్చిమిర్చి తరుగు - ఒక స్పూను, ఉల్లిపాయ తరుగు - అరకప్పు, నూనె - సరిపడినంత, గోధుమపిండి - పావు కప్పు, బేకింగ్ సోడా - చిటికెడు,

తయారీ విధానం : ఒక గిన్నెలో గోధుమపిండి, సోయా పాలు వేసి బాగా కలపాలి. సన్నని పచ్చిమిర్చి తరుగు, ఉల్లిపాయ తరుగు,



కొత్తిమీర తరుగు, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. కొద్దిగా నీళ్ళను వేసి దోశ పిండిలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పావుగంటపాటు నాననివ్వాలి. పెనం మీద రవ్వ దోసెలా వేసుకొని రెండు వైపులా ఎర్రగా కాల్చుకోవాలి. దీన్ని కొబ్బరి చట్నీతో, టమాటో చట్నీ, సాంబార్.. .ఇలా దేనితో తిన్నా చాలా టేస్టీగా ఉంటుంది.

స్వీట్ కార్న్‌తో

స్వీట్ కార్న్ మార్కెట్లో అధికంగానే లభిస్తుంది. దీన్ని చేయడం చాలా సులువు. పిల్లలు ఇష్టంగా తింటారు. ఎప్పుడు ఒకేలాంటి దోశ తిని బోర్ కొట్టిన వారికి ఈ స్వీట్ కార్న్ దోశ నచ్చడం ఖాయం. దీన్ని సులువుగా ఎలా చేయాలో చూద్దాం.

కావలసిన పదార్థాలు : బియ్యం - ఒక కప్పు, స్వీట్ కార్న్ - ఒక కప్పు, జీలకర్ర - కొద్దిగా, పచ్చిమిర్చి - నాలుగు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం : బియ్యాన్ని నాలుగు గంటల పాటు ముందుగానే నానబెట్టుకోవాలి. తర్వాత మిక్సీలో ఆ బియ్యాన్ని వేసి మెత్తగా రుబ్బుకోవాలి. అందులోనే స్వీట్ కార్న్, జీలకర్ర, పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పును కూడా వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. దీన్ని పావుగంట సేపు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయాలి. ఈ పిండిని దోశలాగా



వేసుకోవటమే. రెండు వైపులా ఎర్రగా కాల్చుకొని సర్వ్ చేసుకోవాలి. టమాటా చట్నీతో, పల్లీల చట్నీతో తింటే చాలా బాగుంటుంది. పిల్లలకు ఇది మంచి బ్రేక్ ఫాస్ట్ రెసిపీ.

కొత్తిమీర, పుదీనాతో

కొత్తిమీర, పుదీనా, కరివేపాకులతో చేసే దోశ ఇది. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. హై బీపీతో బాధపడేవారు, డయాబెటిస్‌తో బాధపడేవారు కూడా ఈ దోశ తినవచ్చు. ఒకసారి దీన్ని చేసుకొని తిని చూడండి. ఇంటిల్లిపాదికి నచ్చుతుంది.

కావాల్సిన పదార్థాలు : కొత్తిమీర తరుగు - ఒక కప్పు, పుదీన - ఒక కప్పు, కరివేపాకులు తరుగు - అరకప్పు, బియ్యం - ఒక కప్పు, మినపప్పు - పావు కప్పు, మెంతులు - కొద్దిగా.

తయారీ విధానం : బియ్యం,



మినపప్పు, మెంతులు నాలుగైదు గంటల పాటు నానబెట్టుకోవాలి. తర్వాత వాటిని గ్రైండర్లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఆ మిశ్రమాన్ని తీసి ఒక గిన్నెలో వేసుకోవాలి. ఇప్పుడు కొత్తిమీర, పుదీనా, కరివేపాకులని మిక్సీ జార్లో వేసి మెత్తగా రుబ్బి... ఆ మిశ్రమాన్ని కూడా అందులో కలిపేయాలి. రుచికి సరిపడా ఉప్పును వేసి బాగా కలపాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. దోశ పిండిలో జీలకర్ర వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయాలి. దానిపై దోశెలు వేసుకోవాలి. పైన ఉల్లిపాయ, పచ్చిమిర్చి తరుగును చల్లుకోవాలి. అంతే టేస్టీ గ్రీన్‌తో సహా రెడీ అయినట్టే. కొత్తిమీర, పుదీనా, కరివేపాకులు అధికంగా వేసాము. కాబట్టి ఇది ఆకుపచ్చని రంగులో వస్తుంది. ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది.

పాలు విరిగిపోతున్నాయా.?

పాలు లేనిదే రోజు గడవదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఉదయం లేవగానే ఇంట్లో పాలు ఉంటేనే పని ముందుకు సాగుతుంది. అప్పుడప్పుడు పాలు విరిగిపోతూ వుంటాయి. మనలో చాలా మంది ఇలాంటి సమస్యను ఎదుర్కొంటూనే వుంటాం. అయితే కొన్ని సహజ చిట్కాలు పాటించడం ద్వారా పాలు విరిగిపోకుండా చూసుకోవచ్చు.

పాలు విరిగిపోకుండా ఉండాలంటే ఎక్కువసార్లు వేడి చేయాలి. ముఖ్యంగా పశువుల నుంచి పాలు పితికిన కొద్ది గంటలకు వేడి చేయకపోతే... విరిగిపోతుంటాయి.



కాబట్టి పాలు పితికిన వెంటనే వేడి చేసుకోవటం మంచిది.

ఇక వేడి చేసిన పాలు చల్లారిన తర్వాత ఫ్రిజ్‌లో స్టోర్ చేయాలి. ఇలా చేస్తే పాలు విరగకుండా ఉంటాయి. ఫ్రిజ్ లేనివారు అయితే ప్రతీ ఆరేడు గంటలకు ఒకసారి పాలను వేడి చేసుకోవాలి. ఇలా చేస్తే పాలు విరిగిపోకుండా ఉంటాయి.

ఇక వేడి చేసిన తర్వాత పాలను గాలి చొరబడకుండా ఉండేలా బాటిల్స్ లేదా ఎయిర్ టైట్‌గా వుండే బాక్సుల్లో స్టోర్ చేయాలి. ఇలా చేయడం వల్ల కూడా పాలు విరిగిపోకుండా ఉంటాయి.

ఈ టిప్ అందరికీ తెలిసిందే. పాలను వేడి చేసే ముందు ఒక చిటికెడు బేకింగ్ సోడా వేసుకుని మరిస్తే పాలు విరగవు.

పాలను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే సమయంలో టెంపరేచర్ 32 డిగ్రీల ఫారన్‌హీట్ నుంచి 39.2 డిగ్రీల ఫారన్‌హీట్ మధ్యలో ఉండేలా చూడాలి. ఇలా చేస్తే పాలు చల్లగా ఉండి పగలకుండా వుంటాయి.

సహకార బలోపేతానికి కొత్త అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)

కాదని ఈ సందర్భంగా మోడీ పునరుద్ఘాటించారు. సమస్యలకు పరిష్కారాలు యుద్ధ రంగంలో లభించవన్నారు. చర్చలు, దౌత్యంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని నొక్కి చెప్పారు. తీవ్రవాదం ఏ రూపంలో వున్నా ఆమోదయోగ్యం కాదని, ఏ రకంగానూ దాన్ని సమర్థించలేమని మోడీ పేర్కొన్నారు. గత 40ఏండ్లలో భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. రష్యా-ఉక్రెయిన్ శాంతి ప్రక్రియకు సంబంధించి చూసినట్లైతే భారత్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, కావాలంటే తటస్థ దేశంగా తమ దేశంలో చర్చలు జరుపుకోవచ్చని నెహమార్ పేర్కొన్నారు. ప్రధానంగా ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంపై కూలంకషంగా చర్చించామని చెప్పారు. ఈ యుద్ధంపై యురోపియన్ దేశాల ఆందోళనలు, ఇబ్బందులను భారత్‌కు తెలియచేసినట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో ఘర్షణలపై కూడా సుదీర్ఘంగా చర్చించామన్నారు. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, అందువల్ల శాంతి ప్రక్రియలు, భవిష్యత్ శాంతి సదస్సులకు సంబంధించి భారత్‌ది చాలా కీలకమైన పాత్ర అని నెహమర్ చెప్పారు.

ఐఎస్‌డబ్ల్యూఏఎస్‌ఐ ప్రతినిధులతో సీఎం భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్‌నేషనల్ స్పిరిట్స్, వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఐఎస్‌డబ్ల్యూఏఎస్‌ఐ) ప్రతినిధులతో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఇతర అంశాలపై సీఎం వారితో చర్చించారు. ఐఎస్‌డబ్ల్యూఏఎస్‌ఐ అనే సంస్థ జాతీయ, అంతర్జాతీయ ప్రీమియం స్పిరిట్స్, వైన్ బ్రాండ్‌లను తయారు చేసే కంపెనీలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో కొత్తగా పలు లిక్కర్ కంపెనీలకు ఇటీవల అనుమతివ్వడం వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో వాటికి ప్రాతినిధ్యం వహించే సంఘం సీఎంను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. త్వరలో రాష్ట్రంలో మరిన్ని కొత్త లిక్కర్ కంపెనీలు తమ పెట్టుబడులను పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు

వారూ భరణానికి అర్హులే

న్యూఢిల్లీ : విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు భరణానికి అర్హులేనని సుప్రీంకోర్టు బుధవారం చారిత్రక తీర్పు ఇచ్చింది. ఏ మతం వారైనా విడాకులు తీసుకున్న మహిళలు సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 ప్రకారం భరణం పొందేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. సీఆర్‌పీసీలోని 'రెలిజియస్ న్యూట్రల్' సెక్షన్ ప్రకారం ముస్లిం మహిళలు తన భర్త నుండి భరణం కోరవచ్చునని జస్టిస్ బీవీ నాగరత్న జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌తో కూడిన డివిజన్ బెంచ్ తెలిపింది. న్యాయమూర్తులు వేర్వేరుగా తీర్పును రాసినప్పటికీ ఒకే విధమైన తీర్పు ఇచ్చారు. భరణం కోరేందుకు భార్యకు హక్కు ఉన్నదని ఈ నెల 1వ తేదీకి ముందు అమలులో ఉన్న సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 చెబుతోంది. ఈ సెక్షన్ ముస్లిం మహిళలకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు తాజాగా తేల్చి చెప్పింది.

తీర్పులో ఏముంది?

'కేవలం వివాహిత మహిళలకు మాత్రమే కాకుండా సీఆర్‌పీసీ సెక్షన్ 125 మహిళలందరికీ వర్తిస్తుంది. అందువల్ల క్రిమినల్ అప్పీలును తిరస్కరిస్తున్నాము' అని తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ నాగరత్న తెలిపారు. భరణం అనేది దాతృత్వం కాదని, అది వివాహిత మహిళలందరి హక్కు అని, మతం ఏదైనా వివాహిత మహిళలందరికీ అది వర్తిస్తుందని డివిజన్ బెంచ్ వివరించింది.

1986వ సంవత్సరపు ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం సెక్యులర్ చట్టాన్ని అతిక్రమించదని తెలిపింది. భారతీయ వివాహిత మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదన్న వాస్తవాన్ని గుర్తించాలని అంటూ కాబట్టి తన భార్యకు ఆర్థిక మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత భర్తదేనని పేర్కొంది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 వివాహిత మహిళలకే కాకుండా సహజీవనం సాగిస్తున్న వారితో సహ మహిళలందరికీ వర్తిస్తుందని చెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద పిటిషన్ పెండింగులో ఉన్న సమయంలో ముస్లిం మహిళ విడాకులు తీసుకుంటే సదరు మహిళ సెక్షన్ 125 ప్రకారం కోర్టులో కేసును కొనసాగిస్తూనే 2019 నాటి ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) చట్టం కింద కూడా కోర్టును ఆశ్రయించవచ్చునని తెలిపింది.

కేసు పూర్వాపరాలు

పోషణకు సంబంధించి కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించిన నేపథ్యంలో దానిని సవాలు చేస్తూ మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళ సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 ప్రకారం భరణం కోరేందుకు అర్హురాలు కాదని సమద్ వాదించారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వాసిం ఖాద్రీ వాదనలు విన్న అనంతరం సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో న్యాయస్థానానికి సాయపడేందుకు గౌరవ్ అగర్వాల్‌ను అమికస్ క్యూరీగా నియమించింది.

సమద్ తన మాజీ భార్యకు భరణాన్ని ఇవ్వాల్సిందేనని కుటుంబ న్యాయస్థానం తీర్పు చెప్పింది. అయితే తాత్కాలిక నెలసరి భరణాన్ని రూ.20 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించింది. పిటిషన్ దాఖలు చేసిన తేదీ నుండి ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది. దీనిపై సమద్ తెలంగాణ హైకోర్టుకు వెళ్లగా గత సంవత్సరం డిసెంబర్ 13న ఈ ఆదేశాలను న్యాయస్థానం కొట్టివేయలేదు. 2017లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు తీసుకున్నామని, ఇందుకు సంబంధించి విడాకుల సర్టిఫికెట్ కూడా ఉన్నదని, అయితే దీనిని కుటుంబ న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదని హైకోర్టులో సమద్ వాదించారు.

డీజీపీగా జితేందర్

(మొదటిపేజీ తరువాయి)

ఏఎస్పీగా ఆయన తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బెల్లంపల్లి ఏఎస్పీగా, గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ రేంజ్ డీఐజీగా, సీఐడీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జైళ్ల శాఖ అధిపతిగా, నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా, రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీగా వివిధ హోదాల్లో బాధ్యతలను నిర్వహించి సమర్థుడైన పోలీసు అధికారిగా పేరు పొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహించారు. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా డాక్టర్ రవిగుప్తా సచివాలయానికి వెళ్లి బాధ్యతలను స్వీకరించారు. డీజీపీగా నియమితులైన సమయంలో ఆయన ఇదే శాఖలో ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆరు నెలల్లో రాష్ట్ర డీజీపీగా ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పనిచేశారు.

నేరరహిత రాష్ట్రమే లక్ష్యం : కొత్త డీజీపీ

తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమనీ, ఆ దిశగా రాష్ట్ర పోలీసు శాఖను ముందుకు నడిపిస్తానని కొత్త పోలీసు బాస్ జితేందర్ అన్నారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టాక ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో శాంతిని సుస్థిరంగా నెలకొల్పేలా తన చర్యలుంటాయని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. ముఖ్యంగా సైబర్‌నేరాలు, మాదకద్రవ్య పదార్థాల రవాణా, వినియోగం పెద్ద సవాలుగా మారిందనీ, వాటిని అరికట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీసు శాఖ సమిష్టి బాధ్యతతో నడిచేలా చర్యలు తీసుకుంటాననీ, మాదకపదార్థాల నిరోధానికి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉన్నప్పటికీ దాంతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని చెప్పారు. మావోయిస్టుల కార్యకలాపాలు రాష్ట్రంలో దాదాపు లేకుండా సమసిపోయాయనీ, అయినప్పటికీ ప్రభావిత రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ఆ సమస్యపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన సచివాలయానికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఓయూలో కొనసాగుతున్న ఆందోళనలు

సీఎం దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్‌వీ నాయకుల యత్నం

అరెస్టు చేసిన పోలీసులు

జర్నలిస్టు పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన

ఓయూ పోలీస్ స్టేషన్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధుల నిరసన

నవతెలంగాణ- ఓయూ

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని ఓయూలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనల నేపథ్యంలో బుధవారం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కవరేజ్‌కు వెళ్లిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్‌పై పోలీసుల దురుసుగా ప్రవర్తించడంతో కాస్త ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిరుద్యోగ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్‌వీ నాయకులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు కవరేజీకి వెళ్లిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ శ్రీచరణ్ పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ అరెస్టు చేయడంతో యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మీడియా ప్రతినిధుల పట్ల పోలీసుల వైఖరిని నిరసిస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు ఓయూ పోలీస్ స్టేషన్ ముందు బైటాయించి ఆందోళన చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థుల పట్ల, మీడియా ప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఏఐఎస్ఎఫ్. పీడీఎస్‌యూ, టీజీవీపీ, ఓయూ జేఏసీ, బీఆర్ఎస్‌వీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి, వర్సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం.. బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కులను, స్వేచ్ఛను కాలరాయడమేనని, జర్నలిస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని పలువురు విద్యార్థులు విద్యార్థి సంఘాల ప్రతినిధులు అన్నారు.

లీకు వీరుడు బేడీ రామ్

(మొదటిపేజీ తరువాయి)

బ్రజేష్ పాఠక్, కేశవ్ ప్రసాద్ మౌర్యలతో సహా సీనియర్ బీజేపీ నాయకులతో కలిసి ఉన్న ఆయన ఫోటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. "మీకు ఏదైనా విభాగంలో ఉద్యోగం కావాలంటే, ఫారమ్ నింపిన తర్వాత బేడీ రామ్‌కి కాల్ చేయండి. ఆయన కొంత వరకు పరిష్కరించటం ఖాయం" అని ఎస్‌బీఎస్‌పీ చీఫ్ ఓ.పి రాజ్‌భర్ చెప్తున్నట్టుగా ఒక వీడియోలో ఉన్నట్టు ఒక ఆంగ్ల వార్త కథనం వివరించింది.

హిస్టరీ షీట్ ప్రకారం బేడీ రామ్‌పై లక్నోలో నాలుగు, జౌన్‌పూర్‌లో రెండు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రెండు, రాజస్థాన్‌లో ఒక కేసులు ఉన్నాయి. ఆయనపై వచ్చిన అభియోగాలలో ఐపీసీలోని సెక్షన్ 419, 420, 468, 120బి(నేరపూరిత కుట్ర)ల కింద కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు బేడీ రామ్‌పై ఈ కింది అభియోగాలు కూడా నమోదయ్యాయి.

రాజస్థాన్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (అన్యాయమైన మార్గాల నివారణ) చట్టం, 1992లోని సెక్షన్లు 4,6(ప్రశ్నపత్రాన్ని అనధికారికంగా కలిగి ఉండటం లేదా బహిర్గతం చేయటం), యూపీ-గ్యాంగ్‌స్టర్ చట్టం, 1986లోని సెక్షన్‌లు 2,3(నేరం చేయడానికి ముందు లేదా తర్వాత ముఠా సభ్యునికి చట్టవిరుద్ధంగా సహాయం చేసిన లేదా మద్దతు ఇచ్చిన పబ్లిక్ సర్వెంట్‌కు శిక్ష), ఉత్తరప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (అన్యాయమైన మార్గాల నివారణ) చట్టం, 1998లోని సెక్షన్లు 3,4,5,9,10(అనధికారికంగా స్వాధీనం చేసుకోవడం, ప్రశ్నపత్రాన్ని బహిర్గతం చేయడం, పరీక్షా పనిని అప్పగించిన వ్యక్తి ద్వారా లీకేజీ, రెండింటికీ జరిమానాలు, అన్యాయమైన మార్గాలు, వనరుల వినియోగం వంటివి ఉన్నాయి.

2022లో రిటర్నింగ్ అధికారికి సమర్పించిన బేడీ రామ్ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. ఈ కేసులు రాజస్థాన్, లక్నోలో రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్షలు, భోపాల్‌లో ఎంపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలు, జౌన్‌పూర్‌లో పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించినవి. 2006 నుంచి 2016 మధ్య ఆయనపై ఈ కేసులు నమోదయ్యాయి. 2006లో రైల్వే ఎగ్జామ్ లీక్ కారణంగా బేడీ రామ్, మరో 15 మంది అరెస్టయ్యారు. 2006 సంవత్సరంలో, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఆర్ఆర్‌బీ) భారత్ అంతటా మూడు దశల్లో గ్రూప్-డి రిక్రూట్‌మెంట్ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించింది. రెండో దశ పరీక్ష 26 ఫిబ్రవరి 2006న జరగాల్సి ఉంది. అయితే, కొంత మంది ఈ ప్రశ్నపత్రాన్ని సంపాదించినట్టు పోలీసు అధికారి భగత్‌కు సమాచామందింది. అనంతరం నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పేపర్ లీకైనట్టు గమనించిన రైల్వే బోర్డు పరీక్షను రద్దు చేసింది. దాదాపు 16 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. బేడీ రామ్ సహా 16 మందిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, అడ్మిట్ కార్డుల నకలు, ప్రశ్నపత్రం కాపీలు స్వాధీనం చేసుకున్నారు. 'గ్యాంగ్ లీడర్' బేడీరామ్‌ను విచారించినప్పుడు.. ప్రతి అభ్యర్థి నుంచి రూ. 1-1.5 లక్షలు తీసుకున్నట్టు ఒప్పుకున్నాడు.

'బేడీ రామ్‌పై చట్టపరమైన చర్యలు అవసరం'

రైల్వే లోకో పైలట్ పరీక్షలో పేపర్ లీకైందన్న ఆరోపణలపై బేడీ రామ్‌ను 2014, జులై 17న లక్నో నుంచి స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్టీఎఫ్) అరెస్టు చేసింది. యూపీ ఎస్టీఎఫ్ అధికారి త్రివేణి సింగ్ ఆ సమయంలో మాట్లాడుతూ.. "బేడీ రామ్ లొసుగులను ఉపయోగించుకోవటంలో నిపుణుడు. ఆయనకు రైల్వేలో బలమైన సంబంధాలున్నాయి. పరీక్షా పత్రాలను ప్రచురించటానికి టెండర్లు పొందిన ప్రింటింగ్ హౌస్‌ల గురించి ఆయనకు అవగాహన ఉన్నది" అని చెప్పారు.

'ఎంపీపీఎస్సీ, ఛత్తీస్‌గఢ్ పీఎంటీ పేపర్ లీక్‌లో బేడీ రామ్ పేరు'

మీడియా నివేదికల ప్రకారం.. బేడీ రామ్ 2006లో పేపర్ లీక్ కేసులో అరెస్టయిన తర్వాత సర్వీస్ నుంచి తొలగించబడే వరకు రైల్వే ఉద్యోగి(చీఫ్ టిక్కెట్ కలెక్టర్). 2008లో ఆర్ఆర్‌బీ లోకో పైలట్ పరీక్ష, 2009లో భోపాల్, జైపూర్‌లలో జరిగిన రైల్వే పరీక్షల ప్రశ్న పత్రాలను లీక్ చేసినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. 2013లో ఎంపీపీఎస్సీ, 2014, మేలో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఆయుర్వేద వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలను లీక్ చేయడంలో బేడీ రామ్ పేరు కూడా వినిపించింది. ఆయుర్వేద పరీక్ష రద్దు కాగా, ఎంపీపీఎస్సీ పరీక్షకు సంబంధించిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. బేడీ రామ్ ఒక్కో అభ్యర్థి రూ.30-40 లక్షలకు పేపర్లు విక్రయించినట్టు సమాచారం. 2012లో ఎంపీపీఎస్సీ ప్రశ్నపత్రాలను బీహార్‌కు చెందిన ముఠా ప్రింటింగ్ ప్రెస్ ద్వారా లీక్ చేసి 50 మంది అభ్యర్థులకు విక్రయించినట్టు మధ్యప్రదేశ్ ఎస్టీఎఫ్ దర్యాప్తులో తేలింది. బీహార్ గ్యాంగ్‌కు యూపీలో ఉన్న బేడీ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నదని కొన్ని వార్త కథనాలు ఆరోపించాయి. 2011లో ఛత్తీస్‌గఢ్ పోలీసులు రాష్ట్ర పరీక్షా బోర్డు నిర్వహించిన ప్రీ-మెడికల్ టెస్ట్(పీఎంటీ) ప్రశ్నపత్రాలు లీక్ కావటంతో కేసు నమోదు చేశారు. 2015లో ఛత్తీస్‌గఢ్ కోర్టు 'కింగ్‌పిన్' బేడీరామ్‌తో సహా ఐదుగురు నిందితులను దోషులుగా నిర్ధారించి ఆరేండ్ల జైలు శిక్ష విధించింది. అయితే, అప్పుడు బేడీ రామ్ పరారీలో ఉన్నాడు. 2016 మే 25న మధ్యప్రదేశ్ ఎస్టీఎఫ్ గుర్గావ్ నుంచి ఆయనను అరెస్టు చేసింది.

'బేడీ రామ్‌పై ఆరోపణలు నకిలీ, నిరాధారం': ఎస్‌బీఎస్‌పీ

ఢిల్లీ పీఎంటీ పేపర్ లీక్ కేసులో బేడీ రామ్‌ను సీబీఐ 2012లో అరెస్టు చేసినట్టు యూపీ ఎస్టీఎఫ్ అధికారి త్రివేణి సింగ్ ఒక ఆంగ్ల వార్త సంస్థకు తెలిపారు. బెయిల్‌పై విడుదల కాకముందే తీహార్ జైలుకు తరలించినట్టు సమాచారం. అయితే, 2022 ఎన్నికల అఫిడవిట్‌లో బేడీ రామ్ ఈ విషయాన్ని ప్రస్తావించలేదు.బేడీ రామ్‌ను తక్షణ మే అరెస్ట్ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బేడీ రామ్‌పై వచ్చిన ఆరోపణ లన్నీ అబద్ధాలు, నకిలీ, నిరాధారమైనవని ఎస్‌బీఎస్‌పీ జాతీయ అధికార ప్రతినిధి అరుణ్ రాజ్‌భర్ అన్నారు. పాత కేసులను తవ్వేస్తున్నారన్నారనీ, బేడీ రామ్‌కు సీబీఐతో పాటు సుప్రీంకోర్టు కూడా అన్ని కేసుల్లో క్లీన్ చిట్ ఇచ్చిందని చెప్పారు. ఇది ప్రతిపక్షాల కుట్రగా అభివర్ణించారు.

సంకీర్ణమైనా సరళీకరణ విధానాలే

విస్తృత సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్నా సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలే అమలవుతున్నాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఎన్డీయేకు మద్దతు ఇస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ కూడా సరళీకరణ విధానాలను వ్యతిరేకించబోరనీ, వాటికి మద్దతిస్తారని చెప్పారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం దేశానికి ఎంతో ప్రమాదకరమని అన్నారు. కార్పొరేట్ శక్తులకు సేవకుడిగా మోడీ వ్యవహరిస్తారని విమర్శించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, జాన్‌వెస్లీ, మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్ అధ్యక్ష వర్గంగా సమావేశం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ భారత్ అభివృద్ధిని చూసి ప్రపంచమంతా దిగ్భ్రాంతికి గురవుతున్నదంటూ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఈ పదేండ్లలో అంత అభివృద్ధి జరిగితే బీజేపీకి 303 నుంచి 240కి సీట్లు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. మోడీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిందని చెప్పారు. బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయేకు 400కుపైగా సీట్లు వస్తాయన్నారనీ, చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు ఆ పార్టీకి 240 సీట్లు వచ్చాయన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో రాజకీయ పార్టీలను చీల్చిందనీ, ఇద్దరు సీఎంలను జైల్లో పెట్టిందనీ, ప్రతిపక్ష నాయకులను అణచివేసిందని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్లలో 8 వేల కోట్లు బీజేపీకి వచ్చాయని చెప్పారు. 80 శాతం మీడియా, సోషల్ మీడియా, కార్పొరేట్ శక్తులు ఆ పార్టీకి వత్తాసు పలికాయని అన్నారు. అయినా బీజేపీ సీట్లు తగ్గాయని వివరించారు. ప్రధాని మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేశాక అసలు పాలన ముందుందంటున్నారని చెప్పారు. ఈనెల 22 నుంచి పార్లమెంటు సమావేశాలున్నాయనీ, 23న కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలను మోడీ ప్రభుత్వం ముమ్మరం చేస్తుందన్నారు.

ఉత్తరాదిన బీజేపీకి ఎదురుదెబ్బ

ఉత్తరాదిన బీజేపీకి సీట్లు తగ్గాయని రాఘవులు వివరించారు. యూపీ, మహారాష్ట్ర, బెంగాల్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని చెప్పారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా బీజేపీకి సీట్లు రావడంతో అధికారంలోకి వచ్చిందన్నారు. హిందూత్వ మతోన్మాదాన్ని దేశమంతా వ్యాపించినా సీట్లు తగ్గాయని విమర్శించారు. కేరళలో బీజేపీ ఒక్కస్థానంలో గెలిచిందని అన్నారు. అక్కడ సీపీఐ(ఎం), వామపక్షాల ఓట్లు చేరి ఆ పార్టీకి రావడం ఆందోళనకరమని చెప్పారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలున్నా చేజేతులా పోగొట్టుకుందని వివరించారు. మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని మోడీ ఏర్పాటు చేసినా వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలను అణచివేస్తారని చెప్పారు. మతోన్మాద ప్రమాదం పొంచి ఉందన్నారు. దేశంలో బీజేపీ పెరుగుదలను ఇండియా బ్లాక్ నిరోధించిందని చెప్పారు. బీజేపీని వదిలించుకోవడమే కర్తవ్యమంటూ ఆ కూటమిలోని పార్టీలు పనిచేశాయనీ, ప్రజల్లో భరోసాను కల్పించాయని వివరించారు. ఇండియా బ్లాక్ విచ్ఛిన్నం కాకుండా సీపీఐ(ఎం) విశేష కృషి చేసిందన్నారు. కేరళలో సీపీఐ(ఎం)ను ఓడించాలంటూ రాహుల్, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ మాట్లాడారని గుర్తు చేశారు. తాము నష్టపోయినా దేశం నష్టపోకుండా సంయమనంతో వ్యవహరించామని చెప్పారు. మమతా బెనర్జీకి నష్టం కలగకుండా బెంగాల్‌కు కాంగ్రెస్ ముఖ్యనాయకులెవరూ రాలేదన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడ్డమే సీపీఐ(ఎం) లక్ష్యమని చెప్పారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంటూనే దేశభక్తిని చాటుకున్నామని అన్నారు.

తెలంగాణలో బీజేపీని నిలువరించాలి

తెలంగాణలో నాలుగు నుంచి ఎనిమిది సీట్లకు బీజేపీకి పెరిగిందని రాఘవులు చెప్పారు. 19 నుంచి 35 శాతానికి ఓట్ల శాతం పెరిగిందన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి కూడా నెరవేర్చాలని కోరారు. ఫెడరల్ హక్కుల మీద కేంద్రం దాడి చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాలకు నిధులను తగ్గించడం కోసం పనగారియా నేతృత్వంలో ఫైనాన్స్ కమిషన్‌ను నియమించిందని గుర్తు చేశారు. పన్నుల్లో 30 శాతం వాటాను రాష్ట్రాలకు కేంద్రం ఇస్తున్నదనీ, దాన్ని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. తమ నిధుల కోసం కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఢిల్లీలో వేర్వేరుగా ధర్నా చేశాయని గుర్తు చేశారు. అదే తరహాలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జీఎస్టీకి ఎక్కువ పన్నులు రాకుండా ఉండేందుకు కేంద్రం సెస్‌ల రూపంలో వసూలు చేస్తున్నదని చెప్పారు. అందులో రాష్ట్రాలకు వాటా లేదన్నారు. రాష్ట్రాలకూ సెస్ వసూళ్లలో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళనల్లో కాంగ్రెస్ ప్రభుత్వం భాగస్వామి కావాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు, లేబర్ కోడ్‌లు కేంద్రం తెచ్చిందనీ, వాటిని అమలు చేయబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. ఆశాలకు పరీక్ష పెట్టాలని కేంద్రం చెప్తే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు.

ప్రజలకు నష్టం చేసే విధానాలను అమలు చేయబోమంటూ కేంద్రాన్ని ఎదిరించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం ఒత్తిడి తెస్తున్నదని అన్నారు. అప్పులు చేసుకోనివ్వకుండా ఆంక్షలు విధిస్తున్నదని విమర్శించారు. కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి రూ.ఐదు వేల కోట్లు అప్పు తెచ్చుకుందని గుర్తు చేశారు. మెదక్ జిల్లాలో బీజేపీ నాయకులు మైనార్టీల ఆస్తులను ధ్వంసం చేశారని చెప్పారు. ఆ ఘటనలను కాంగ్రెస్ ఖండించలేదన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధికి హానికరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెంచేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. అసంతృప్తి రాకుండా హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ హామీలపై చెప్పే కిషన్‌రెడ్డి కేంద్రం హామీలు, ప్రజలపై మోపే భారాలపై చెప్పే దమ్మూధైర్యం ఉందా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీని ఒంటరిపాటు చేసి నిలువరించాలని పిలుపునిచ్చారు.

మతోన్మాదంపై పోరాడాలి

'ఈ దేశానికి మతోన్మాదం పనికిరాదు. లౌకికవాదం కావాలి. నిరంకుశత్వం వద్దు. ప్రజాస్వామ్యం కావాలి. సనాతన ధర్మం సృష్టించే మనువాదం ఉండొద్దు. సమానత్వం కావాలి. కులవివక్ష ఉండొద్దు, సామాజిక న్యాయం కావాలి.'అని రాఘవులు చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మనువాద రాజ్యాంగాన్ని తేవాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఈ లక్ష్యాలు సాధించాలంటే కమ్యూనిస్టులతోపాటు రాజ్యాంగాన్ని, దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడే వారు కలిసి రావాలని కోరారు. సమస్య ప్రాతిపదికన కేంద్రానికి మద్దతుపై నిర్ణయం తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించడం రాజకీయం కాదనీ, లొంగుబాటుతనం అవుతుందన్నారు. అవకాశవాదంతో వ్యవహరించడం సరైంది కాదని చెప్పారు. బీజేపీతో అంటకాగిన బీజేడీ, వైసీపీ పరిస్థితి ఏ విధంగా ఉందో చూడాలన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్ ఉండాలంటే సమస్యలపై నిక్కచ్చిగా పోరాడాలనీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేయాలని చెప్పారు. అవకాశవాద రాజకీయాలను విడనాడాలని సూచించారు. దేశ సమైక్యత, సమగ్రత, సంక్షేమాన్ని కోరుకునే వారు కలిసి రావాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వంపై పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, పాలడుగు భాస్కర్, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించాలి

- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్
- విస్తృత సమావేశంలో తీర్మానం ఏకగ్రీవ ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏడు నెలల పాలన పూర్తయిందనీ, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్నదని చెప్పారు. గృహజ్యోతి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రైతుభరోసా కింద పంట పెట్టుబడిసాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడేలా బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించి అమలు చేయాలని కోరారు. ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి, ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయ ప్రణాళికను వెంటనే ప్రకటించాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలనీ, ఖాళీపోస్టులను భర్తీ చేయాలని కోరారు. హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతి ప్రకటించాలని చెప్పారు. పెన్షన్లు పెంచాలన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాలనీ, ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని అన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన వారందరికీ హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని రకాల పెండింగ్ బిల్లులను చెల్లించాలనీ, బకాయిలను విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని చెప్పారు. కార్మికుల కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకను గుణంగా సవరించాలనీ, కొత్త జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ బలపరిచారు. దాన్ని విస్తృత సమావేశంలో ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886